మంగళవారం
17•3•2020
కరీంనగర్
• వెల. రూ. 6.50
• సంపుటి 9 • సంచిక 262
• పేజీలు : 12 + 12

# నమస్తే తెలంగాణ

మన రాష్ట్రం • మన పత్రిక
WWW. NTNEWS.COM
/NTDAILYONLINE
PUBLISHED FROM KARIMNAGAR I HYDERABAD I WARANGAL I KHAMMAM I NALGONDA I MAHABUBNAGAR I NIZAMABAD






మరి నేనొక మాట అడుగుతా సమాధానం చెప్తారా ప్రశ్నించేటోళ్లు! సర్పంచ్ నుంచి దేశ ప్రధాని దాకా.. ప్రజలు ఓటర్ కార్డు చూపించి ఓటు వేస్తేనే ఎన్నికవుతారు. ఆ ఓటరు ఐడెంటిటీ కార్డు ఇప్పుడు పనికిరాదట. భారతీయుడివి అవునా.. కాదా అని రుజువు చేసుకోవాలంటే కార్డు పనిచేయదట. డ్రైవింగ్ లైసెన్స్, ఆధార్ కార్డు, రేషన్ కార్డు.. ఇవేవీ పనిచేయవు. మరి ఇంకేం పనిచేస్తది? దేశ ప్రభుత్వాన్ని ఏ ఓటర్ ఐడీ కార్డయితే ఎన్నుకున్నదో ఆ ఓటర్ ఐడెంటిటీ కార్డే పనికిరాదంటే మీ ప్రభుత్వం ఉన్నదనుకోవాలా లేదనుకోవాలా..?

## ..ఇది రాజ్యాంగ విలువలకు విరుద్ధం

50 మంది పైచిలుకు పౌరులు ఢిల్లీలో చనిపోయారు. అది మత కల్లోలమా, వేరే కల్లోలమా.. ఏదైనా కావచ్చు. పార్లమెంట్ సభ్యులు, మంత్రులుగా ఉన్నవారి నోట చాలా దుర్మార్గమైన వ్యాఖ్యలు కూడా విన్నాం. చాలా బాధాకరం. 70 ఏండ్ల స్వతంత్రం తర్వాత.. ఇంత పరిణతి వచ్చిన తర్వాత.. 'గోలీమారో సాలోంకో..' అని అంటే ఇదేం భాష? ఎక్కడి బాధ్యత? ఇది ఈ దేశానికి అవసరమా? ఎవరి మంచిని ఆశించి ఇది? ఏ భవిష్యత్‌ను ఆశించి?

- అసెంబ్లీలో సీఎం కేసీఆర్

# సర్వమత సమభూమిలో మత వివక్షా?

## సీఏఏ, ఎన్పీఆర్, ఎన్నార్సీలను | ఒప్పకోం

## అసెంబ్లీ ఏకగ్రీవ తీర్మానం



సీఏఏ, ఎన్పీఆర్, ఎన్నార్సీలకు వ్యతిరేకంగా శాసనసభలో తీర్మానం ప్రవేశపెట్టినందుకు ముఖ్యమంత్రి కేసీఆర్‌ను కలిసి ధన్యవాదాలు తెలియజేస్తున్న హోంమంత్రి మహమూద్ అలీ, ఎమ్మెల్సీలు సలీం, ఫారూఖ్ హుసేన్, ఫరీదుద్దీన్, జీహెచ్ఎంసీ డిప్యూటీ మేయర్ బాబా ఫసియొద్దీన్ తదితరులు

- రాజ్యాంగ వ్యతిరేక చర్యను సహించం
- కోట్లమంది ప్రజల్లో అనుమానాలు
- సీఏఏను కేంద్రం పునస్సమీక్షించాలి
- టెంప్టేషన్ క్రియేట్‌చేసి పొందే రాక్షసానందం మంచిదికాదు
- దేశంలో అనేక సమస్యలు వదిలి సీఏఏను తేవటం కల్లోలం రేపటమే
- మేము స్పష్టమైన అవగాహనతోనే సీఏఏ, ఎన్పీఆర్, ఎన్నార్సీలను వ్యతిరేకిస్తున్నాం: సీఎం కేసీఆర్

### రాజ్యాంగం అనుమతించదు..



మనది కులాతీత, మతాతీత రాజ్యాంగం. దురదృష్టం ఏమిటంటే సీఏఏ చట్టంలో 'ముస్లింలను మినహాయించి' అని పేర్కొన్నారు. ఒక వర్గాన్ని ప్రత్యేకంగా వేరుచేయడం ఎలా సాధ్యం? రాజ్యాంగం దీన్ని అనుమతించదు. అదే మేము వాదిస్తున్నాం. రాజ్యాంగ వ్యతిరేక చర్య కాబట్టి కేంద్రం పునస్సమీక్షించాలని విజ్ఞప్తి చేస్తున్నాం. కోటానుకోట్ల ప్రజల్లో ఉన్న అనుమానాలు నివృత్తిచేయాలని అడుగుతున్నాం. ఇంతమంది అనుమానంలో ఉండగా ముందుకు వెళ్లడం దేశానికి మంచిదికాదు.

### సైనికుడికి సలాం..



అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఎన్నికల ప్రచారంలో పక్కనే ఉండే మెక్సికో నుంచి చొరబాటుదారులు రాకుండా గోడనే కడుతా అన్నడు. భారత్ కూడా మయన్మార్ వద్ద కడుతాం అంటే మేం సపోర్టు చేయడానికి సిద్ధం. ఇంకేదన్న బార్డర్‌లో కడుతామంటే వద్దనం. బార్డర్‌లో సైనికులు కాపలాకాస్తేనే కదా మనం ఈరోజు శాంతియుతంగా అసెంబ్లీలో మాట్లాడుకుంటున్నాం. ఇంటికాడ ప్రశాంతంగా పడుకుంటున్నామంటే వారి దయనే కదా. ఆర్మీ పుణ్యం, త్యాగమే కదా. అందుకే దేశంలోపల విభజన విధానాలు వద్దు అని వాదిస్తున్నాం. మేం తప్పయితే దేశం మమ్మల్ని తిరస్కరిస్తది.

### ఇది యావత్ దేశ సమస్య..



ఇది ముస్లిం సమస్య కాదు.. హిందూ సమస్య కాదు.. యావత్ దేశ సమస్య ఇది. ఇంతకాలం పబ్లిక్ లైఫ్‌లో ఉన్నాం. నాకే బర్త్ సర్టిఫికెట్ లేదు. ఎందుకంటే ఆ రోజుల్లో దవాఖానలు లేవు. చింతమడక అనే ఊళ్లో పుట్టిన. బర్త్‌సర్టిఫికెట్ కావాలంటే ఎక్కడి నుంచి తేవాలి? రికార్డులు లేవు. ఒకస్థాయి కుటుంబంలో ఉన్న నా పరిస్థితే ఇట్లుంటే.. సామాన్యుడి పరిస్థితి ఏంటి? కూలిపని చేసుకునేవారు, దళితులు, సంచార జాతులు, నిరక్షరాస్యుల పరిస్థితి ఏమిటి? నాలాంటి అనేక లక్షలమందికి రికార్డులు లేవు.

- అసెంబ్లీలో ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు

2



సోమవారం మాదాపూర్‌లో ఐటీ ఉద్యోగిని పరీక్షిస్తున్న సిబ్బంది

# అనుక్షణం.. అప్రమత్తం

- కరోనా వైరస్‌పై ప్రభుత్వం మరింత అలర్ట్
- నియంత్రణ చర్యలపై ముఖ్యమంత్రి కేసీఆర్ ఆరా
- తెలంగాణలో నాలుగో కరోనా కేసు నమోదు
- స్కాట్లాండ్ నుంచి వచ్చిన వ్యక్తికి పాజిటివ్

కొవిడ్-19 వ్యాప్తి నియంత్రణకు తెలంగాణ ప్రభుత్వం మరింత పకడ్బందీగా చర్యలు చేపడుతున్నది. పక్కా ప్రణాళికతో ముందుకెళ్తున్నది. వైరస్ వ్యాప్తి చెందకుండా వైద్యశాఖలోని అన్ని విభాగాలు ప్రతిక్షణం అప్రమత్తంగా ఉండాలని సీఎం కేసీఆర్ ఆదేశించారు. కరోనా నియంత్రణకు తీసుకుంటున్న చర్యలపై ఆరా తీశారు. రాష్ట్రంలో చేపడుతున్న చర్యలను మంత్రి ఈటల అసెంబ్లీలో ముఖ్యమంత్రితో భేటీలో వివరించారు. మరోవైపు, రాష్ట్రంలో సోమవారం మరో వ్యక్తికి కరోనా పాజిటివ్‌గా తేలింది. రాష్ట్రంలో ఇప్పటివరకు నాలుగు కొవిడ్-19 పాజిటివ్ కేసులు నమోదవగా, ఒక వ్యక్తి పూర్తిగా కోలుకుని డిశ్చార్జ్ అయ్యారని వైద్యశాఖ వెల్లడించింది. మిగిలిన ముగ్గురిని ఐసొలేషన్‌లో ఉంచి వైద్యసేవలు అందిస్తున్నట్టు తెలిపింది.

వివరాలు 4వ పేజీలో

# నిదురపోవా తల్లీ!

- 71% మంది మహిళలకు కునుకే బంగారం
- ఇంటిపనులతో తీరికలేకపోవడమే కారణం
- పగలు నిద్రించేందుకు సమయం కావాలి
- సర్వేలో గృహిణుల మనోగతం

హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ:

సూర్యోదయానికి ముందు లేచేది ఆమె! సుర్యాస్తమయం తర్వాత సైతం పనిచేసేది ఆమె! కోడికూయక ముందే వాకిలి ఊడ్చి, అలుకు చల్లుతూ.. బడికెళ్లే పిల్లలకు వండిపెట్టడం.. ఒకే చేత్తో రెండు పనులు ఆమెకే సొంతం. భర్తకు బాక్స్ పెట్టి బట్టలు ఉతికిపెట్టి, అవి ఆరాక ఇస్త్రీచేసి పెట్టే ఇల్లాలికి ఇసుమంతైనా తీరిక ఉండటం లేదు. అలసిపోకుండా అందరికి అన్నీ సర్ది పెట్టే ఆమెకు నిద్ర కరువైంది! ఇంటిని మొత్తాన్ని కంట్రోల్ చేసే 'హోం మినిస్టర్లు' కంటి నిండా

మిగతా 4వ పేజీలో





వరంగల్ శివారు మడికొండలో నిర్మాణాలు పూర్తయి ప్రారంభానికి సిద్ధమైన తొలి పవర్‌లూమ్ క్లస్టర్

# పోరుగడ్డపై పోగుబంధం

- కూలీలుగా వలసవెళ్లి యజమానులుగా తిరిగొచ్చిన నేతన్న
- నౌకరీ చోడో.. వ్యాపార్ కరో స్ఫూర్తితో వేలమందికి ఉపాధి
- సొంతరాష్ట్రంపై మక్కువతో వెల్ఫేర్ సొసైటీగా సంఘటితం
- మడికొండ పవర్‌లూమ్ క్లస్టర్‌లో సొంత యూనిట్ల స్థాపన

10

పూటగడవడమే కష్టంగా మారిన స్థితిలో తెలంగాణ నేతన్నలు యాభైఏండ్ల క్రితం కూలీలుగా వలస వెళ్లారు. పరాయిగడ్డపై పడరాని పాట్లు పడ్డారు. పనే దైవంగా.. మగ్గమే బంధంగా ఒక్కో నూలు పోగును పేర్చుకుంటూ ఒక్కో మెట్టు పైకెదిగారు. దశాబ్దాల అనుభవం తోడుగా, 'నౌకరీ చోడో.. వ్యాపార్ కరో' స్ఫూర్తితో చిన్న చిన్న మగ్గం యూనిట్లను ఏర్పాటుచేసుకున్నారు. తెలంగాణ స్వరాష్ట్ర ప్రకటనతో ఇక తమ బతుకులు మారనున్నాయంటూ సొసైటీగా సంఘటితమై.. సీఎం కేసీఆర్ ఇచ్చిన భరోసాతో స్వరాష్ట్రానికి తిరుగు పయనమయ్యారు. వరంగల్‌లోని మడికొండలో రూపుదిద్దుకుంటున్న తొలి పవర్‌లూమ్ క్లస్టర్‌లో దాదాపు 364 మంది యజమానులుగా యూనిట్లను ప్రారంభించడంతోపాటు, తోటి నేతన్నలకు ఉపాధి కల్పించేందుకుసిద్ధమయ్యారు. ప్రత్యక్షంగా, పరోక్షంగా పదివేల మందికి ఉపాధి కల్పిస్తామని ధీమా వ్యక్తంచేస్తున్నారు.

## కమల్ కరోనాస్త్రం

- మధ్యప్రదేశ్‌లో మరో మలుపు
- సోమవారం జరుగని విశ్వాసపరీక్ష
- 26 వరకు సభ వాయిదా
- నేడు బలపరీక్షకు గవర్నర్ అల్టిమేటం
- అవిశ్వాసానికి సీఎం సవాల్

5

| చికెన్ ధరలు (వెన్‌కాబ్) (రూ.) | | | |
|---|---|---|---|
| ఫారం ధర | 20.00 | డ్రెస్డ్ | 61.00 |
| రిటైల్ లైవ్ | 42.00 | స్కిన్‌లెస్ | 69.00 |

| గుడ్ల ధరలు (వందకు) (రూ.) | | | |
|---|---|---|---|
| హైదరాబాద్ | 250.00 | రంగారెడ్డి | 250.00 |
| మెదక్ | 250.00 | కరీంనగర్ | 253.00 |
| వరంగల్ | 253.00 | డజన్ ధర | 48.00 |

# ఉన్న ఊరును, కన్నతల్లిని మరువనోళ్లే గొప్పోళ్లు

- దమ్మన్నపేట 'శ్రీమంతుడి'కి మంత్రి కేటీఆర్ అభినందనలు
- సొంతూరు అభివృద్ధికి నర్సింహారెడ్డి విరాళం రూ.25 కోట్లు
- మంత్రి కేటీఆర్‌కు రూ.1.50 కోట్ల చెక్కు అందజేత

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** పుట్టిన ఊరు మనకు ఎంతో ఇచ్చింది.. ఆ ఊరికి ఎంతో కొంత తిరిగి ఇచ్చేయాలనే సంకల్పానికి సరైన నిర్వచనం ప్రముఖ కాంట్రాక్టర్, కేఎన్ఆర్ కన్‌స్ట్రక్షన్స్ అధినేత కామిడి నర్సింహారెడ్డి. కన్నతల్లిదండ్రులను, పుట్టిన గ్రామాన్ని మరువకుండా తగిన సేవ చేస్తేనే జన్మసార్థకమవుతుందని ఆయన నమ్ముతారు. ఈ నేపథ్యంలోనే ఆయన తన పుట్టిన ఊరు వరంగల్ రూరల్ జిల్లా వర్ధన్నపేట నియోజకవర్గంలోని దమ్మన్నపేట అభివృద్ధికి రూ.25 కోట్లను విరాళంగా ప్రకటించారు. అందులో రూ.1.5 కోట్ల చెక్కును ఆయన సోమవారం రాష్ట్ర మున్సిపల్‌శాఖ మంత్రి కే తారకరామారావు ఇంటికి వెళ్లి అందజేశారు. ఈ విరాళాన్ని వర్ధన్నపేట మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం అభివృద్ధికి వినియోగించాలని కోరారు. ఈ సందర్భంగా

మిగతా 4వ పేజీలో



తన నివాసంలో సోమవారం కేఎన్ఆర్ కన్‌స్ట్రక్షన్స్ అధినేత కామిడి నర్సింహారెడ్డిని శాలువా కప్పి సత్కరిస్తున్న ఐటీశాఖ మంత్రి కేటీఆర్. చిత్రంలో పంచాయతీరాజ్‌శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, ఎమ్మెల్యేలు ఆరూరి రమేశ్, జీవన్‌రెడ్డి



# నష్టపుటేరులు

- సెన్సెక్స్ 2,713, నిఫ్టీ 758 పాయింట్లు పతనం
- మూడేండ్ల దిగువకు నిఫ్టీ

8

# సీఏఏను ఒప్పుకోం

## విభజన రాజకీయాలు మంచిది కాదు

- ఇది 130 కోట్ల మంది సమస్య
- రాజ్యాంగ వ్యతిరేక చర్యను సహించం
- సీఏఏను కేంద్రం పునస్సమీక్షించాలి
- టెంప్టేషన్ క్రియేట్‌చేసి పొందే రాక్షసానందం మంచిదికాదు
- దేశంలో సమస్యలు వదిలి దీన్ని తేవటం కల్లోలం రేపటమే
- లౌకిక పునాదులపై రాజ్యాంగ స్ఫూర్తితో ఏర్పడిన టీఆర్‌ఎస్
- అధికారంలో ఉన్నాలేకున్నా సిద్ధాంతానికి కట్టుబడతాం
- స్పష్టమైన అవగాహనతోనే సీఏఏ, ఎన్పీఆర్, ఎన్నార్సీని వ్యతిరేకిస్తున్నాం
- తీర్మానం ప్రవేశపెట్టిన సీఎం కేసీఆర్
- ఏకగ్రీవంగా అసెంబ్లీ ఆమోదం



సోమవారం కరీంనగర్‌లోని తెలంగాణ చౌక్‌లో ముఖ్యమంత్రి కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న మైనార్టీ సోదరులు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన పౌరసత్వ సవరణ చట్టాన్ని (సీఏఏ) ఎట్టిపరిస్థితుల్లో ఒప్పుకోబోమని ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు తేల్చిచెప్పారు. కోట్లమంది ప్రజల్లో అనుమానాలు ఉన్నప్పుడు సీఏఏ విషయంలో ముందుకెళ్లడం మంచిదికాదని ఎన్డీఏ ప్రభుత్వానికి హితవుచెప్పారు. ఒక మతాన్ని మినహాయిస్తూ చేసే రాజ్యాంగ వ్యతిరేకచర్యకు మద్దతు తెలిపేదిలేదని స్పష్టంచేశారు. సీఏఏ అన్నది కేవలం హిందూముస్లింల సమస్య కాదన్నారు. నిరసనలతో ఇప్పటికే దేశం నలుమూలలా లొల్లి అంటుకొన్నదని.. ఇలాంటప్పుడు విభజన రాజకీయాలు దేశానికి అవసరమా అని ప్రశ్నించారు. ఈ చట్టాన్ని పునస్సమీక్షించాలని కేంద్రానికి విజ్ఞప్తిచేశారు. సీఏఏ, ఎన్పీఆర్, ఎన్నార్సీని వ్యతిరేకిస్తూ సీఎం కేసీఆర్ అసెంబ్లీలో తీర్మానం ప్రవేశపెట్టారు. సుదీర్ఘచర్చ అనంతరం సభ తీర్మానాన్ని ఆమోదించింది. తీర్మానంపై చర్చను ప్రారంభించిన సీఎం కేసీఆర్.. ప్రభుత్వాలను ఏర్పాటుచేసేందుకు వినియోగిస్తున్న ఓటరుకార్డులు.. పౌరసత్వానికి రుజువులు కావా అని ప్రశ్నించారు. సీఏఏ తీర్మానంపై సీఎం ప్రసంగం ఆయన మాటల్లోనే..

### మనపై బాధ్యత ఉన్నది

కొన్ని నెలలుగా సీఏఏపై అనేక చర్చోపచర్చలు జరుగుతున్నాయి. ప్రపంచం మొత్తం భారత్ వైపు చూస్తున్నది. ఈ పరిస్థితుల్లో భారత రాజ్యాంగ లౌకికతత్వంపై విశ్వాసం కలిగిన వారందరూ నిరసనలు తెలియజేస్తున్నారు. ఒక భిన్నమైన స్వరూపం.. వందల ఏండ్ల కాస్మోపాలిటన్ కల్చర్.. భిన్న సంస్కృతులకు ఆలవాలంగా ఉన్న తెలంగాణ తప్పకుండా ఈ విషయంపై స్పందించాల్సిన అవసరమున్నది. సీఏఏపై రాష్ట్రప్రభుత్వం తరఫున ఇప్పటికే క్యాబినెట్‌లో తీర్మానంచేసి చెప్పాం. పార్లమెంట్‌లోకూడా బిల్లు వచ్చినపుడు తీవ్రంగా వ్యతిరేకించాం. ఈ దేశంలో ఇప్పటికే ఈ తీర్మానం పాస్‌చేసిన ఎనిమిదో రాష్ట్రంగా తెలంగాణ నిలుస్తుంది. దేశంలో క్రియాశీలకంగా ఉన్న తెలంగాణ.. జాతి నిర్మాణంలో కీలకపాత్ర పోషిస్తున్నది. దేశ జీడీపీకి అతి ఎక్కువగా కాంట్రిబ్యూట్‌చేసే రాష్ట్రాల్లో తెలంగాణ ప్రథమ వరుసలో ఉంటుంది. సామాజిక భద్రత, భవిష్యత్తు కోసం ఏంచేయాలో తగిన సూచనచేసే బాధ్యత మనమీద ఉంటుంది. అందుకే అసెంబ్లీలో తీర్మానం ప్రవేశపెట్టాం. ప్రపంచ మానవాళి వసుధైక కుటుంబం అని కలలు కంటున్న సందర్భం ఇది. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం ఎల్లలు చెరిపివేసింది. బార్డర్స్‌ని బద్దలు కొట్టేసింది. ఒక్క మెస్సేజ్ క్షణాల్లో వంద దేశాలకు పోయే పరిస్థితి వచ్చింది. ఇలాంటి తరుణంలో ఈ బిల్లు సృష్టిస్తున్న ప్రకంపనలు ఎంతవరకు సమంజసమనే చర్చ దేశంలో జరుగుతున్నది. స్పష్టమైన అవగాహనతోనే సీఏఏ, ఎన్పీఆర్, ఎన్నార్సీలను వ్యతిరేకిస్తున్నాం.

### 'గోలీ మారో సాలోంకో'.. ఇదెక్కడి భాష?

విదేశీ ప్రతినిధులు దేశంలో పర్యటించేసమయంలో ఎవరమైనా కొంత సంయమనం పాటిస్తాం. దేశం పరువు, ప్రతిష్ఠ, మర్యాదకు సంబంధించిన అంశం కాబట్టి ఆలోచిస్తాం. స్వయంగా అమెరికా అధ్యక్షుడు దేశంలో పర్యటిస్తున్న సమయంలో 50 మంది పైచిలుకు పౌరులు ఢిల్లీలో చనిపోయారు. అది మతకల్లోలమా? వేరే కల్లోలమా.. ఏదైనా కావచ్చు. ఎంపీలు, కేంద్రమంత్రుల నోట దుర్మార్గమైన వ్యాఖ్యలు కూడా విన్నం. చాలా బాధాకరం. 70 ఏండ్ల స్వాతంత్ర్యం తర్వాత 'గోలీమారో సాలోంకో' అంటే.. ఇదేం భాష? ఎక్కడి బాధ్యత? ఇది దేశానికి అవసరమా? ఇది ఏ రకంగాకూడా వాంఛనీయం కాదు. దేశ పౌర సమాజం ఇలాంటి అల్లర్లను ఏ రకంగానూ ఒప్పుకోదు. ఇది తాత్కాలికంగా కొందరికి ఆనందం కలిగించొచ్చు. మంచి పునాదుల మీద, మంచి ఆలోచనలతోని ముందుకుపోతే అది నిలబడుతది కానీ, తాత్కాలికంగా టెంప్టేషన్ క్రియేట్ చేసి రాక్షసానందం పొందడం దేశం మొత్తానికి మంచిదికాదు. అంతర్జాతీయంగా మన ఖ్యాతి, సెక్యులర్ విధానం.. రాజ్యాంగ ప్రవేశికలో చెప్పుకొన్న లక్ష్యానికి పూర్తిగా వ్యతిరేకం. ఇది మనసును కలచివేస్తున్నది.

### ట్రంప్ గోడ కడుతా అన్నాడు..

ఏ దేశానికైనా పౌరసత్వముండాలి. చట్టం కూడా ఉండాలి. వద్దని ఎవరూ అనరు. దేశంలో చొరబాటుదారులను అనుమతించాలని ఎవరైనా చెబుతారా. ఎవరూ చెప్పరు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఎన్నికల ప్రచారంలో పక్కనే ఉండే మెక్సికో నుంచి చొరబాటుదారులు రాకుండా గోడనే కడుతా అన్నడు. భారత్ కూడా మయన్మార్ వద్ద కడుతాం అంటే మేం సపోర్టు చేయడానికి సిద్ధం. ఇంకేదన్నా బార్డర్‌లో కడుతామంటే వద్దనం. బార్డర్‌లో సైనికులు కాపలా కాస్తెనే కదా మనం ఈరోజు శాంతియుతంగా అసెంబ్లీలో మాట్లాడుకుంటున్నాం. దేశంలోపల విభజన విధానాలు వద్దని వాదిస్తున్నాం.

### నిర్ణయం చెప్తే దేశద్రోహి అంటారా?

నాలెక్క మాట్లాడినోల్లందర్నీ దేశద్రోహులంటారా.. వీడు పాకిస్థాన్ ఏజెంట్, దేశద్రోహి అంటారా.. తెలంగాణ అసెంబ్లీ తీర్మానం చేస్తే అసెంబ్లీ అసెంబ్లే దేశద్రోహ..? ఇదేం వితండవాదన. ఈ అసహన వైఖరి దేశానికి మంచిది కాదు. దేశం అంగీకరించదు. స్పష్టంగా చెప్తున్నాం. భేషజాలు లేవు. లౌకిక పునాదుల మీద భారత రాజ్యాంగ స్ఫూర్తితో ఏర్పడిన పార్టీ మాది. సచ్చినా బతికినా, అధికారంలో ఉన్నా లేకున్నా ఆ సిద్ధాంతానికి కట్టుబడి ఉంటం. ఉంటం కాబట్టే బాజాప్త పార్లమెంట్లో ఢంకా బజాయించి చెప్పాం. కేంద్రమంత్రులు ఫోన్ చేస్తే చెప్పిన. సారీ వి కెనాట్ సపోర్ట్ దిస్ అని.

### గతంలోనే విఫలమైంది

వాజ్‌పేయి ప్రధానిగా ఉన్నప్పుడే అద్వానీ కమిటీ దీనిపై సవరణలు సూచించింది. మల్టీ పర్పస్ నేషనల్ ఐడెంటిటీ కార్డు అందరికీ ఇవ్వాలని ప్రయోగంచేశారు. వివిధ రాష్ట్రాల్లో 30.9 లక్షల మంది దగ్గర వివరాలు సేకరించి 12 లక్షల మందికి మాత్రమే కార్డులు ఇవ్వగలిగారు. ఈ ప్రాజెక్టు సఫలం కావడంలేదని కేంద్రమే పక్కనపెట్టింది. ఫెయిలైందని ప్రకటించింది. 2011లో కేంద్ర హోంశాఖ మంత్రి గురుదాస్ కామత్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో సంబంధిత పత్రాలు అందుబాటులో లేవని చెప్పారు. నేనూ అదే చెప్పా..'డాక్యుమెంట్ బేస్ ఈజ్ వీక్ బికాజ్ సో మెనీ గరీబ్ కేసీఆర్స్ ఇన్ ద కంట్రీ అని. సర్టిఫికెట్లు లేనివారు ఎందరో ఉన్నారు. ఆయనకే లేదంటే మీ తండ్రిది తాతది అంటే యాడికెళ్లి తెస్తరు. ఇలాంటి పేద కేసీఆర్‌లు? దేశ విభజన జరిగినప్పుడు, బంగ్లాదేశ్ పాకిస్థాన్‌నుంచి విముక్తి పొందినప్పుడు లక్షల మంది భారత్‌కు తరలి వచ్చారు. యూఎన్‌ఓ ఆదేశాలమేరకు మన ప్రభుత్వం వారిని కాందిశీకులుగా గుర్తించి చోటు కల్పించాం. మన రాష్ట్రంలోనూ కాందిశీకుల శిబిరాలు ఉన్నాయి. పదివేలమంది ఉన్నరు. గ్రామ పంచాయతీ సర్పంచ్‌గా వాళ్లే గెలుస్తరు. వారిని భారత పౌరులు కాదనగలమా? దీన్ని చేయాలంటే సంయమనంతో, దేశంలోని అన్ని రాజకీయ పార్టీలను పిలిచిచేయాలి. ఇది విఫల ప్రయోగం అని ఎన్డీఏ, యూపీఏ ప్రభుత్వాలు పార్లమెంట్‌లో ఇచ్చిన స్టేట్‌మెంట్‌లో నిగ్గు తేలింది. మళ్లీ అదే బేస్ మీద చేస్తమని ప్రస్తుత ప్రభుత్వం చేస్తున్నది. దేశ ప్రజలను మానసికవ్యథకు గురిచేసే పరిస్థితులు తేవటం అవసరమా? కేంద్రం చేయాలనుకుంటే బాజాప్త చేయాలి బేజాప్త ఎందుకు చేస్తరు. దేశంలో ఉన్న మొత్తం వ్యవస్థకు చెప్పి చేయండి.

### చెప్పేది ఒకటి.. చేసేది ఒకటి

ఎన్పీఆర్‌చేస్తం. ఎన్నార్సీ చేయమంటున్నరు. కానీ ఫైనల్‌గా అదే జరుగుతుంది. కేంద్రం మాటలు ఎవరూ నమ్మడం లేదు. రొట్టెలు చేయనపుడు పిండి ఎందుకు దంచుతున్నవ్? ఎన్పీఆర్ అనేది ఎన్నార్సీకి మొదటి అడుగు అని హోంశాఖ పార్లమెంట్‌లో పెట్టిన వార్షిక నివేదికలో స్పష్టంగా చెప్పింది. పార్లమెంట్ రిపోర్టులో ఒకవిధంగా, బయట మరొకవిధంగా చెప్పడంవల్ల అనేక సందేహాలు వస్తున్నయి.

### వలస బతుకులు చూసి ఏడ్చాను

ఆదిలాబాద్ నార్నూర్ మండలం పోయా. మూరుమూల అటవీప్రాంతం అది. రాత్రి వేళ కొందరు కనిపించి నమస్తేపెట్టారు. ఎవరు అని అడిగితే పాలమూరు అన్నారు. ఇక్కడెందుకు ఉన్నరు అంటే.. ఎవరో కాంట్రాక్టరు రోడ్డు పట్టుకున్నడు సర్.. పనులకోసం తీసుకొచ్చిండు సర్ అన్నారు. అక్కడ్నే ఎమోషనల్ అయి కండ్ల నుంచి నీళ్లు కారాయి. ఏం పాలమూరు బతుకు ఇది అని బాధపడ్డా. ఏడ్చుకుంటూ వచ్చాను. ఇలా సామాన్య ప్రజలు బతికేందుకు పోతరు. నివాసాలు మారుతయి. పోతం వస్తం. పలు కారణాల వల్ల కుటుంబాలు చెల్లాచెదురై వలస జరుగుతుంది. ఇలాంటి క్లిష్టమైన అంశాల్లో ఇలాచేయడం వల్ల దేశంలో ఆందోళనలు చెలరేగుతున్నాయి. ఎవరు మాట్లాడినా దేశద్రోహులనే కొత్త ట్రెండ్ మొదలైంది. సోషల్ మీడియా, మరో మీడియాలో ఈరకంగా ప్రచారం చేయడం మంచిది కాదు. పౌరసత్వ సవరణ చట్టంలో పేర్కొన్న నిబంధన.. రాజ్యాంగ విరుద్ధమని సుప్రీం కోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ మదన్ లోకూర్ చెప్పారు. వీరు కూడా పాకిస్థాన్ ఏజెంటేనా? దేశద్రోహి అందామా..? ఇలాంటి చట్టం దేశప్రజలకు ఏ విధంగా మంచిది?

### అదే పెద్ద తప్పు

మనది కులాతీత, మతాతీత రాజ్యాంగమని పేర్కొన్నారు. దురదృష్టమేమిటంటే ఈ చట్టంలో ముస్లింలను మినహాయించి అని పేర్కొన్నారు. ఒక వర్గాన్ని ప్రత్యేకంగా వేరుచేయడం ఎలా సాధ్యం? రాజ్యంగం దీన్ని అనుమతించదు. రాజ్యాంగ వ్యతిరేకచర్య కాబట్టి భారత ప్రభుత్వం పునస్సమీక్షించాలని విజ్ఞప్తిచేస్తున్నాం. ప్రజల్లో ఉన్న అనుమానాలు నివృత్తి చేయాలని అడుతున్నాం. ఇంత మంది అనుమానంలో ఉండగా ముందుకు వెళ్లడం దేశానికి మంచిది కాదు. నేషనల్ ఐడెంటిటీ కార్డు ఇవ్వాలంటే ఇవ్వండి. దానికి ముందు అందర్నీ కన్విన్స్ చేయండి. ఒప్పించి ముందుకు వెళ్లండి. అందరి మద్దతుతో చేయండి. ప్రభుత్వం మాకోసం పనిచేస్తుందని ప్రజలు అనుకోవాలి కాని, భయాందోళనలు సృష్టించడం సరికాదు. నూతన ఆలోచనతో ముందుకు రావాలి. అప్పుడు మద్దతు తెలుపుతాం. వ్యతిరేకించాలన్నదే మా ఉద్దేశం కాదు. ప్రజల అనుమానాలు ఉన్నప్పుడు ఇలాంటివి చేయడం మంచిది కాదని విజ్ఞప్తి చేస్తున్నాం.

### ఎవరి అభిప్రాయాలు వారివి

మేం మజ్లిస్‌తో కలిసి పనిచేస్తం. మేం మిత్రపక్షం అని కుండబద్దలు కొట్టినట్లు చెప్తున్నం. అయినంతమాత్రాన అన్ని విషయాల్లో ఒకేవిధమైన అభిప్రాయాలు ఉండవు. ఆర్టికల్ 370 విషయంలో మద్దతు తెలిపాము. దేశ భద్రతకు సంబంధించిన విషయం కాబట్టి మద్దతు తెలిపాం. కొన్నింటిల్లో ఒకేవిధంగా ఉంటుంది కావచ్చు. దీనికేదో ముడిపెట్టి మాట్లాడటం సరికాదు.

## హిందూ ముస్లిం సమస్య కాదు



40, 45 ఏండ్ల నుంచి పబ్లిక్‌లైఫ్‌లో ఉంటున్న. అన్నిరకాల పదవులు చేశా. కానీ ఇది కాదు ఆశించింది. మనదేశంలో ఇలాంటి మాటలు వినవలసివస్తుందని అనుకోలేదు. దేశంలో అనేక సమస్యలున్నాయి. రైతులు, తాగునీరు, సాగునీరు, నిరుద్యోగం వంటి అనేక సమస్యలున్నాయి. వాటన్నింటినీ వదిలిపెట్టి కొంపలంటుకుపోతున్నాయన్నట్లు దీన్ని తేవడం కల్లోలం రేపడమే. ఈ కల్లోలం రేపు ఎక్కడికి దారితీస్తుంది? ప్రపంచవేదికలపై మన ఖ్యాతి ఏం కావాలి? ఇది ముస్లిం సమస్య కాదు. హిందూ సమస్య కాదు. యావత్‌దేశ సమస్య ఇది. 130 కోట్ల ప్రజలకు సంబంధించిన విషయమిది. ఇంతకాలం పబ్లిక్‌లైఫ్‌లో ఉన్నాం. నాకే బర్త్ సర్టిఫికెట్ లేదు. ఎందుకంటే ఆరోజుల్లో దవాఖానలులేవు. చింతమడక అనే ఊళ్లో పుట్టిన. బర్త్ సర్టిఫికెట్ ఎక్కడినుంచి తేవాలి? రికార్డులు లేవు. ఒకస్థాయి కుటుంబంలో ఉన్న నా పరిస్థితే ఇట్లుంటే.. సామాన్యుడి పరిస్థితి ఏమిటి. కూలి చేసుకొనేవాళ్లు.. దళితులు, సంచారజాతులు, నిరక్షరాస్యుల పరిస్థితి ఏమిటి?

## ఓటర్ కార్డు పనికిరాదా?

**మరి** నేనొక మాట అడుగుతా సమాధానం చెప్తారా ప్రశ్నించేటోళ్లు? సర్పంచ్ నుంచి ప్రధాని దాకా.. ప్రజలు ఓటర్‌కార్డు చూపించి ఓటువేస్తేనే ఎన్నికైతారు. భారతీయుడివని రుజువు చేసుకోవాలంటే ఆ ఓటరు ఐడీకార్డు పనిచేయదట. డ్రైవింగ్ లైసెన్స్, ఆధార్, రేషన్ కార్డు.. ఇవేవీ పనిచేయవు. మరేం పనిచేస్తది? దేశంలో ప్రభుత్వాన్ని ఏ ఓటర్ ఐడీ కార్డయితే ఎన్నుకున్నదో ఆ కార్డే పనికిరాదంటే మీ ప్రభుత్వం ఉన్నదనుకోవాలా లేదనుకోవాలా? ఎవరు సమాధానం చెప్తారు? ఇదేమీ ఆషామాషీ విషయంకాదు. ఒక కేసీఆరో, తెలంగాణ రాష్ట్రమో, హైదరాబాదో కాదు కదా మాట్లాడుతున్నది? దేశం నలుమూలల అంటుకొని లొల్లి అయితున్నది. భారతదేశ ప్రతిష్ఠ గంగలో కలుస్తున్నది. టైమ్స్ పత్రిక ఇన్‌టాలరెన్స్ ఇండియా అని మొదటిపేజీలో ప్రచురించింది. టుడే సిటిజన్ ఈజ్ ఎ గ్లోబల్ సిటిజన్, మన దేశం వారు లేని దేశం ఉందా ప్రపంచంలో.. అన్ని దేశాల్లో మన పిల్లలున్నారు. 50 దేశాల్లో టీఆర్‌ఎస్ శాఖలే ఉన్నాయి. పార్టీ వార్షికోత్సవాలను బ్రహ్మాండంగా నిర్వహిస్తారు. ఈ పరిస్థితుల్లో విభజన రాజకీయాలు ఎందుకు. సంకుచిత రాజకీయాలు దేశానికి అవసరమా?

## అసెంబ్లీ తీర్మానంపై సంబురాలు

**తెలంగాణచౌక్/ఖమ్మం మయూరిసెంటర్:** సీఏఏను పునఃపరిశీలించాలని సీఎం కేసీఆర్ అసెంబ్లీలో తీర్మానంచేసి కేంద్రహోం శాఖకు పంపడంతో ముస్లింలు హర్షం వ్యక్తంచేశారు. సోమవారం రాష్ట్రవ్యాప్తంగా మైనార్టీ సోదరులు సంబురాలు చేసుకున్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ చిత్రపటాలకు క్షీరాభిషేకం నిర్వహించారు. కరీంనగర్‌లోని తెలంగాణచౌక్‌లో జెడ్పీ కోఆప్షన్ మాజీ సభ్యుడు ఎండీ జమీలొద్దీన్, డీసీఎంఎస్ వైస్‌చైర్మన్ ఎండీ ఫక్రొద్దీన్ అధ్వర్యంలో మైనార్టీ నాయకులు సీఎం కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేసి, పటాకులు కాల్చారు. అనంతరం స్వీట్లు పంపిణీచేశారు. 'హిందూ.. ముస్లిం భాయిభాయి' అంటూ నినదించారు. ఖమ్మం నగరంలో ముస్లిం సోదరులు సీఎం కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. దేశ ప్రజల మధ్య విద్వేషాలను సృష్టించాడనికి కేంద్రం మతపరమైన చట్టాలను తీసుకువస్తున్నదని ఆగ్రహం వ్యక్తంచేశారు. కేసీఆర్‌లాంటి నాయకుడు దేశానికి ఒక్కడు చాలంటూ నినదించారు. కార్యక్రమంలో ఖమ్మం జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎండీ ఖమర్, కార్పొరేటర్ షౌకత్‌అలీ, ముస్లిం హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు ఎండీ అసద్ తదితరులు పాల్గొన్నారు.





సీఏఏ వ్యతిరేక తీర్మానానికి ఆమోదం అనంతరం శాసనమండలి వద్ద సీఎం కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న ఎమ్మెల్సీ ఫారూక్‌హుస్సేన్

## కేంద్ర చట్టాలతో భయాందోళన

- శాసనమండలిలో బీజేపీ మినహా సభ్యుల ఏకాభిప్రాయం
- సీఏఏ, ఎన్పీఆర్, ఎన్నార్సీ వ్యతిరేక తీర్మానానికి ఆమోదం

**హైదరాబాద్, నమస్తేతెలంగాణ:** కేంద్రం తీసుకొచ్చిన సీఏఏ, ఎన్పీఆర్, ఎన్నార్సీలు ప్రజలను భయభ్రాంతులకు గురిచేలా ఉన్నాయని శాసనమండలి ఆందోళన వ్యక్తంచేసింది. ప్రభుత్వం ప్రవేశపెట్టిన సీఏఏ, ఎన్పీఆర్, ఎన్నార్సీకి వ్యతిరేక తీర్మానాన్ని ఆమోదించింది. సోమవారం మధ్యాహ్న భోజన విరామం అనంతరం సీఏఏ, ఎన్పీఆర్, ఎన్నార్సీపై సీఎం కేసీఆర్ తరఫున శాసనసభ వ్యవహారాలశాఖ మంత్రి ప్రశాంత్‌రెడ్డి మండలిలో తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా తీర్మానం ఉద్దేశం, లక్ష్యాలను మంత్రి వివరించారు. ఆ తర్వాత జరిగిన చర్చలో బీజేపీ పక్షనేత రామచంద్రారావు, ప్రభుత్వ విప్ కర్నె ప్రభాకర్, ఫారూక్‌హుస్సేన్, కాంగ్రెస్ సభ్యుడు టీ జీవన్‌రెడ్డి, ఎంఎస్ ప్రభాకర్, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ నర్సిరెడ్డి, ఫరీదుద్దీన్ పాల్గొన్నారు. అనంతరం మంత్రి ప్రశాంత్‌రెడ్డి మాట్లాడుతూ.. సీఏఏ రాజ్యాంగానికి విరుద్ధంగా ఉన్నదని, అందుకే ఈ చట్టాన్ని తెలంగాణ ప్రభుత్వం వ్యతిరేకిస్తున్నదని చెప్పారు.

## దేశానికి కేసీఆర్ నాయకత్వం అవసరం

### సీఏఏ వ్యతిరేక తీర్మానంపై చర్చలో విప్ బాల్క సుమన్



**కేంద్రంలోని** ప్రభుత్వాలు ఏదో రకంగా ప్రజలను మోసం చేస్తూనే ఉన్నాయని, అన్ని వర్గాలకు న్యాయం చేసే పాలన రావాలంటే సీఎం కేసీఆర్ దేశానికి నాయకత్వం వహించాలని విప్ బాల్క సుమన్ అభిప్రాయపడ్డారు. సీఏఏకు వ్యతిరేకంగా ప్రవేశపెట్టిన తీర్మానంపై సోమవారం శాసనసభలో జరిగిన చర్చలో ఆయన మాట్లాడారు. బీజేపీ, కాంగ్రెస్ రాజకీయాలకు అడ్డుకట్ట వేయాలని, అది సీఎం కేసీఆర్‌కే సాధ్యమవుతుందని చెప్పారు. దేశప్రజలంతా ఒకేజాతిగా ఉండేవారని, కానీ బీజేపీ, కాంగ్రెస్‌లు విభజన రాజకీయాలు చేస్తున్నాయని విమర్శించారు.

## కేంద్రానిది మొండి వైఖరి: ఎమ్మెల్యే గువ్వల



**ప్రజావ్యతిరేక** విధానాలను అమలుచేస్తున్న కేంద్ర ప్రభుత్వానికి ప్రజలే బుద్ధి చెప్తారని ఎమ్మెల్యే గువ్వల బాలరాజు పేర్కొన్నారు. సీఏఏను 80 శాతం మంది భారతీయులు వ్యతిరేకిస్తున్నా, ఇప్పటికే ఎనిమిది రాష్ట్రాలు అసెంబ్లీలో వ్యతిరేక తీర్మానాలు ప్రవేశపెట్టినా కేంద్రం మొండి వైఖరిని అవలంబిస్తున్నదని మండిపడ్డారు. సోమవారం అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద ఆయన మాట్లాడుతూ.. దేశంలోని అన్నివర్గాల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకొని పాలన కొనసాగించాలని ప్రధాని మోదీకి విజ్ఞప్తిచేశారు. కేంద్ర ప్రభుత్వం వివక్ష చూపుతున్న మైనార్టీవర్గాలకు సీఎం కేసీఆర్ అండగా ఉండటాన్ని ప్రతిఒక్కరూ ప్రశంసించాలన్నారు.

## తీర్మానం హర్షణీయం: సీపీఎం, సీపీఐ

**పౌరసత్వ** సవరణ చట్టానికి వ్యతిరేకంగా శాసనసభ ఆమోదించిన తీర్మానం హర్షణీయమని సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి అన్నారు. సోమవారం ఆయన ఢిల్లీలో మీడియాతో మాట్లాడుతూ.. రాజ్యాంగ మూలసూత్రాలకు విఘాతం కలిగిస్తున్న ఈ చట్టాన్ని ప్రతి రాష్ట్ర ప్రభుత్వం వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. బర్త్ సర్టిఫికెట్ల పేరుతో నిరక్షరాస్యులైన పేద ప్రజలను ఇబ్బంది పెట్టడం సమంజసం కాదన్నారు. సీఏఏ, ఎన్నార్సీ, ఎన్పీఆర్‌ను తీసుకొచ్చి దేశంలో మతాల మధ్య బీజేపీ చిచ్చుపెట్టిందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకటరెడ్డి ఒక ప్రకటనలో ఆరోపించారు. ఈ చట్టాలను వ్యతిరేకిస్తూ అసెంబ్లీలో సీఎం కేసీఆర్ తీర్మానం ప్రవేశపెట్టి ఆమోదించినందుకు సీపీఐ రాష్ట్ర పార్టీ తరపున అభినందనలు తెలుపుతున్నామన్నారు.

## తీర్మానం చరిత్రాత్మకం: ఎమ్మెఫ్‌సీ చైర్మన్

**ఎన్పీఆర్,** ఎన్నార్సీ, సీఏఏకు వ్యతిరేకంగా అసెంబ్లీలో తీర్మానం చేయడం చరిత్రాత్మకమని, సీఎం కేసీఆర్‌కు మైనార్టీలంతా రుణపడి ఉంటారని ఎమ్మెఫ్‌సీ చైర్మన్ అక్బర్‌హుస్సేన్ చెప్పారు. సీఏఏకు వ్యతిరేకంగా తీర్మానం చేసినందుకు కృతజ్ఞతగా మాసబ్‌ట్యాంక్‌లో సీఎం కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు.

## ఈరోజే మాకు రంజాన్: టీఆర్‌ఎస్ నేత షరీపుద్దీన్

**సీఏఏ,** ఎన్పీఆర్, ఎన్నార్సీకు వ్యతిరేకంగా అసెంబ్లీలో తీర్మానం చేసిన రోజే తమకు రంజాన్ అని టీఆర్‌ఎస్ మాజీ కార్యదర్శి మహ్మద్ షరీపుద్దీన్ చెప్పారు. ముషీరాబాద్ బిలాల్ మసీద్ వద్ద సీఎం కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేసి స్వీట్లు పంచారు. సీఎం కేసీఆర్ నిర్ణయంతో మైనార్టీలంతా సంతోషంగా ఉన్నారని తెలిపారు. సీఎం కేసీఆర్‌కు ఎంతో రుణపడి ఉంటామని పేర్కొన్నారు.

# కేసీఆర్ ఉన్న గడ్డపై పుట్టడం అదృష్టం

## మహాలౌకికవాదికి రుణపడి ఉంటాం

- సీఏఏ నల్లచట్టం, ఎన్పీఆర్ కంపు చట్టం
- సీఏఏ, ఎన్పీఆర్, ఎన్నార్సీపై కరాఖండిగా వ్యతిరేక తీర్మానం చేసినవారెవరూ లేరు
- అసెంబ్లీలో ఎంఐఎం ఎల్పీనేత అక్బరుద్దీన్



**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** 'మహా లౌకికవాది ముఖ్యమంత్రి కేసీఆర్‌కు రుణపడి ఉంటాం. ఎప్పటికీ మీ వెన్నంటే ఉంటాం. కేసీఆర్ ఉన్న గడ్డపైన పుట్టడం అదృష్టంగా భావిస్తున్నా' అని ప్రతిపక్ష నేత, ఎంఐఎం శాసనసభాపక్షనేత అక్బరుద్దీన్ ఒవైసీ పేర్కొన్నారు. సీఏఏ, ఎన్పీఆర్, ఎన్నార్సీకి వ్యతిరేకంగా ఇప్పటివరకు ఎనిమిదిరాష్ట్రాలు తీర్మానం చేసినా, సభానాయకుడు కేసీఆర్ తరహాలో అందరినీ కలుపుకొని కరాఖండిగా తీర్మానం చేసిన వారెవరూలేరని బల్లగుద్ది చెప్తున్నానని తెలిపారు. సోమవారం శాసనసభలో పౌరసత్వ చట్టానికి వ్యతిరేకంగా ప్రవేశపెట్టిన తీర్మానంపై ఆయన మాట్లాడుతూ ప్రజలను మత ప్రాతిపదికన విడదీస్తున్న పౌరసత్వ సవరణ చట్టం, దేశపౌరుల ప్రాథమిక హక్కులకు భంగం కలిగించేలా ఉన్న ఎన్నార్సీ, ఎన్పీఆర్‌ను వెంటనే నిలిపివేయాలని డిమాండ్ చేశారు. సీఏఏకు వ్యతిరేకంగా సుప్రీంకోర్టులో రాష్ట్ర ప్రభుత్వం పిటిషన్ దాఖలు చేయాలని కోరారు. సీఏఏ నల్లచట్టం, ఎన్పీఆర్ కంపు చట్టమని విమర్శించారు.

### దేశంలో సగానికిపైగా బర్త్ సర్టిఫికెట్లు లేవు

ఎన్పీఆర్‌లో అత్యంత అవమానకరమైన నిబంధనలను పొందుపరిచారని చెప్పారు. మహిళ తన వయస్సు చెప్పలేకపోతే, వివాహ సమయంలోనైనా, కాపురం మొదలు పెట్టిన సమయంలో వయస్సు ఎంత ఉందో తెలుపాల్సిన నిబంధన మహిళాజాతికే అవమానమకరమని ధ్వజమెత్తారు. ప్రధాని మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్‌షా సీఏఏ, ఎన్పీఆర్ తర్వాత ఎన్నార్సీని అమలుచేసి పౌరసత్వ సమస్యను సృష్టించడానికి ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. దేశంలో చాలామందికి బర్త్ సర్టిఫికెట్లు లేవని, వాళ్ల తల్లిదండ్రుల సర్టిఫికెట్లు ఎక్కడి నుంచి తెస్తారని ప్రశ్నించారు. ఏ ఒక్కపత్రం సరిగ్గా లేక పోయినా 'అనుమానిత పౌరుడు'జాబితాలో పెడుతారని, పౌరసత్వాన్ని నిరూపించుకోవడానికి నరకం చవిచూడాల్సి వస్తుందని తెలిపారు. ఎన్యూమరేటర్, రిజిస్ట్రార్ దయాదాక్షిణ్యాలపై జీవితం ఆధారపడి ఉంటుందని, వారు డీ జాబితాలో చేరిస్తే అంతేసంగతులని చెప్పారు. సందేహాస్పదంగా ఉన్న పౌరులను డిటెన్షన్ సెంటర్‌కు పంపుతారని, అలా ఎంతమందిని డిటెన్షన్ సెంటర్‌లో పెట్టి ఎన్ని కోట్లు వృథా చేస్తారని ప్రశ్నించారు. తెలంగాణలో 85 లక్షల కుటుంబాలు ఉన్నాయని, సగం మందికి సొం తిండ్లు లేక చిరునామా మారుతుంటుందని చెప్పారు. అసోంలో ఎన్నార్సీ అమలుతో, దేశం కోసం కార్గిల్ యుద్ధంచేసినవారికి చోటు దక్కలేదని వివరించారు.

### ముఖ్యమంత్రి మహాలౌకికవాది

ముఖ్యమంత్రి కేసీఆర్ అన్ని మతాలు, వర్గాలను కలుపుకొని సమధర్మం, సమన్యాయం పాటిస్తూ ప్రభుత్వాన్ని నడుపుతున్న మహాలౌకికవాది అక్బరుద్దీన్ కొనియాడారు. అందుకే ఆయనకు మజ్లిస్ మద్దతునిస్తున్నదని ప్రపంచానికి చాటిచెప్తామని స్పష్టంచేశారు. 70 ఏండ్లుగా మైనార్టీలను రాజకీయంగా ఉపయోగించుకున్నవారు తమ చేయి వదిలేశారని, కేసీఆర్ మాత్రం కష్టకాలంలో ఆప్తునిలా వెన్నంటి నిలిచారు.. నిలుస్తున్నారని చెప్పారు. తామెప్పటికీ మేలు మరువమని, మద్దతుగా ఉంటామన్నారు.

### అన్నీ ఆలోచించాకే తీర్మానం: మంత్రి కొప్పుల



**సీఏఏ** చట్టాన్ని గుడ్డిగా వ్యతిరేకించలేదని, అన్ని విధాలుగా ఆలోచించాకే సీఎం కేసీఆర్ వ్యతిరేక తీర్మానంపై నిర్ణయం తీసుకున్నారని మంత్రి కొప్పుల ఈశ్వర్ చెప్పారు. ఇది సున్నిత అంశమని, దీన్ని రాజకీయ కోణంలో చూడవద్దని పేర్కొన్నారు. సీఏఏకు వ్యతిరేకంగా తీర్మానం చేసినందుకు సీఎం కేసీఆర్‌కు ధన్యవాదాలు తెలిపారు.

### సీఏఏ, ఎన్నార్సీ ప్రజావ్యతిరేకం: భట్టి

**సీఏఏ** చట్టం, ఎన్పీఆర్, ఎన్నార్సీ ప్రజావ్యతిరేకమని కాంగ్రెస్ శాసనసభా పక్షనేత మల్లుభట్టి విక్రమార్క చెప్పారు. ఎన్పీఆర్‌లో పౌరసత్వంపై ఎవరైనా అభ్యంతరం తెలిపే ఆస్కారం కల్పించారని, దీని వల్ల వివాదాలు తలెత్తుతాయని పేర్కొన్నారు. సభలో ప్రవేశపెట్టిన తీర్మానానికి కాంగ్రెస్ మద్దతు తెలుపుతుందని చెప్పారు.


### ఎన్పీఆర్ సర్వే నిలిపివేయాలి: షకీల్ అహ్మద్

**సీఎం** కేసీఆర్ సారథ్యంలో రాష్ట్రంలో సర్వమానవ సౌభ్రాతృత్వం వెల్లివిరుస్తున్నదని ఎమ్మెల్యే షకీల్ అహ్మద్ పేర్కొన్నారు. ముస్లింలతోపాటు అన్నివర్గాల ప్రజలకు ఇబ్బందిగా ఉన్న సీఏఏ, ఎన్పీఆర్, ఎన్నార్సీలను నిలిపివేయాలని డిమాండ్‌చేశారు.

### తీర్మానం కాపీని చించేసిన రాజాసింగ్

**సీఏఏ,** ఎన్పీఆర్,ఎన్నార్సీతో ఏ వర్గానికి ఇబ్బంది లేదని, సభ్యులు తప్పుదోవ పట్టిస్తున్నారని బీజేపీ ఎమ్మెల్యే రాజాసింగ్ వ్యాఖ్యానించారు. ఈ సందర్భంగా తీర్మానం కాపీలను చించివేశారు. ఈ చట్టాలతో ఎవరికైనా నష్టం జరిగితే, తెలంగాణ వదిలివెళ్తానని ప్రకటించారు.

## లోకం పోకడ





బయట పార్క్‌కెళ్లి గుర్రం ఎక్కించలేం కన్నా.. ఇంట్లోనే నాన్నతో సర్దుకో!

## ముహూర్తం

సూర్యోదయం: 6.21 గంటలకు

సూర్యాస్తమయం: 6.21 గంటలకు

వికారినామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిరరుతువు, ఫాల్గుణమాసం, కృష్ణపక్షం నవమి బుధవారం తె.జా. 3.25 వరకు, తదుపరి దశమి, నక్షత్రం: మూల ఉదయం 11.47 వరకు, తదుపరి పూర్వాషాఢ, అమృత ఘడియలు: ఉదయం 5.14 నుంచి 6.52 వరకు, రాహుకాలం: మధ్యాహ్నం 3.20 నుంచి సాయంత్రం 4.51 వరకు, దుర్ముహూర్తం: ఉదయం 8.45 నుంచి 9.33 వరకు, తిరిగి మధ్యాహ్నం 2.20 నుంచి 3.09 వరకు, వర్జ్యం: ఉదయం 10.09 నుంచి 11.47 వరకు.

# సజలం సుజలం సస్యశ్యామలం

## రైతును రాజు చేసేదాకా విశ్రమించను

- ఆరేండ్లలో అద్భుతం ఆవిష్కృతమైంది
- దేశంలోనే నంబర్‌వన్ రాష్ట్రంగా ఉన్నాం
- 2014లో రూ.4.80 లక్షల కోట్ల జీఎస్డీపీ రూ.9.69 లక్షల కోట్లకు పెరిగింది
- 125 రోజులుగా సజీవంగా కాకతీయకాల్వ
- యాసంగిలో 2.25 కోట్ల టన్నుల ధాన్యం దిగుబడి
- పోడుభూములపై ప్రజాదర్బారు నిర్వహిస్తాం
- మంచిని మెచ్చుకునే సంస్కృతి కాంగ్రెస్‌కు లేదు
- అసెంబ్లీలో ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు
- ద్రవ్య వినిమయబిల్లుపై చర్చకు సమాధానం

‘చచ్చేందుకు తయారై.. పేగులు తెగే దాకా కొట్లాడి.. ఉపాసం ఉండో ఉప్పిడి ఉండో తెలంగాణను తెచ్చింది టీఆర్‌ఎస్ అని ప్రపంచానికి తెలుసు. దీన్ని మేం చెడగొట్టం.. మా ప్రాణంపోయినా సరే కాంప్రమైజ్ కాము. ఏ దారికి తీసుకుపోవాలో అక్కడికి తీసుకుపోతాం. సజల, సుజల, సస్యశ్యామల తెలంగాణ చేసేవరకూ విశ్రమించను’



– అసెంబ్లీలో ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** చావునోట్లోకి వెళ్లి సాధించుకున్న తెలంగాణను ఏ దారికి తీసుకెళ్లాలో అక్కడకు తీసుకెళతామని, ప్రాణం పోయినా కాంప్రమైజ్ అయ్యేది లేదని ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు అన్నారు. సజల సుజల సస్యశ్యామల తెలంగాణను సాధించి తీరుతామని తేల్చి చెప్పారు. తెలంగాణోళ్లకు పరిపాలన చేతకాదని, తాము లేకుంటే చీకట్లోనే ఉంటారని శాపనార్థాలు పెట్టినోళ్ల అంచనాలన్నీ ఇవాళ తలకిందులయ్యాయని అన్నారు. సంక్షేమం, వ్యవసాయం, తలసరి ఆదాయం, విద్యుత్‌వినియోగం.. ఇలా అన్ని అంశాల్లో తెలంగాణ నంబర్‌వన్‌గా నిలిచిందని, ఆరంటే ఆరేండ్లలో ఎవరికీ సాధ్యంకాని పనులుచేస్తూ అద్భుతాన్ని ఆవిష్కరించామని వివరించారు. సోమవారం అసెంబ్లీలో ద్రవ్య వినిమయబిల్లుపై చర్చకు సీఎం కేసీఆర్ సమాధానమిచ్చారు. ఆర్థికమాంద్యంలోనూ ప్రజా సంక్షేమాన్ని విస్మరించడం లేదని చెప్పారు. రైతుబంధు పథకాన్ని ఐక్యరాజ్యసమితి మెచ్చుకున్నదని, ఎంతోమంది కేంద్రమంత్రులు ప్రశంసించారని గుర్తుచేశారు. పదేండ్ల కాంగ్రెస్ పాలనలో రాష్ట్ర జీఎస్డీపీ రూ.4.80 లక్షల కోట్లు మాత్రమేనని, కానీ నేడు జీఎస్డీపీ రూ.9,69,694 కోట్లకు పెరిగిందని చెప్పారు. అనేకరంగాల్లో తెలంగాణ దూసుకుపోతున్నదని, అభివృద్ధిని కండ్లముందు ఉంచామని.. ఈ విషయాన్ని కాగ్ నివేదికలే స్పష్టం చేస్తున్నాయని తెలిపారు. కేంద్రమంత్రులు సైతం పార్లమెంట్ సాక్షిగా ప్రకటించిన విషయాన్ని గుర్తుంచుకోవాలని పేర్కొన్నారు. మంచిని మంచి అని మెచ్చుకునే సంస్కారం కాంగ్రెస్‌కు లేదని విమర్శించారు. సీఎల్పీ నేత భట్టి విక్రమార్క నోటినుంచి ఒక్క పొగడ్తకూ తమ ప్రభుత్వం నోచుకోవడం లేదని అన్నారు. 2018 అసెంబ్లీ ఎన్నికల సమయంలో కూడా ఇంతకంటే ఎక్కువగా విమర్శలు చేశారని, వాటిపై కూడా తాము వాదించామని, అవన్నీ కూలంకషంగా గమనించే ప్రజలు తీర్పు ఇచ్చారని చెప్పారు.

### జాతి నిర్మాణంలోనూ కీలక భూమిక

తెలంగాణ తనకుతాను పునర్నిర్మాణం చేసుకోవడమే కాదు.. జాతి నిర్మాణంలోనూ కీలక భూమిక పోషిస్తున్నదని సీఎం కేసీఆర్ చెప్పారు. దేశాన్ని సాకే రాష్ట్రాల్లో తెలంగాణ ముందుంటుందని, కేంద్రానికి మనం భిక్ష వేస్తున్నామా.. కేంద్రం మనకు భిక్ష వేస్తున్నదా.. అనేది ఆలోచించాలని సూచించారు. కేంద్రం నుంచి వచ్చే పన్నుల వాటాల్లో కోతపెట్టారని, ఐదేండ్లలో తెలంగాణ నుంచి కేంద్రానికి రూ. 2,72,926 కోట్లు ట్యాక్స్‌ల రూపంలో వెళితే.. అక్కడినుంచి మాత్రం రూ.1,12,854 కోట్లు మాత్రమే వచ్చాయని తెలిపారు. మనకు రావాల్సిన వాటా ఇవ్వకుండా రూ.1400 కోట్లు అప్పు తీసుకోవాలని చెప్తున్నారని మండిపడ్డారు.

### అప్పులు.. తప్పుకాదు..

అభివృద్ధి చెందాలంటే అప్పులు చేయాల్సి ఉంటుందని, అగ్రరాజ్యంగా చెప్పుకొనే అమెరికా అత్యధికంగా అప్పుఉన్న దేశాల్లో ముందున్నదని కేసీఆర్ తెలిపారు. అప్పులు ఎందుకు తీసుకుంటున్నామనే విషయం ముఖ్యంకాదని, వాటిని వేటికోసం ఖర్చుపెడుతున్నామన్నదే అవసరమన్నారు. హిరోషిమా, నాగసాకిపై బాంబుదాడులకు కకావికలమైన జపాన్ 400% అప్పులు చేసి ఇవాళ అభివృద్ధిలో, జీడీపీలో అగ్రస్థానంలో ఉన్నదనే విషయాన్ని తెలుసుకోవాలని సూచించారు. కాళేశ్వరంతోపాటు సంక్షేమం, అభివృద్ధి పనుల కోసం లక్ష కోట్లు అప్పు తీసుకొచ్చామని, రెండేండ్లలో అప్పు మొత్తం తీరిపోతుందని వెల్లడించారు. 23 జిల్లాలున్న ఉమ్మడి రాష్ట్రానికి రూ.1.35 లక్షల కోట్ల బడ్జెట్ ఉంటే ఇప్పుడు తెలంగాణ బడ్జెట్ ఎంతుందో గమనించాలని హితవుపలికారు. తెలంగాణ తలసరి ఆదాయంలో నంబర్‌వన్‌గా ఉన్నదన్నారు.

### నాణ్యమైన విద్యుత్

ఇండియాలో ఎక్కడాలేనివిధంగా నాణ్యమైన విద్యుత్‌ను సరఫరా చేస్తున్నామన్న సీఎం కేసీఆర్.. క్వాలిటేటివ్ పవర్‌ను కాపాడుకుందామా? చార్జీలను భరిద్దామా? అని ప్రశ్నించారు. చార్జీలను పెంచే విషయంలో వెనకడుగు వేసేదిలేదని.. ఈ విషయంలో మాయామశ్చీంద్రా అంటూ మోసం చేయదల్చుకోలేదని స్పష్టంచేశారు. ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ కోసం ఖర్చుచేసిన పూర్తి లెక్కలను ప్రచురించిన మొట్టమొదటి ప్రభుత్వం దేశంలో తమదేనని చెప్పారు. పోడుభూముల సమస్య వారసత్వంగా వచ్చిందని, దీర్ఘకాలిక సమస్యలను దశలవారీగా పరిష్కరిస్తామని తెలిపారు. ఇందుకోసం తండాల్లో ప్రజాదర్బార్ నిర్వహిస్తామని, ఏజెన్సీ ప్రాంతాల అభివృద్ధి కోసం రూ.100 కోట్లు కేటాయించినట్టు తెలిపారు.

### రియల్ రంగం పురోగతి

ఆరేండ్లలో స్టాంప్‌డ్యూటీ, రిజిస్ట్రేషన్ చార్జీలను నయాపైసా కూడా పెంచలేదని సీఎం కేసీఆర్ చెప్పారు. రియల్ ఎస్టేట్‌రంగం పురోగతి చెందుతున్న క్రమంలో ఆశావహ దృక్పథంతో కాస్త బడా లక్ష్యాలను నిర్దేశించుకున్నామని వివరించారు. పలు రంగాల పనితీరును మెరుగుపరిచి, లీకేజీలను అరికట్టడంవల్ల ఆదాయం పెంపొందించినట్టు చెప్పారు. ఆర్టీసీకి బడ్జెట్‌లో రూ.1000 కోట్లు కేటాయించామని, సంస్థను లాభాల్లోకి తీసుకొచ్చేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామన్నారు. రాష్ట్రానికి పరిశ్రమలు వస్తున్నాయని, ఐటీ ఆదాయం పెరుగుతున్నదని తెలిపారు. వ్యవసాయరంగాన్ని లాభసాటిగా మార్చి, రైతును రాజును చేసేవరకు విశ్రమించనని స్పష్టంచేశారు.

### కాంగ్రెస్‌ని చూస్తే పిటీ

సభలో కాంగ్రెస్ సభ్యులను ఉద్దేశించి సీఎం మాట్లాడుతూ.. ‘మీకు పని లేదు.. మాకు పుర్సత్ లేదు.. తెలంగాణ పట్ల మాకు ఫుల్ పని ఉన్నది. పూర్తిస్థాయి కమిట్‌మెంట్ ఉన్నది. ఒకవైపు కరోనా, మరోవైపు ఆర్థికమాంద్యం బెదిరిస్తున్నాయి. అయినా పట్టువదలకుండా రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలోకి తీసుకెళ్తున్నాం. కాంగ్రెస్ పార్టీని చూస్తే పిటీ అనిపిస్తున్నది. మేం చెప్పేది వాళ్లకు అర్థం కాదు’ అని అన్నారు.

### అప్పల నుంచి లాభాల్లోకి విజయ డెయిరీ

తెలంగాణలో అభివృద్ధిని సామాజిక, మానవీయకోణంలో చూస్తున్నామని, కాంగ్రెస్ హయాంలో పింఛన్ రూ.200 ఉంటే.. ఇప్పుడు రూ.2,016 ఇస్తున్నామని కేసీఆర్ తెలిపారు. పేదింటి ఆడబిడ్డల కోసం కల్యాణ లక్ష్మి పథకాన్ని అమలుచేస్తున్నామన్నారు. బోదకాలు బాధితులు, ఒంటరి మహిళలకు కూడా పింఛన్ ఇస్తున్నామని, దివ్యాంగులకు రూ.3వేల చొప్పున ఇస్తున్నామని చెప్పారు. ఆర్థికపరిస్థితి బాగాలేదని ప్రతిపక్షాలు ఆరోపిస్తున్నాయన్న సీఎం.. ఈ పథకాలన్నీ ఎలా నడుపుతున్నామని వాటిని ప్రశ్నించారు. టీడీపీ, కాంగ్రెస్ హయాంలో విజయడెయిరీని సర్వనాశనం చేశారని ఆరోపించారు. విజయ నెయ్యికి ముంబైతోపాటు ఉత్తరభారతంలోనూ అద్భుతమైన డిమాండ్ ఉండేదని.. దానిని శంకరగిరిమాన్యాలు పట్టించారని మండిపడ్డారు. పాలఉత్పత్తిదారులకు లీటర్‌పై రూ.4 ప్రోత్సాహం ఇచ్చి డెయిరీని అభివృద్ధిలోకి తీసుకువచ్చామన్నారు. రూ.30 కోట్ల అప్పులు తీర్చి.. ఇప్పుడు రూ.16 కోట్ల లాభాల్లోకి తీసుకొచ్చామని వెల్లడించారు. ఆదాయం పెంచుకోవడం కోసం కడుపుకట్టుకొని పనిచేస్తున్నామని తెలిపారు. మద్యం, బెల్టు షాపులను మూసివేయడం వల్ల ఉపయోగం ఉంటుందా? అని కేసీఆర్ ప్రశ్నించారు. మద్యం తాగడాన్ని నిరుత్సాహపరిచేందుకే మద్యం రేట్లు పెంచామని వివరించారు.

### 24 గంటలూ తాగునీటి సరఫరా



హైదరాబాద్‌లో తాగునీటి సమస్యలు రాకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని.. నగరాన్ని విశ్వనగరంగా మార్చేందుకు రూ.10 వేల కోట్లను కేటాయించామని సీఎం కేసీఆర్ తెలిపారు. శివారుల్లో అద్భుతమైన రీతిలో మంచినీటి సరఫరా జరుగుతున్నదని చెప్పారు. రూ.3–4 వేల కోట్ల ఖర్చుతో హైదరాబాద్ చుట్టూ అభివృద్ధి చేస్తున్న రింగ్‌మెయిన్ పూర్తయితే తాగునీటికి ఎలాంటి ఢోకా ఉండబోదన్నారు. 24 గంటలు తాగునీటిని ఎలా సరఫరా చేయాలనే విషయంలో ‘ఆస్కీ’ నివేదిక తయారుచేస్తున్నదని తెలిపారు. మిషన్ భగీరథతో 24 వేల గ్రామాలకు మంచినీటిని అందిస్తున్నామని వివరించారు. ఏదో ఒకగ్రామం.. మారుమూలన కొన్ని ఇబ్బందులతో నీళ్లు రాకుంటే మొత్తం భగీరథ పథకమే దండుగ అన్నట్టు మాట్లాడటం సరికాదని అన్నారు. సభలో హుందాగా ఉండాలని సూచించారు.

### వ్యవసాయంలో గణనీయమైన అభివృద్ధి

వ్యవసాయరంగంలో గణనీయమైన అభివృద్ధి సాధించామని.. దర్జాగా కాలుమీద కాలేసుకుని పంటలు పండించుకునే స్థితికి రాష్ట్ర రైతాంగం వచ్చిందని సీఎం కేసీఆర్ చెప్పారు. 2014 వరకు 11.4% మైనస్‌లో ఉన్న వ్యవసాయరంగం.. ఇప్పుడు 23.7 శాతం ప్లస్‌కు వచ్చిందని, అంటే 34 నుంచి 35శాతం వృద్ధి సాధించినట్టని ప్రకటించారు. 38.19 లక్షల ఎకరాల్లో వరి సాగవుతున్నదని, 2.25 కోట్ల టన్నుల ధాన్యం ఉత్పత్తి వస్తుందని అంచనా వేస్తున్నామన్నారు. రైతులు పండించిన ప్రతిగింజనూ కొంటామని స్పష్టంచేశారు. ఇప్పటికే కంది విషయంలో కేంద్రం మోసంచేసేందుకు చూసిందని విమర్శించారు. తాము తక్షణంగా రూ.300 కోట్లు కొనుగోళ్లకు ఇచ్చామన్నారు. కాళేశ్వరం ద్వారా గోదావరి నది నుంచి 950 టీఎంసీల నీళ్లను తెస్తామని, వచ్చే ఏడాదిలోపే 530 టీఎంసీలను రాష్ట్రంలో వాడుకుంటామని తెలిపారు. గతంలో ఎస్సారెస్పీ కాలువల్లో నీరు ఎల్‌ఎండీ దాటి కిందకు రాలేదని.. కానీ ఇవాళ 125 రోజులుగా సజీవంగా పారుతున్నదని చెప్పారు. ఉద్యమ సమయంలో కాకతీయ కాల్వలను చూశామని, అప్పుడు నెర్రెలు బారి, తుమ్మచెట్లతో నిండిన కాలువలు ఇప్పుడు నీళ్లతో దుంకుతున్నాయని పేర్కొన్నారు. వచ్చే రెండేండ్లలో 1200 చెక్‌డ్యాములను పూర్తిచేస్తామని చెప్పారు. కాంగ్రెస్ సభ్యులు ప్రతిసారి ప్రాజెక్టుల డీపీఆర్లు కావాలని అడుగుతున్నారని, ఏ డీపీఆర్ కావాలో చెప్పాలని కోరారు. కాళేశ్వరం ప్రాజెక్టు డీపీఆర్ కావాలంటే పది లారీల కాగితాలు ఉంటాయని చెప్పారు. ప్రాజెక్టులకు బహిరంగ టెండర్లు పిలుస్తున్నామని, ప్రతిటెండర్ ఆన్‌లైన్‌లో ఉంటుందని పేర్కొన్నారు.



# ఉభయసభలు నిరవధిక వాయిదా

- శాసనసభ 8రోజుల్లో 48.41 గంటలు చర్చ
- మండలి 7రోజుల్లో 28.22 గంటలు..
- ద్రవ్యవినిమయ బిల్లుకు అసెంబ్లీ ఆమోదం

**అసెంబ్లీలో ఎవరెంతసేపు?**

| | | |
|---|---|---|
| సీఎం కేసీఆర్ | – | 5.58 గంటలు |
| అక్బరుద్దీన్ | – | 3.34 గంటలు |
| భట్టి విక్రమార్క | – | 3.29 గంటలు |
| రాజాసింగ్ | – | 54 నిమిషాలు |

**పార్టీలవారీగా..**

| | | |
|---|---|---|
| సీఎం/మంత్రులు | – | 23.45 గంటలు |
| టీఆర్‌ఎస్ | – | 11.06 గంటలు |
| ఎంఐఎం | – | 5.14 గంటలు |
| కాంగ్రెస్ | – | 7.02 గంటలు |
| టీడీపీ | – | 27 నిమిషాలు |
| బీజేపీ | – | 57 నిమిషాలు |
| ఇతరులు | – | 10 నిమిషాలు |

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** శాసనసభ, శాసనమండలిని నిరవధికంగా వాయిదా వేశారు. ఈ నెల 6న ప్రారంభమైన బడ్జెట్ సమావేశాలు సోమవారం సాయంత్రం ముగిశాయి. ద్రవ్యవినిమయ బిల్లుపై చర్చ తర్వాత సీఎం కేసీఆర్ సుదీర్ఘ వివరణ ఇచ్చారు. అనంతరం స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి అనుమతితో ఆర్థిక మంత్రి హరీశ్‌రావు ద్రవ్యవినిమయ బిల్లును ఆమోదించాలని సభను కోరారు. అనంతరం సభ ద్రవ్యవినిమయ బిల్లును ఆమోదించింది. ఆ తర్వాత స్పీకర్ శాసనసభను నిరవధికంగా వాయిదావేశారు. శాసనసభ ఎనిమిది రోజులు, శాసనమండలి ఏడు రోజులపాటు సాగాయి. మొదటిరోజు గవర్నర్ తమిళిసై సౌందర్‌రాజన్ ఉభయ సభలను ఉద్దేశించి ప్రసంగించారు. శాసనసభ ఎనిమిది రోజుల పనిదినాల్లో 48.41 గంటలపాటు సమావేశాలు నిర్వహించగా వ్యాట్ చట్టసవరణ, అభయహస్తం రద్దు, లోకాయుక్త చట్టసవరణ, లాభదాయకపదవుల అనర్హత మినహాయింపు, రెండు ఆర్థిక బిల్లులను ఆమోదించింది. పల్లెప్రగతి, కరోనా వైరస్ అంశాలపై స్వల్పకాలిక చర్చ జరిగింది. ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లు మరో పదేండ్లపాటు పెంచేందుకు తీర్మానం, సీఏఏ, ఎన్పీఆర్, ఎన్నార్సీ వ్యతిరేక తీర్మానాలను ఆమోదించింది. 76 మంది సభ్యులు మాట్లాడారు. 60 అనుబంధ ప్రశ్నలను సభ్యులు అడిగారు. 24 ప్రశ్నలకు సమాధానాలు ఇవ్వగా, మరో 28 ప్రశ్నలకు సమాధానాలను సభముందు ఉంచారు. శాసనమండలి ఏడు రోజుల్లో 28.22 గంటలపాటు సమావేశాలు సాగాయి. రెండు తీర్మానాలు, ఆరు బిల్లులకు ఆమోదం తెలిపారు. రెండు అంశాలపై స్వల్పకాలిక చర్చ జరిగింది. మొత్తం 50 మంది మాట్లాడారు. 17 ప్రశ్నలకు సమాధానం ఇవ్వగా, 18 ప్రశ్నలకు సమాధానాలను సభ ముందు ఉంచారు.

### అందరికీ ధన్యవాదాలు



- స్పీకర్ పోచారం

శాసనసభ నిర్వహణకు సహకరించిన ప్రతి ఒక్కరికీ స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి సభలో ధన్యవాదాలు తెలిపారు. సభా నాయకుడు సీఎం కేసీఆర్‌కు, మంత్రులు, సభ్యులు, డిప్యూటీ స్పీకర్ టీ పద్మారావుకు మనస్ఫూర్తిగా కృతజ్ఞతలు తెలుపుతున్నానన్నారు. శాసనసభ కార్యదర్శి, అసెంబ్లీ సిబ్బంది, అధికారులు కష్టపడి పనిచేశారని, వారందరికీ ధన్యవాదాలు తెలిపారు. సభ్యులు సభా కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొన్నారని చెప్పారు.

### అద్భుతంగా సమావేశాలు



- మంత్రి ప్రశాంత్‌రెడ్డి

ఉభయ సభలు అద్భుతంగా సాగాయని శాసన సభ వ్యవహారాలశాఖ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి తెలిపారు. బడ్జెట్‌ను ఆమోదించుకోవడమే కాకుండా అనేక ప్రజా సంబంధిత అంశాలు చర్చకు వచ్చాయని ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎన్నడు లేనివిధంగా 40 పద్దులపై 36 మంది సభ్యులు చర్చలో పాల్గొనడం ఆహ్వానించదగ్గ పరిణామన్నారు. సభ్యులు ఉత్సాహంగా పాల్గొని తమ నియోజకవర్గ సమస్యలను ప్రస్తావించారని చెప్పారు.

## నాలుగు బిల్లులకు మండలి ఆమోదం

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** శాసనమండలి సోమవారం నాలుగు బిల్లులకు ఆమోదం తెలిపింది. వ్యాట్ చట్టసవరణ, అభయహస్తం రద్దు, లోకాయుక్త చట్టసవరణ, లాభదాయకపదవుల అనర్హత మినహాయింపు బిల్లులకు మండలి ఏకగ్రీవంగా ఆమోదించింది. ఈ బిల్లులను ఆర్థిక మంత్రి హరీశ్‌రావు, పంచాయతీరాజ్‌శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు మండలిలో ప్రవేశపెట్టారు.

# ఆధారాలు చూపిస్తే రాజీనామా

- ‘తుమ్మిడిహట్టి’పై కాంగ్రెస్ ఒప్పందం చేసుకున్నదా?
- అంతర్రాష్ట్ర ఒప్పందంపై ఆధారాలు చూపిస్తారా?
- అసెంబ్లీలో సీఎల్పీ నేత భట్టికి ముఖ్యమంత్రి సవాల్



**హైదరాబాద్,నమస్తే తెలంగాణ:** ‘ప్రాణహిత నదిపై తుమ్మిడిహట్టి దగ్గర 152 మీటర్ల ఎత్తులో బరాజ్ నిర్మాణానికి కాంగ్రెస్ ప్రభుత్వం గతంలో ఎలాంటి అంతర్రాష్ట్ర ఒప్పందం చేసుకోలేదు. ఒకవేళ చేసుకున్నట్టు ఆధారాలు చూపితే రాజీనామా చేస్తా’ అని ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు సవాల్ విసిరారు. తెలంగాణ ప్రభుత్వం కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా మేడిగడ్డ వద్ద 100 మీటర్ల ఎత్తులో లక్ష్మీ బరాజ్ నిర్మాణానికి మహారాష్ట్రతో అంతర్రాష్ట్ర ఒప్పందాన్ని పూర్తి చేసుకున్నదని గుర్తుచేశారు. సభను తప్పుదోవ పట్టిస్తున్నారంటూ సీఎల్పీ నేత భట్టి విక్రమార్క చేసిన ఆరోపణపై సీఎం కేసీఆర్ తీవ్రంగా స్పందించారు. తుమ్మిడిహట్టిపై ఆనాడు అగ్రిమెంట్ కాలేదని, ప్రొసీజర్ లేదని.. ఉంటే చూపించాలని డిమాండ్‌చేశారు. తాము చేసుకున్న అంతరాష్ట్ర ఒప్పందంపై అసెంబ్లీలో చెప్పానని, పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ఇస్తే సభ నుంచి కాంగ్రెస్ నాయకులు పారిపోయారని, తాము సైతం పవర్ పాయింట్ ప్రజంటేషన్ ఇస్తానని అటే పోయారని ఎద్దేవాచేశారు. నాడు పారిపోయి, ఇప్పుడు ఇష్టంవచ్చినట్టు మాట్లాడితే ఎలా? అని ప్రశ్నించారు.

### ఎన్పీఆర్‌పై దీర్ఘకాలిక పోరాటం

ఎన్పీఆర్ విషయంలో దీర్ఘకాలిక దృష్టితో పనిచేయాలని సీఎం కేసీఆర్ పేర్కొన్నారు. నిరంతరాయంగా అంకితభావంతో పోరాటం చేయాల్సి ఉంటుందని, దేశంలో భావసారూప్యత కలిగిన వారిని సమీకరించి పోరాడుతామని చెప్పారు. ఇప్పటివరకు కేరళ, బెంగాల్ రాష్ట్రాలు స్టే ఇచ్చాయని, రాజస్థాన్‌వంటి రాష్ట్రాలు ఇంకా స్టే ఇవ్వలేదని తెలిపారు. ఇప్పటికే ప్రభుత్వ ప్రధాన సలహాదారు రాజీవ్‌శర్మ, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సోమేశ్‌కుమార్ కేరళ సీఎస్‌తో మాట్లాడారని, కేరళ, ఇతర రాష్ట్రాల కంటే మనం మెరుగైన నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. ఎన్పీఆర్‌పై దేశంలో అన్నిరాష్ట్రాల కంటే తెలంగాణ ముందంజలో ఉంటుందని స్పష్టంచేశారు. అఫీషియల్ లాంగ్వేజ్ కమిషన్‌లో ఒకరిని నియమిస్తామని అక్బరుద్దీన్ అడిగిన క్లారిఫికేషన్‌కు సీఎం కేసీఆర్ సమాధానమిచ్చారు. వక్ఫ్‌బోర్డు పరిస్థితిపై వ్యక్తిగతంగా సమీక్ష నిర్వహిస్తానని, అక్బరుద్దీన్‌ను పిలుస్తామని పేర్కొన్నారు.

### రేటు పెంచకున్నా ఇసుకపై ఆదాయం

ఉమ్మడి రాష్ట్రంలో ఇసుకపై రూ.40 కోట్ల ఆదాయమే వచ్చిందని సీఎం కేసీఆర్ చెప్పారు. తాము నాటి నుంచి నేటి వరకు ఉమ్మడిరాష్ట్రంలో ప్రభుత్వం నిర్ణయించిన రేట్లకే ఇసుక విక్రయాలు చేపట్టి ఆదాయాన్ని సమకూరుస్తున్నామని తెలిపారు. అప్పట్లో ఇసుక ఆదాయం నేతల జేబుల్లోకి వెళ్తే, ఇప్పుడు ప్రభుత్వ ఖజానాకు వస్తున్నదని అన్నారు. అందుకే తెలంగాణ వచ్చిన తర్వాత ఒక్క రూపాయి రేటు పెంచకున్నా ఖజానాకు రూ.3000 కోట్ల ఆదాయం వచ్చిందని తెలిపారు. ప్రమాదవశాత్తు కాలిపోయిన ఇండ్లకు డబ్బులు ఇస్తున్నామని మరో ప్రశ్నకు సమాధానం చెప్పారు. కార్మికుల కనీస వేతనాలు కేంద్రం చట్టం ప్రకారం ఇస్తామని, ఉపాధిహామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్లు ప్రభుత్వ ఉద్యోగులు కాదని స్పష్టంచేశారు. ఫీల్డ్ అసిస్టెంట్ల సమ్మెతో ఏకీభవించబోమని, సమ్మెచేస్తే వారు ఉద్యోగాలు పోగొట్టుకున్నట్టేనని తెలిపారు. ఏ జిల్లా పరిధిలో ఆ జిల్లా కలెక్టర్ చర్యలు తీసుకుంటారని తెలిపారు.

# అన్ని రంగాల్లో సమగ్రాభివృద్ధి

- తెలంగాణలో ప్రాధాన్య రంగాలకు పెరిగిన ఖర్చులు
- గత ఐదేండ్లలో భారీగా పెరిగిన కేటాయింపులు
- ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రెవెన్యూ వృద్ధిరేటు 13.6 శాతం
- ద్రవ్యవినిమయ బిల్లుపై చర్చలో మంత్రి హరీశ్‌రావు వెల్లడి



**హైదరాబాద్, నమస్తేతెలంగాణ:** అన్ని రంగాల్లో తెలంగాణ సమగ్రాభివృద్ధిని సాధించిందని ఆర్థికశాఖ మంత్రి హరీశ్‌రావు అన్నారు. ద్రవ్యవినిమయ బిల్లుపై చర్చ సందర్భంగా సోమవారం శాసనమండలిలో సభ్యులు రామచంద్రారావు, టీ జీవన్‌రెడ్డి, నర్సిరెడ్డి, రాజేశ్వర్‌రావు, జనార్దన్‌రెడ్డి, బాలసాని లక్ష్మీనారాయణ, జాఫ్రీ తదితరులు వ్యక్తంచేసిన సందేహాలను మంత్రి హరీశ్‌రావు నివృత్తిచేశారు. ఏ దేశంలోనైనా, ఏ రాష్ట్రంలోనైనా గుణాత్మక మార్పు రావాలంటే కనీసం 10 నుంచి 15 సంవత్సరాలు పడుతుందని, కానీ తెలంగాణ రాష్ట్రం ఐదేండ్లలోనే అనేక రంగాల్లో గొప్ప పురోగతి సాధించిందని పేర్కొన్నారు. ఆర్థికమాంద్యం నేపథ్యంలో ప్రస్తుతం పలు రాష్ట్రాలు ఉద్యోగులకు నిర్ణీత సమయంలో వేతనాలు ఇవ్వలేకపోతున్నాయని, మరికొన్ని రాష్ట్రాలు సంక్షేమ పథకాల్లో కోతలు విధించాయని తెలిపారు. ఇలాంటి పరిస్థితుల్లో తెలంగాణ ఆర్థికమాంద్యాన్ని అధిగమించి సమగ్ర అభివృద్ధిని సాధించడం గొప్ప విషయమన్నారు.

### పేదలకు జీవనభద్రత

రాష్ట్ర ఆదాయం, అన్ని రంగాల్లో వ్యయం పెరుగడంతో పేదలకు జీవనభద్రత లభించిందని మంత్రి హరీశ్‌రావు చెప్పారు. దేశంలోని వివిధ అభివృద్ధి సూచీల్లో తెలంగాణ తొలి మొదటి మూడు స్థానాల్లో నిలిచినట్టు నీతిఆయోగ్, కేంద్ర ప్రభుత్వ సర్వేలు స్పష్టం చేస్తున్నాయన్నారు. ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పడిన తొలి ఏడాది (2014–15లో) రూ.62,306 కోట్లుగా ఉన్న తెలంగాణ ప్రభుత్వ వ్యయం ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో నాటికి రూ.1,35,328 కోట్లకు చేరిందని, గత ఐదేండ్లలో రాష్ట్ర ప్రభుత్వ ఖర్చు 117 శాతం పెరిగిందని తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావానికి ముందు పదేండ్లలో రూ.54,052 కోట్లుగా ఉన్న రాష్ట్ర పెట్టుబడి వ్యయం ఇప్పుడు నాలుగు రెట్లు పెరిగి రూ.2,11,800 కోట్లకు చేరిందన్నారు. 2019–20లో రాష్ట్ర రెవెన్యూ వృద్ధిరేటు 13.6 శాతంగా నమోదైందని, 2014–19 మధ్య కాలంలో తెలంగాణ 21.5 శాతం రెవెన్యూ వృద్ధిరేటుతో దేశంలోనే అగ్రస్థానంలో నిలిచిందని వివరించారు. వ్యవసాయ, విద్యుత్, పారిశ్రామిక తదితర పలు రంగాల్లో తెలంగాణ గత ఐదేండ్లలో సాధించిన వృద్ధిరేటు జాతీయ వృద్ధిరేటుకంటే చాలా అధికంగా ఉన్నదన్నారు.

### గత ఐదేండ్లలో పలు రంగాలకు భారీగా కేటాయింపులు

2004 నుంచి 2014 వరకు బడ్జెట్‌లో వ్యవసాయరంగానికి రూ.8,851 కోట్లుగా ఉన్న కేటాయింపులు గత ఐదేండ్లలో రూ.33,125 కోట్లకు పెరిగాయని మంత్రి హరీశ్‌రావు తెలిపారు. ఇదేకాలంలో పశుసంవర్ధక శాఖకు రూ.2,219 కోట్ల నుంచి రూ.9,035 కోట్లకు, సాగునీటిరంగానికి రూ.54,021 కోట్ల నుంచి రూ.1,14,434 కోట్లకు, విద్యుత్‌రంగానికి రూ.13,922 కోట్ల నుంచి రూ.49,872 కోట్లకు, సామాజిక భద్రత పింఛన్లకు రూ.5,550 కోట్ల నుంచి రూ.42,470 కోట్లకు, పరిశ్రమలరంగానికి రూ.2,352 కోట్ల నుంచి రూ.4, 389 కోట్లకు కేటాయింపులు పెరిగాయన్నారు.

### రాష్ట్రానికి ఇవ్వాల్సిన నిధుల్లో కేంద్రం కోతలు

దేశ రక్షణ, అభ్యున్నతి కోసం తెలంగాణ ప్రభుత్వమే కేంద్రానికి రూ.1,60,072 కోట్లు అధికంగా ఇచ్చిందని మంత్రి హరీశ్‌రావు తెలిపారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రాష్ట్రానికి హక్కుగా కేంద్రం రూ.20,583 కోట్లు ఇవ్వాల్సి ఉండగా, రూ.15,788 కోట్లే ఇచ్చిందని, దాదాపు రూ.4,595 కోట్లు తగ్గించిందని చెప్పారు. తెలంగాణకు కేంద్రం ఇవ్వాల్సిన నిధులను ఇవ్వకపోగా రూ.1,435 కోట్లు అప్పు తెచ్చుకునేందుకు అనుమతి ఇచ్చిందని, 15వ ఆర్థిక సంఘం చేసిన అంతర్గత సర్దుబాటు కారణంగా రాష్ట్రానికి రావాల్సిన నిధుల్లో రూ.2,384 కోట్లు తగ్గాయని, ఈ నిధుల స్థానంలో గ్రాంటుగా రూ.723 కోట్లు ఇచ్చే అంశాన్ని పరిశీలించాలని ఆర్థిక సంఘం కేంద్రానికి సూచించిందని ఆయన తెలిపారు. 14వ ఆర్థిక సంఘం నుంచి రాష్ట్రానికి గ్రామీణాభివృద్ధి పద్దు కింద రూ.313 కోట్లు, పట్టణాభివృద్ధి పద్దు కింద మరో రూ.801 కోట్లు రావాల్సి ఉందన్నారు. అలాగే ఫిబ్రవరి 29 నాటికి కేంద్రం నుంచి తెలంగాణకు జీఎస్టీ కింద రూ.933 కోట్లు, ఐజీఎస్టీ కింద రూ.2,812 కోట్లు, రాష్ట్ర విభజన చట్టం ప్రకారం వెనుకబడిన జిల్లాల అభివృద్ధికి రూ.450 కోట్లు రావల్సి ఉన్నదని మంత్రి హరీశ్‌రావు వెల్లడించారు. అనంతరం సభ్యులు ద్రవ్యవినిమయ బిల్లును ఏకగ్రీవంగా ఆమోదించారు.

tifr TATA INSTITUTE OF FUNDAMENTAL RESEARCH, Hyd.
(A Deemed University)
36/P, Gopanpally Village, Serilingampally Mandal, Ranga Reddy District, Hyd, T.S. - 500 107
Advertisement No. 2/2020
Applications invited for Admission to TIFR, Hyderabad under the Subject Board of Physics and Subject Board of Chemistry
Ph.D. & INTEGRATED M.SC.-Ph.D. PROGRAMMES
Starting from August, 2020
For application procedure & to apply online, please visit
https://gsadmissions.tifrh.res.in
or write to Academic Coordinator Email: gsadmissions@tifrh.res.in
Last Date for Receiving Applications: 10 April, 2020



పుట్టినరోజు సందర్భంగా ప్రగతిభవన్‌లో మంత్రి శ్రీనివాస్‌గౌడ్‌ను ఆప్యాయంగా ఆలింగనం చేసుకొంటున్న సీఎం కేసీఆర్

## మంత్రి శ్రీనివాస్‌గౌడ్‌కు జన్మదిన శుభాకాంక్షలు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** మంత్రి వీ శ్రీనివాస్‌గౌడ్‌కు సీఎం కేసీఆర్ జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. సోమవారం ప్రగతిభవన్‌లో సీఎంను కలిసి ఆశీర్వాదం తీసుకున్నారు. గవర్నర్ తమిళిసై సౌందర్‌రాజన్ ఫోన్‌ద్వారా శుభాకాంక్షలు చెప్పారు. అసెంబ్లీలో మంత్రి కేటీఆర్ శుభాకాంక్షలు తెలిపారు. పలువురు ఎమ్మెల్యేల సమక్షంలో అసెంబ్లీలో కేక్ కట్‌చేశారు.



మంత్రి శ్రీనివాస్‌గౌడ్ పుట్టినరోజు సందర్భంగా కేక్ కట్‌చేస్తున్న బీటీఎన్జీవో నాయకులు

### ఉద్యోగ సంఘాల శుభాకాంక్షలు

మంత్రి శ్రీనివాస్‌గౌడ్‌కు ఉద్యోగసంఘాలు జన్మదిన శుభాకాంక్షలు తెలిపాయి. టీజీవో శ్రీనివాస్‌గౌడ్‌పై వెలువరించిన 'ఉద్యోగుల కిరణం' పత్రికను మంత్రి చేతుల మీదుగా ఆవిష్కరించారు. కార్యక్రమంలో టీజీవో అధ్యక్షురాలు మమత, ప్రధాన కార్యదర్శి ఏ సత్యనారాయణ పాల్గొన్నారు. టీఎన్జీవో కేంద్ర సంఘం అధ్యక్షుడు కారం రవీందర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి మామిళ్ల రాజేందర్, తెలంగాణ గ్రూప్-1 అధికారుల సంఘం ప్రధాన కార్యదర్శి హనుమంత్‌నాయక్, తెలంగాణ పర్యాటకశాఖ కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సంఘం నేత రాజమౌళి జన్మదిన వేడుకలు జరిపారు. బీటీఎన్జీవో అధ్యక్షుడు ముత్యాల సత్యనారాయణ, కార్యదర్శి మల్లారెడ్డి, శ్రీనివాస్, రాజేశ్వర్‌రావు, ప్రభాకర్‌రెడ్డి, టీజీవో వైద్యారోగ్యశాఖ విభాగం అధ్యక్షుడు జూపల్లి రాజేందర్ జన్మదిన వేడుకలు నిర్వహించారు.

## అద్భుతం.. కాళేశ్వర జల 'వారధి'




సముద్రాన్ని తలపిస్తున్న జలాలు.. వాటి మధ్య కిలోమీటర్ వంతెన.. ఇదెక్కడో విదేశాల్లో కాదు, కరీంనగర్ ఉమ్మడి జిల్లాలోని శాభాష్‌పల్లి ప్రాంతం.. స్వరాష్ట్రంలో రూపుదిద్దుకున్న జలవారధి! కాళేశ్వరం ఎత్తిపోతల పథకంలో భాగంగా బోయినపల్లి మండలం శ్రీరాజరాజేశ్వర (మిడ్‌మానేరు) జలాశయాన్ని గోదావరి నీళ్లతో నింపగా, బ్యాక్‌వాటర్‌లో ఈ బ్రిడ్జి కనువిందు చేస్తున్నది. కనుచూపు మేర నీళ్ల నడుమ సుమారు ₹142 కోట్లతో నిర్మితమై ఆహ్లాదం పంచుతున్న నాలుగు వరుసల వంతెన -కరీంనగర్ స్టాఫ్ ఫొటోగ్రాఫర్, నమస్తే తెలంగాణ



## బండి సంజయ్‌కి అవగాహనలేదు

■ ఎమ్మెల్సీ కర్నె ప్రభాకర్



**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రాష్ట్రాభివృద్ధికి బీజేపీ నేతలు ఏమాత్రం సహకరించడంలేదని ఎమ్మెల్సీ కర్నె ప్రభాకర్ అన్నారు. సోమవారం ఆయన అసెంబ్లీ మీడియా పాయింట్‌లో మాట్లాడుతూ.. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా నియమితులైన బండి సంజయ్‌కు రాష్ట్రంపై ఎలాంటి అవగాహనలేదని చెప్పారు. బీజేపీ మాజీ అధ్యక్షుడు లక్ష్మణ్ నిన్నటివరకూ ప్రభుత్వాన్ని తిట్టేందుకే పరిమితమయ్యారని, ఆయన వారసత్వాన్ని సంజయ్ పుచ్చుకొన్నారని ఎద్దేవాచేశారు.

## సంజయ్‌వి మితిమీరిన మాటలు

■ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి ఫైర్



**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** బీజేపీ రాష్ట్ర అధ్యక్ష పదవి చేపట్టి గంటలు కూడా గడవక ముందే బండి సంజయ్ మితిమీరి మాట్లాడుతున్నారని ఆర్మూర్ ఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తంచేశారు. సోమవారం ఆయన అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద మాట్లాడుతూ.. బీజేపీకి తెలంగాణ ప్రజలెప్పుడో గోరీ కట్టారని, సంజయ్ మతి భ్రమించి మాట్లాడుతున్నారని మండిపడ్డారు. సంజయ్ వయసు సీఎం కేసీఆర్ రాజకీయ అనుభవమంత లేదని ఎద్దేవాచేశారు.

## అన్ని మార్కెట్లలో కరోనా జాగ్రత్తలు

■ మంత్రి నిరంజన్‌రెడ్డి

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** కరోనా వైరస్ నిరోధానికి రాష్ట్రంలోని అన్ని మార్కెట్లలో జాగ్రత్తలు తీసుకోవాలని వ్యవసాయ, మార్కెటింగ్‌శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. సోమవారం ఆయన మార్కెటింగ్‌శాఖ అధికారులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ.. మార్కెట్లను పరిశుభ్రంగా ఉంచాలని, కరోనాను అరికట్టేందుకు చేపట్టాల్సిన జాగ్రత్తలతో పోస్టర్లను ప్రదర్శించాలని సూచించారు. మార్కెట్లలో హమాలీలు, రైతులు, కూలీలు ఒకచోట గుమిగూడకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు.

# అనుక్షణం అప్రమత్తం

కరోనాపై ప్రభుత్వం మరింత అలర్ట్ ■ నియంత్రణ చర్యలపై సీఎం కేసీఆర్ ఆరా

కేంద్రం థర్మల్ స్కానర్లు ఇవ్వాలన్న సీఎస్ ■ రాష్ట్రంలో మరో కరోనా పాజిటివ్

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** కరోనా వైరస్ వ్యాప్తి నియంత్రణపై రాష్ట్ర ప్రభుత్వం అనుక్షణం అప్రమత్తంగా వ్యవహరిస్తున్నది. దేశవ్యాప్తంగా కొవిడ్-19 వ్యాప్తి నేపథ్యంలో తెలంగాణలో తీసుకొంటున్న నియంత్రణ చర్యలపై ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు ఆరా తీశారు. సోమవారం అసెంబ్లీలో సీఎం కేసీఆర్‌తో వైద్యారోగ్యశాఖ మంత్రి ఈటల రాజేందర్ భేటీ అయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో వైద్య విభాగం చేపడుతున్న చర్యలను ముఖ్యమంత్రికి వివరించారు. కరోనా వైరస్ వ్యాప్తిని అరికట్టేందుకు, పాజిటివ్ వచ్చినవారికి అందిస్తున్న చికిత్స వివరాలు, ఆరోగ్యశాఖ తీసుకుంటున్న ప్రత్యేక చర్యలను తెలిపారు. గచ్చిబౌలిలో ఏర్పాటుచేసిన క్వారంటైన్ భవనంలో కల్పించిన సౌకర్యాలను వివరించారు. అప్రమత్తంగా ఉండాలన్న సీఎం కేసీఆర్ ఆదేశాలతో.. వైద్యారోగ్యశాఖ అధికారులతో మంత్రి ఈటల చర్చించారు. అసెంబ్లీ నుంచే వైద్యారోగ్యశాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ ఏ శాంతికుమారి, ప్రొక్యూర్మెంట్ కమిటీ హెడ్ టీకే శ్రీదేవి, డీఎంఈ రమేశ్‌రెడ్డి, ప్రజారోగ్యశాఖ డైరెక్టర్ జీ శ్రీనివాసరావు, టీఎస్ఎంఎస్ఐడీసీ ఎండీ చంద్రశేఖర్‌రెడ్డి, గాంధీ దవాఖాన సూపరింటెండెంట్ శ్రవణ్‌తో వేర్వేరుగా ఫోన్లో మాట్లాడారు. వైరస్ బారిన పడ్డవారితోపాటు కుటుంబ సభ్యులతో ప్రత్యేకంగా మాట్లాడి భరోసా కల్పిస్తున్నారు.

### అవసరమైన వస్తువులు కొనండి

కొవిడ్-19 నియంత్రణ నేపథ్యంలో దవాఖానల్లో అవసరమైన వస్తువులను తక్షణం కొనుగోలు చేయాలని మంత్రి ఈటల.. అధికారులకు సూచించారు. ఐసొలేషన్ వార్డుల్లో ఉపయోగించే ఎన్-95 మాస్కులు 50 వేలు, 25 వేల పర్సనల్ ప్రొటెక్షన్ ఎక్విప్‌మెంట్లు, లక్ష హ్యాండ్‌గ్లౌజ్‌లు, రెండులక్షల ట్రిపుల్ లేయర్ మాస్కులు కొనుగోలు చేయాలని ఆదేశించారు. పీహెచ్‌సీలకు అందించేందుకు శానిటైజర్లు, మందులు, థర్మో స్కానర్లను టెండర్లు లేకుండా తక్షణం కొనుగోలు చేయాలని చెప్పారు. మహారాష్ట్రలో కరోనా కేసులు ఎక్కువగా నమోదవుతున్నాయి. అక్కడనుంచి తెలంగాణకు వచ్చే మార్గాల్లోని చెక్‌పోస్టుల్లో తనిఖీలు చేపట్టి కరోనా నిర్ధారణ పరీక్షలుచేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. మరోవైపు, హైదరాబాద్ నల్లకుంటలోని ఫీవర్ దవాఖానలో కరోనా అనుమానితులు ధరించిన దుస్తులను ఐసొలేటెడ్ వార్డు బయట కాల్చివేయడంపై వైద్యారోగ్యశాఖ ఉన్నతాధికారులు ఆగ్రహం వ్యక్తంచేశారు.



ఇండోనేషియా పర్యాటకులను స్క్రీనింగ్ పరీక్షల కోసం గాంధీ దవాఖానకు తరలిస్తున్న సిబ్బంది

### రెండు థర్మల్ స్కానర్లు ఇవ్వండి: సీఎస్

రాష్ట్రంలో కరోనా వ్యాప్తిచెందకుండా ప్రభుత్వం పకడ్బందీ చర్యలు చేపడుతున్నదని సీఎస్ సోమేశ్‌కుమార్ తెలిపారు. రాజీవ్‌గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలో రెండు థర్మల్ స్కానర్లు ఏర్పాటుచేయాలని కోరారు. కరోనా పరీక్షలను జరిపేందుకు రెండు ప్రయోగశాలలను మంజూరుచేయాలని విజ్ఞప్తిచేశారు. సోమవారం వివిధ రాష్ట్రాల సీఎస్‌లతో కేంద్ర క్యాబినెట్ సెక్రటరీ రాజీవ్‌గాబా వీడియోకాన్ఫరెన్స్ నిర్వహించా రు. ఈ సందర్భంగా.. తెలంగాణ ప్రభుత్వం చేపడుతున్న చర్యలను సోమేశ్‌కుమార్ వివరించారు.

### దక్షిణ మధ్య రైల్వే, ఆర్టీసీ చర్యలు

కరోనా వ్యాప్తి నియంత్రణకు దక్షిణమధ్య రైల్వే, టీఎస్ ఆర్టీసీ ముందస్తు చర్యలు చేపట్టాయి. రైల్వే జోన్‌లోని ఆరు డివిజన్ల పరిధిలో కరోనా బాధితులకు చికిత్సచేసేందుకు 1,019 పడకలను సిద్ధంచేశారు. ఆర్టీసీ.. ప్రతి ట్రిప్ తర్వాత బస్సులను శుభ్రం చేయిస్తున్నది. కండక్టర్లకు శానిటైజర్లను అందజేస్తున్నది.

## తెలంగాణలో మరో కరోనా కేసు

రాష్ట్రంలో మరో కరోనా పాజిటివ్ కేసు నమోదైంది. స్కాట్లాండ్ నుంచి వచ్చిన ఓ వ్యక్తికి కరోనా వైరస్ పరీక్ష చేయగా పాజిటివ్ వచ్చిందని వైద్యారోగ్యశాఖ సోమవారం బులెటిన్ విడుదలచేసింది. అతనికి గాంధీలోని ఐసొలేషన్ వార్డులో వైద్యసేవలు అందిస్తున్నట్టు పేర్కొన్నది. కొవిడ్-19 వైరస్ వ్యాప్తి నియంత్రణలో భాగంగా సోమవారం శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయంలో 3,151 మందికి థర్మల్ స్క్రీనింగ్ పరీక్షలు చేశారు. అనుమానిత లక్షణాలున్న వారిలో 19 మందికి గాంధీ దవాఖానలో వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేసినట్టు వైద్యశాఖ ప్రకటించింది. రాష్ట్రంలో ఇప్పటివరకు నాలుగు కొవిడ్-19 పాజిటివ్ కేసులు నమోదు కాగా, ఒక వ్యక్తి పూర్తిగా కోలుకుని డిశ్చార్జ్ అయ్యారని వైద్యశాఖ వెల్లడించింది. మిగిలిన ముగ్గురిని ఐసొలేషన్‌లో ఉంచి వైద్యసేవలు అందిస్తున్నట్టు తెలిపింది. పాజిటివ్‌గా నమోదైన వారంతా విదేశాల్లో పర్యటించి వచ్చినవారే.

## అత్యవసర కేసులే విచారణ: హైకోర్టు

కరోనా వైరస్ విస్తరిస్తున్న నేపథ్యంలో అత్యవసర కేసులపైనే విచారణ చేపట్టాలని హైకోర్టు నిర్ణయించింది. సోమవారం ఈ మేరకు హైకోర్టు చీఫ్ జస్టిస్ రాఘవేంద్రసింగ్ చౌహాన్ నేతృత్వంలో హైకోర్టు న్యాయమూర్తులు, అడ్వకేట్ జనరల్ బీఎస్ ప్రసాద్, బార్ కౌన్సిల్ చైర్మన్ ఏ నర్సింహారెడ్డి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సూర్యకరణ్‌రెడ్డితో జరిగిన సమావేశంలో పలు నిర్ణయాలు తీసుకున్నారు. తదుపరి ఆదేశాలు వెలువడే వరకు ఒక ద్విసభ్య ధర్మాసనం, నాలుగు సింగిల్ బెంచ్‌లు మాత్రమే కేసుల విచారణ చేపట్టనున్నాయి. ఇవి సోమ, బుధ, శుక్రవారాల్లో పనిచేయనున్నాయి. హైకోర్టు సిబ్బందికి బయోమెట్రిక్ హాజరు నమోదు నుంచి మినహాయించారు.



సోమవారం హైటెక్ సిటీలోని ఓ ఐటీ కంపెనీలో ఉద్యోగికి థర్మల్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహిస్తున్న సిబ్బంది



గచ్చిబౌలి స్టేడియాన్ని క్వారంటైన్ కేంద్రంగా సిద్ధం చేయడంలో భాగంగా ఫాగింగ్ చేస్తున్న దృశ్యం

## రాజ్యసభకు కేకే, సురేశ్‌రెడ్డి ఏకగ్రీవం!

■ రేపు అధికారికంగా ప్రకటన

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రాష్ట్రంనుంచి రాజ్యసభ రెండుస్థానాలకు జరుగుతున్న ఎన్నికల ప్రక్రియలో నామినేషన్ల పరిశీలన ముగిసింది. సోమవారం నామినేషన్లను రిటర్నింగ్ అధికారి డాక్టర్ వీ నర్సింహాచార్యులు పరిశీలించారు. మొత్తం నాలుగు నామినేషన్లు దాఖలయ్యాయి. శ్రమజీవి పార్టీకి చెందిన జాజుల భాస్కర్, బీ కోయల్కర్‌ల నామినేషన్లలో ఎమ్మెల్యేల సంతకాలు లేకపోవడంతో వాటిని తిరస్కరించారు. టీఆర్ఎస్ పార్టీ సభ్యులు కే కేశవరావు, కేఆర్ సురేశ్‌రెడ్డిల నామినేషన్ పత్రాలు సరిగా ఉన్నట్టు ప్రకటించారు. దీంతో వీరి ఎన్నిక ఏకగ్రీవం కానున్నది. వీరు రాజ్యసభకు ఎన్నికైనట్టు బుధవారం అధికారికంగా ప్రకటించనున్నారు.

## డబుల్‌గా తెలంగాణ రైల్వే లైన్లు

■ కాజీపేటలో కోచ్ ఫ్యాక్టరీ ఏర్పాటుచేయండి

■ రైల్వే పద్దులపై రాజ్యసభ సభ్యుడు ప్రకాశ్



**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** తెలంగాణలోని సింగిల్ రైల్వే లైన్లను డబుల్‌గా మార్చాలని టీఆర్ఎస్ ఎంపీ బండా ప్రకాశ్ కేంద్రాన్ని కోరారు. సోమవారం రాజ్యసభలో రైల్వే బడ్జెట్ పద్దుపై చర్చ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుతం తెలంగాణలో సికింద్రాబాద్-వరంగల్- కాజీపేట- బల్హార్షాకు డబుల్ లైన్ ఉన్నదని చెప్పారు. మిగిలిన ప్రాంతాలకు డబుల్‌గా మార్చాల్సిన అవసరం ఉన్నదని తెలిపారు. రైల్వే ప్రైవేట్ బాటలోకి వెళ్తుందనే ఆందోళన వ్యక్తంచేశారు.విభజన చట్టంలో పొందుపర్చిన కోచ్‌ఫ్యాక్టరీ హామీని నెరవేర్చలేదన్నారు. కాజీపేట నుంచి కరీంనగర్‌కు వయా ఎల్కతుర్తి, హుజూరాబాద్ మీదుగా రైల్వే లైన్ వేయాలని కోరారు.

### సంస్కృత వర్సిటీ బిల్లుకు మద్దతు: ఎంపీ లక్ష్మీకాంతారావు

సెంట్రల్ సంస్కృత వర్సిటీ బిల్లుకు టీఆర్ఎస్ మద్దతు తెలిపింది. రాజ్యసభలో ప్రవేశపెట్టిన బిల్లుకు ఎంపీ కెప్టెన్ లక్ష్మీకాంతారావు టీఆర్ఎస్ మద్దతు ఉంటుందని ప్రకటించారు. మూడు డీమ్డ్ టూ బీ సంస్కృతం వర్సిటీలను సెంట్రల్ వర్సిటీలుగా అభివృద్ధి చేయడాన్ని హర్షిస్తున్నామని చెప్పారు. డిగ్రీస్థాయిలోనూ సంస్కృతం ఉండాలని, కర్ణాటక రాష్ట్రం షిమోగా జిల్లా మాథూర్‌లో అందరూ సంస్కృతం మాట్లాడుతారని తెలిపారు.



### నిజాం సొమ్మును రాష్ట్రానికి ఇవ్వండి: ఎంపీ రంజిత్‌రెడ్డి



నిజాం ఆస్తులను తెలంగాణ రాష్ట్రానికి బదిలీ చేయాలని ఎంపీ రంజిత్‌రెడ్డి కోరారు. లోక్‌సభలో 377 నిబంధన కింద ఆయన మాట్లాడుతూ.. బ్రిటన్ హైకోర్టులో పాకిస్థాన్‌పై భారత ప్రభుత్వం కేసును గెలిచిందని గుర్తుచేశారు. దీని ద్వారా 35 మిలియన్ పౌండ్లు భారతదేశానికి వచ్చాయన్నారు. ఈ మొత్తాన్ని తెలంగాణకు బదిలీ చేయడం ద్వారా రాష్ట్రంలోని పేదలకు ఉపయోగపడుతుందని చెప్పారు. ఆ మొత్తం తెలంగాణ ప్రజలదే అయినందున బదిలీ చేయాలని విజ్ఞప్తిచేశారు.

# ఏపీ విద్యుత్ ఉద్యోగులు గో బ్యాక్

## నినదించిన తెలంగాణ ఉద్యోగులు

■ ధర్నాలతో దద్దరిల్లిన విద్యుత్‌సౌధ

■ 31 వరకు ఆందోళనలకు పిలుపు

**హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ :** ఏపీ విద్యుత్ సంస్థల నుంచి రిలీవ్ అయిన ఆంధ్రా ఉద్యోగులు తెలంగాణలో చేరేందుకు ప్రయత్నించడంపై స్థానిక విద్యుత్ ఉద్యోగులు భగ్గుమన్నారు. సుమారు 50 మంది రిలీవ్ ఆర్డర్లను తీసుకొని తెలంగాణ విద్యుత్ సంస్థల్లో చేరేందుకు రావడాన్ని వ్యతిరేకిస్తూ పెద్దఎత్తున ఆందోళనకుదిగారు. దీంతో ఖైరతాబాద్‌లోని విద్యుత్‌సౌధ, మింట్ కాంపౌండ్‌లోని టీఎస్ఎస్పీడీసీఎల్ కార్యాలయాల్లో ఉద్రిక్తత నెలకొంది. ధర్మాధికారి ఉత్తర్వులకు విరుద్ధంగా.. ఆప్షన్లు ఇవ్వని 584 మందిని ఏపీ సర్కార్ రిలీవ్‌చేసిన విషయం తెలిసిందే. వారిలో కొంత మంది సోమవారం తెలంగాణ సంస్థల్లో చేరేందుకు వచ్చారు. దీంతోవారిని విద్యుత్ సంస్థల్లో అడుగుపెట్టనియ్యకుండా అడ్డుకున్న తెలంగాణ ఉద్యోగులు.. 'ఆంధ్రా విద్యుత్ సంస్థలు డౌన్ డౌన్', 'ఏపీ ఉద్యోగులు గోబ్యాక్' అంటూ నినాదాలు చేశారు. నల్లబ్యాడ్జీలు ధరించి, విద్యుత్‌సౌధ, టీఎస్ఎస్పీడీసీఎల్ కార్యాలయాల గేట్ల ముందు బైఠాయించారు. దీంతో కొందరు ఏపీ ఉద్యోగులు వెనుదిరిగిపోగా, మరికొంత మంది ఖైరతాబాద్ ఆస్కీ వైపు గుమిగూడటంతో పోలీసులు వారిని ఆదుపులోకి తీసుకొని గోషామహల్ స్టేడియానికి తరలించారు. ఈ నెల 31 వరకు తెలంగాణవ్యాప్తంగా ఉద్యమాలు కొనసాగిస్తామని జేఏసీ నేతలు ప్రకటించారు.



సోమవారం హైదరాబాద్‌లోని విద్యుత్ సౌధ వద్ద ఆందోళన చేస్తున్న తెలంగాణ రాష్ట్ర విద్యుత్ ఉద్యోగులు

## ఏ ఒక్కరినీ చేర్చుకోనివ్వం: టీఎస్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ జేఏసీ

ఏ ఒక్క ఆంధ్రా ఉద్యోగిని విధుల్లో చేర్చుకోనివ్వబోమని టీఎస్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ జేఏసీ నేతలు, తెలంగాణ ఎలక్ట్రిసిటీ ఇంజినీర్స్ అసోసియేషన్ (టీఈఈఏ) అధ్యక్షుడు ఎన్ శివాజీ, విద్యుత్ అకౌంట్స్ ఆఫీసర్స్ అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ (వీఏవోఏటీ) ప్రధాన కార్యదర్శి పీ అంజయ్య స్పష్టంచేశారు. ఇది ఆంధ్రా దురహంకారానికి, పెత్తనానికి నిదర్శనమని మండిపడ్డారు. ఏపీ విద్యుత్ సంస్థలు మొండివాదనలతో ఏకపక్షంగా ఉద్యోగులను రిలీవ్‌చేయడం సమంజసంకాదని అన్నారు. తమ ఉద్యోగాలకు అడ్డొస్తే ఎట్టిపరిస్థితుల్లో సహించబోమని, ఎవరైనా విధుల్లో చేరడానికి వస్తే తీవ్ర పరిణామాలుంటాయని హెచ్చరించారు. జేఏసీ నేతలు రామేశ్వరయ్యశెట్టి, నాజర్‌షరీఫ్, వినోద్, గణేశ్, తుల్జారాంసింగ్, సురేందర్‌రెడ్డి, నర్సింహారెడ్డి, తిరుపతయ్య, పరమేశ్, వీరస్వామి, రవి, అనిల్, తెలంగాణ పవర్ ఎంప్లాయిస్ జేఏసీ నేతలు పీ రత్నాకర్‌రావు, పీ సదానందం తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# తెరిచిన స్కూళ్లపై చర్యలు

మంత్రి కేటీఆర్‌కు ఫిర్యాదులు.. 10 పాఠశాలలకు విద్యాశాఖ నోటీసులు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** కరోనాను నిరోధించడంలో ప్రభుత్వ నిబంధనలను ఉల్లంఘించేవారిపై కఠిన చర్యలు తప్పవని ప్రభుత్వం హెచ్చరించింది. ప్రభుత్వ సూచనలను తోసిరాజని పాఠశాలలు నడుపుతుండటాన్ని తీవ్రంగా పరిగణించిన పాఠశాల విద్యాశాఖ అధికారులు.. హైదరాబాద్‌లోని 10 స్కూళ్లకు నోటీసులు జారీచేశారు. ఈ నెల 31 వరకు విద్యాసంస్థలను మూసివేయాలన్న ప్రభుత్వ నిర్ణయాన్ని తప్పనిసరిగా అమలుచేయాలని స్పష్టంచేశారు. గురువారం నుంచి టెన్త్ పరీక్షలు యథావిధిగా జరుగుతాయని ప్రకటించారు. ఇప్పటికీ పలు పాఠశాలలు యథేచ్ఛగా నడుస్తున్నాయని మంత్రి కేటీఆర్‌కు ఫిర్యాదులు అందడంతో తగు చర్యలు తీసుకోవాలని విద్యాశాఖ మంత్రి సబితాఇంద్రారెడ్డికి సూచించారు. జిల్లాలవారీగా విద్యాధికారులు స్కూళ్లను తనిఖీచేశారు. పదో తరగతి పరీక్షలు పూర్తయ్యేంత వరకు టీచర్లు, సిబ్బంది విధులకు హాజరుకావాలని ఆదేశించారు. ఆసిఫాబాద్‌లోని శ్రీనిధి ఎడ్యుకేషన్ కళాశాలలో తరగతులు జరుగుతుండటాన్ని గుర్తించిన విద్యార్థి సంఘం నాయకులు.. యాజమాన్యంతో చర్చించి విద్యార్థులను ఇండ్లకు పంపించివేశారు.

## ఉన్న ఊరును, కన్నతల్లిని మరువనోళ్లే గొప్పోళ్లు

మొదటిపేజీ తరువాయి...

కామిడి నర్సింహారెడ్డిని శాలువా కప్పి ఘనంగా సత్కరించిన మంత్రి కేటీఆర్.. ఆయన దాతృత్వాన్ని ప్రత్యేకంగా కొనియాడారు. ఉన్న ఊరును, కన్న తల్లిని మరవని వాళ్లే నిజమైన మనుషులని చెప్పారు. నర్సింహారెడ్డి లాగానే ఎన్నారైలు, ఇతర శ్రీమంతులు తమ గ్రామాల అభివృద్ధికి సహకరించాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు మాట్లాడుతూ.. నర్సింహారెడ్డి ఔదార్యం ప్రపంచానికే ఆదర్శమని అన్నారు. పల్లె ప్రగతి కార్యక్రమం గ్రామాల అభివృద్ధికి ఎంతో తోడ్పడుతున్నదని, ఈ ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందని చెప్పారు. వ్యాపారరీత్యా హైదరాబాద్‌లో స్థిరపడిన కామిడి నర్సింహారెడ్డి సీఎం కేసీఆర్ చేపట్టిన పల్లెప్రగతి కార్యక్రమానికి ఆకర్షితులై దమ్మన్నపేట గ్రామానికి రూ.25 కోట్ల విరాళాన్ని ప్రకటించారు. తానివ్వబోయే మిగిలిన నిధులతో చేపట్టాల్సిన పనులకు సంబంధించిన ప్రణాళికను కేఎన్ఆర్ స్థానిక ఎమ్మెల్యే ఆరూరి రమేశ్, అధికారుల సలహా మేరకు రూపొందించారు. ఇప్పటికే గ్రామంలో కొన్ని అభివృద్ధి పనులు చేపట్టగా, త్వరలోనే మరిన్ని ప్రారంభించేందుకు కేఎన్ఆర్ సంస్థ ప్రతినిధులు ఏర్పాట్లుచేస్తున్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు ఆరూరి రమేశ్, జీవన్‌రెడ్డి పాల్గొన్నారు.

## నిదురపోవా తల్లీ!

మొదటిపేజీ తరువాయి...

కునుకుతీయడంలేదు. పురుషులతో పోలిస్తే మహిళలు 71 శాతం మంది తక్కువగా నిద్రపోతున్నారు.

### కొరవడిన లింగ సమానత్వం

హైదరాబాద్, బెంగళూరు, చెన్నై, ఢిల్లీ, కోల్‌కతా, ముంబై నగరాల్లో 1,175 మందిపై నిర్వహించిన సర్వేలో ఈ విషయం వెల్లడైంది. వంటచేయటంతోపాటు ఇంటిపనులతో మహిళలకు తీరిక ఉండటంలేదని, బట్టలు ఉతుకడంతోనే మహిళల కాలమంతా గడిచిపోతున్నదని మహిళలు వాపోయారు. సమాజంలో లింగ సమానత్వం కొరవడటమే కారణమని సర్వేలో తేలింది. 'షేర్ ది లోడ్' పేరుతో నిర్వహించిన ప్యానల్‌చర్చలో ప్రముఖ డిటర్జెంట్ తయారీదారు 'ఏరియల్' ఈ వివరాలను మీడియాకు విడుదలచేసింది. సినీ నిర్మాత తాహిరా కశ్యప్ ఖురానా, డాక్టర్ నందితాషా, జోసిపాల్, శరత్‌వర్మ తదితరులు చర్చలో పాల్గొన్నారు. భర్తలు బాధ్యత పంచుకొని భార్యలకు సహరించాలని పిలుపునిచ్చారు.

### బట్టలు ఉతుకడమే మహిళల పని?


భర్త కంటే తక్కువగా నిద్రిస్తున్నామని 71 శాతం మంది, రోజంతా పనిచేసి అలసిపోతున్నామని ప్రతి పదిమందిలో ఆరుగురు తెలిపారు. పగటిపూట నిద్రించేందుకు కాస్త సమయం అవసరమని సర్వేలో సగం మంది అభిప్రాయపడ్డారు. పిల్లలను బడికి పంపాక ఇంట్లో ఎదురయ్యే పనులే భారమవుతున్నాయని చాలామంది మహిళలు చెప్పారు. బట్టలు ఉతుకడాన్ని మహిళల పనిగా 79 శాతం మంది పురుషులు భావిస్తున్నారు. కేవలం 35 శాతం మంది భర్తలే ఇంటిపనుల్లో భార్యలకు సహకరిస్తున్నారు.

# స్వీయ క్రమశిక్షణే రక్ష



**న్యూఢిల్లీ:** ప్రపంచాన్ని కరోనా గడగడలాడిస్తున్నది. కేవలం ఆరు కోట్ల మంది జనాభా గల ఇటలీలో ఒక్కరోజులో 368 మంది మృతితో విపత్తుగా మారింది. అదే పరిస్థితి భారత్‌లో తలెత్తితే తీవ్ర పరిణామాలు ఎదురవుతాయి. ప్రస్తుతానికి మనదేశంలో పరిస్థితులు అలా మారకున్నా.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేపట్టిన చర్యలకు తోడు పౌరులుగా మనకు దానికి అడ్డుకట్ట వేసేందుకు మనపై గురుతర బాధ్యతలు ఉన్నాయి. అవేమిటో ఒకసారి చూద్దాం.

- ప్రభుత్వ ఆదేశాలు, హెచ్చరికలను పాటిద్దాం.. ప్రత్యేకించి స్వీయ క్రమశిక్షణ పాటిద్దాం. సభలకు,కర చాలనానికి దూరంగా ఉంటూ స్వీయ అప్రమత్తత పాటిద్దాం.
- అన్నింటికన్నా ముందు ఆందోళనకు గురి కాకుండా ఉందాం. ముందు జాగ్రత్త చర్యలతో తీవ్రతను తగ్గిద్దాం.
- పౌరులుగా తప్పనిసరిగా బాధ్యతాయుతంగా వ్యవహరిస్తూ వైరస్ వ్యాప్తి చెందకుండా నివారిద్దాం.
- ఏ పని లేకపోతే ఇంటికి పరిమితమై ఉందాం.
- పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇద్దాం. కనీసం 20 సెకన్ల పాటు చేతులను శుభ్రం చేసుకుందాం. ముఖాన్ని తాకడం నిలిపేద్దాం.
- దేశంలోని ఇతర ప్రజల భద్రత కోసమే కరోనా పాజిటివ్ రోగులను క్వారంటైన్ సెంటర్లకు తరలిస్తున్న నేపథ్యంలో వైద్య పరీక్షల్లో పాజిటివ్ అని తేలిన వారి విదేశీ ప్రయాణ వివరాలను దాచిపెట్టకుండా చూద్దాం.
- సోషల్ మీడియాలో తరుచుగా వస్తున్న వదంతులకు దూరంగా ఉంటూ.. వాస్తవాల ప్రాతిపదికన ముందు జాగ్రత్త చర్యలు తీసుకుందాం.





కరోనా భయంతో అమెరికన్లు తుపాకులు కొంటున్నారు. వినడానికి విచిత్రంగా ఉన్నా ఇది నిజం.. వైరస్ ఉద్ధృతి మరింత పెరిగితే నిత్యావసరాల కొరత ఏర్పడి లూటీలు, దాడులు జరుగుతాయని అనుమానిస్తున్నారు. ఈ నేపథ్యంలో తుపాకీల కోసం షాపుల ముందు ఇలా బారులు తీరుతున్నారు.

## 80 ఏండ్లు దాటితే నో ట్రీట్మెంట్!

**రోమ్:** ఇటలీలో కరోనా సోకిన 80 ఏండ్లు పైబడిన వృద్ధులకు చికిత్స చేయకుండా వదిలేస్తారంటూ ప్రముఖ పత్రిక 'ది టెలిగ్రాఫ్' సంచలన కథనం ప్రచురించింది. కరోనా విలయతాండవం చేస్తున్న దేశాల్లో చైనా తర్వాతి స్థానం ఇటలీదే. దేశంలో ఆది, సోమవారాల్లో సగటున 300కుపైగా మృతిచెందారు. మరో 25వేల మందికి ఈ వైరస్ సోకింది. బాధితులే పెరగటంతో వైద్య సేవల కొరత ఎదురవుతున్నది. కొత్త కేసులు చేర్చుకోవడం తలకుమించిన భారమవుతున్నది. దీంతో టురిన్ నగర అధికారులు ఓ ప్రోటోకాల్ సిద్ధంచేసినట్టు టెలిగ్రాఫ్ తెలిపింది. దీని ప్రకారం 80 ఏండ్లు అంతకంటే ఎక్కువ వయస్సున్న వృద్ధులకు, దీర్ఘకాల వ్యాధులతో బాధపడేవారికి 'కరోనా' చికిత్స నిలిపివేస్తారు. ఈ విధానాన్ని ఇంకా అమలు చేయలేదని, పరిస్థితి చేయిదాటిపోయే పరిస్థితుల్లో అమలు చేయొచ్చని ఆ పత్రిక పేర్కొన్నది.



## మాకే దక్కాలి



- కరోనా వ్యాక్సిన్ కోసం ట్రంప్ కుట్ర?

**బెర్లిన్/వాషింగ్టన్:** కరోనా నుంచి కాపాడే వ్యాక్సిన్‌ను దక్కించుకుని దాని బారి నుంచి ప్రపంచాన్ని కాపాడాననే పేరుకోసం అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రయత్నించారా? ఇది నిజమేనని పేర్కొంటూ జర్మనీ పత్రిక 'వెల్ట్ ఆమ్ సోన్‌టాగ్' అనే పత్రిక ఇటీవల ప్రచురించిన ఓ వార్తా కథనం కలకలం రేపింది. వ్యాక్సిన్ అభివృద్ధి చేస్తున్న 'క్యూర్‌వాక్' అనే జర్మనీ సంస్థకు పెద్దమొత్తంలో చెల్లిస్తానని ట్రంప్ హామీ ఇచ్చారన్నది. ఈ సంగతి తెలుసుకున్న జర్మనీ సర్కార్ 'క్యూర్‌వ్యాక్'కి అమెరికా కంటే గొప్ప ఆఫర్ ఇచ్చినట్టు సమాచారం. ఈ క్రమంలో జర్మనీపై అమెరికా ఎదురుదాడికి దిగింది. వ్యాక్సిన్ అభివృద్ధి చేస్తున్న పలు సంస్థలతో చర్చిస్తున్నామని, కొన్ని కంపెనీల్లో తమ మదుపర్లు పెట్టుబడులూ పెట్టారని అమెరికా అధికారి ఒకరు పేర్కొన్నారు. కరోనాకు వ్యాక్సిన్ దొరికితే ఆ ఫార్ములాను ప్రపంచ దేశాలకు ఇస్తామన్నారు. కాగా, తమకు ఎవరూ ఆఫర్ ఇవ్వలేదని 'క్యూర్‌వ్యాక్' పేర్కొంది.

## మనిషిపై తొలి కరోనా వ్యాక్సిన్ టెస్ట్

***వాషింగ్టన్:*** *ప్రాణాంతక కరోనాను అదుపు చేయడంలో భాగంగా అభివృద్ధి చేసిన వ్యాక్సిన్‌ను ఔషధ పరీక్షల నిమిత్తం ఓ వ్యక్తిపై ప్రయోగించినట్టు అమెరికా సోమవారం ప్రకటించింది. ఈ పరీక్షల కోసం 18 నుంచి 55 సంవత్సరాల మధ్య వయసున్న 45 మంది ఆరోగ్యవంతులైన వలంటీర్లు తమ పేర్లను నమోదు చేసుకున్నారని, వీరిలో ఓ వలంటీర్‌కి వ్యాక్సిన్‌ను ఇచ్చామని పేర్కొంది.*

## హెచ్‌ఐవీ మందులతో కరోనా నియంత్రణ!

- రాజస్థాన్ వైద్యారోగ్యశాఖ అదనపు ముఖ్య కార్యదర్శి వెల్లడి



**జైపూర్:** కరోనా వైరస్ కట్టడికి వివిధ దేశాల శాస్త్రవేత్తలు నిర్విరామ కృషి చేస్తున్నారు. కాగా, 2 రకాల హెచ్‌ఐవీ నియంత్రణ డ్రగ్స్‌తో కరోనాను కట్టడి చేయవచ్చని రాజస్థాన్ వైద్య ఆరోగ్యశాఖ అదనపు ముఖ్య కార్యదర్శి రోహిత్ కుమార్ సింగ్ చెప్పారు. తమ రాష్ట్రంలో నలుగురు పాజిటివ్ రోగులకు హెచ్‌ఐవీ నియంత్రణ మందులు వాడటంతో కరోనా తగ్గుముఖం పట్టిందని, వారిలో ముగ్గురిని డిశ్చార్జ్ చేసినట్టు తెలిపారు. తొలుత పాజిటివ్ కేసులు నమోదైన వారిలో ఇద్దరు ఇటలీ నుంచి వచ్చినవారేనన్నారు. ఈ విషయాన్ని కరోనా రోగులకు చికిత్స అందించిన ఎస్‌ఎంఎస్ దవాఖాన సూపరింటెండెంట్ డాక్టర్ డీఎస్ మీనా ధ్రువీకరించారు.

## జాగ్రత్తలతో ఎదుర్కొందాం: మోదీ



**న్యూ ఢిల్లీ:** కరోనా మహమ్మారిపై ప్రజలు ఆందోళన చెందవద్దని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ విజ్ఞప్తిచేశారు. కరోనాపై వదంతులను ప్రజలు నమ్మొద్దని సూచించారు. ఈ మేరకు తన ఇన్‌స్టాగ్రామ్‌లో ఏడు నిమిషాల ఓ వీడియో సందేశాన్ని పోస్ట్ చేశారు. మరోవైపు కరోనా వ్యాప్తిని అరికట్టేందుకు భారత్ చేపడుతున్న చర్యలను మోదీ ట్విటర్ వేదికగా వెల్లడించారు.'కరోనాపై భారత్ పోరు (India Fights Corona)' అనే హ్యాష్‌ట్యాగ్‌తో పలువురి కరోనా బాధితుల కథనాలను పోస్ట్ చేసిన ఆయన.. వైరస్‌ను నియంత్రించేందుకు ఆరోగ్య సంస్థలు, వైద్యులు చేస్తున్న కృషిని కొనియాడారు.

# అష్ట దిగ్బంధం!



### కరోనా కట్టడికి కేంద్రం కఠిన చర్యలు

- భూ, జల, వాయు మార్గాలు మూసివేత
- పలు రాష్ట్రాల్లో ప్రజల కదలికలపై ఆంక్షలు
- నిషేధిత జాబితాలో ఈయూ, టర్కీ, బ్రిటన్
- ఆయా దేశాల్లోని భారతీయులకూ నో ఎంట్రీ
- దేశంలో 114కు పెరిగిన బాధితులు



కరోనా వ్యాప్తి నేపథ్యంలో అహ్మదాబాద్‌లో ప్రయాణికులకు మాస్కులు పంపిణీ చేస్తున్న ఓ స్వచ్ఛంద సంస్థ కార్యకర్తలు

**న్యూఢిల్లీ/వాషింగ్టన్/మాడ్రిడ్/పారిస్, మార్చి 16:** కరోనా విజృంభణ నేపథ్యంలో భారత్ దిగ్బంధం దిశగా సాగుతున్నది. ప్రపంచదేశాలను గడగడలాడిస్తున్న వైరస్ భారత్‌లో విస్తరించకుండా కేంద్రం కఠిన చర్యలు తీసుకుంటున్నది. భూ, జల, వాయు మార్గాలను దాదాపు మూసివేసింది. ఇప్పటికే అంతర్జాతీయ సరిహద్దుల్లో అత్యధిక శాతం మూసివేసింది. విదేశీ నౌకలన్నింటినీ తీరప్రాంతాల్లో నిలిపివేస్తూ జలమార్గాలపై ఆంక్షలు విధించింది. వాయుమార్గంలో ముప్పును ఎదుర్కొనేందుకు ఇప్పటికే వీసాలన్నింటినీ రద్దు చేసింది. విదేశీయుల రాకపై కఠిన ఆంక్షలు విధించింది. తాజాగా.. కరోనా ప్రభావిత దేశాల నుంచి భారతీయుల రాకపైనా నిషేధాన్ని విధించింది. మరోవైపు దేశంలోని దాదాపు అన్ని రాష్ట్రాల్లో విద్యాసంస్థలు, సినిమా హాళ్లు, షాపింగ్ మాల్స్, జిమ్‌లు, స్విమ్మింగ్ పూల్స్, ఇతరత్రా జన సమ్మర్ధ ప్రదేశాలను మూసివేశారు.

**31 వరకు అనుమతించం**

ఇప్పటికే పలు దేశాల ప్రయాణికులపై నిషేధం విధించిన కేంద్రం.. సోమవారం ఈయూ, బ్రిటన్, టర్కీ దేశాలను చేర్చింది. ఆయా దేశాల నుంచి వచ్చే భారతీయులకూ ఎలాంటి మినహాయింపు లేదని ప్రభుత్వం తెలిపింది. ఆ దేశాల నుంచి ఒక్క విమానాన్నీ భారత్‌లోకి అనుమతించబోమని స్పష్టం చేసింది. ఇది ఈ నెల 31 వరకు అమల్లో ఉంటుందని చెప్పింది. దీంతో బ్రిటన్, టర్కీ, ఐరోపా దేశాలకు చెందిన పౌర విమానయాన సంస్థలు ఈ నెలాఖరు వరకు తమ సర్వీసులను భారత్‌కు నిలిపివేయనున్నాయి.

**చాపకింద నీరులా..**

భారత్‌లో కరోనా మహమ్మారి చాపకిందనీరులా విస్తరిస్తున్నది. ఒడిశాలో సోమవారం తొలి కరోనా కేసు నమోదు కాగా, లడఖ్, జమ్ముకశ్మీర్, కేరళలో ఒక్కో కేసు చొప్పున నమోదైంది. దీంతో కరోనా బాధితుల సంఖ్య సోమవారంనాటికి 114కు చేరిందని కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ పేర్కొంది. వీరిలో ఇద్దరు మృతి చెందగా, 13 మంది ఇప్పటికే డిశ్చార్జి అయ్యారని తెలిపింది. వైరస్ సోకిన వాళ్లలో 17 మంది విదేశీయులు ఉన్నారని వెల్లడించింది. మహారాష్ట్రలో వైరస్ బాధితుల సంఖ్య వేగంగా పెరుగుతున్నది. సోమవారం మరో నలుగురిలో వైరస్ లక్షణాల్ని గుర్తించామని మహారాష్ట్ర అధికారులు ప్రకటించారు. దీంతో ఆ రాష్ట్రంలో వైరస్ సోకిన వారి సంఖ్య 37కు చేరింది. కేరళలో మూడు, కర్ణాటకలో మరో కేసు నమోదైంది. అయితే వీటిని కేంద్రం ధ్రువీకరించాల్సి ఉన్నది.

**గుమిగూడొద్దు: కేజ్రీవాల్**

కరోనా వ్యాప్తి నేపథ్యంలో ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ కీలక ఆదేశాలు జారీ చేశారు. 50మందికి మించి హాజరయ్యే ఎలాంటి కార్యక్రమాలను మార్చి 31 వరకు రాజధానిలో అనుమతించబోమని ప్రకటించారు. మరోవైపు, ఇరాన్‌లో చిక్కుకున్న మరో 53 మంది భారతీయులతో కూడిన నాలుగో బృందాన్ని ఎయిరిండియా విమానం సోమవారం ఢిల్లీకి తీసుకొచ్చింది. కొవిడ్ నేపథ్యంలో జవహర్ నవోదయ విద్యాలయాల్లో ముందస్తు వేసవి సెలవుల్ని ప్రకటించారు. మార్చి 21 నుంచి మే 25 వరకు ఈ సెలవులు కొనసాగనున్నట్టు అధికారులు పేర్కొన్నారు.

**ఆహార కొరత లేదు**

కరోనా వల్ల రానున్న రోజుల్లో దేశంలో నిత్యవసర వస్తువులు, ఆహార పదార్థాలు దొరకవన్న వదంతుల నేపథ్యంలో అమెరికన్ ప్రజలు సూపర్ మార్కెట్లు, ఫుడ్ కోర్టుల ముందు బారులు తీరారు. దీనిపై అధ్యక్షుడు ట్రంప్ స్పందిస్తూ.. దేశంలో ఆహారం, నిత్యవసర వస్తువుల కొరత లేదన్నారు.

- స్పెయిన్‌లో గత 24 గంటల్లో 1,200 మందికి వైరస్ సోకినట్టు నిర్ధారణ అయింది. దీంతో ఆ దేశంలో మొత్తం కేసులు 9,100 దాటాయి.
- వైరస్ వ్యాప్తి చెందుతున్న నేపథ్యంలో వెనిజులాలోని ఏడు రాష్ట్రాల్ని సామూహికంగా దిగ్బంధం చేస్తూ అధికారులు నిర్ణయం తీసుకున్నారు.
- అమెరికాలోని న్యూయార్క్ నగరంలో ఏప్రిల్ 20 వరకు అన్ని పబ్లిక్ స్కూళ్లను మూసివేశారు.
- తమ దేశంలో కరోనా వేగంగా విస్తరిస్తున్నదని, ప్రతి మూడు రోజులకు బాధితుల సంఖ్య రెట్టింపు అవుతున్నదని ఫ్రాన్స్ ఆందోళన వ్యక్తం చేసింది.
- కరోనా వెలుగుచూసిన వుహాన్ నగరంలో వైరస్ తీవ్రత తగ్గిపోవడంతో అక్కడున్న వైద్య సిబ్బందిని చైనా దశలవారీగా వెనక్కి పిలిపిస్తున్నది.

### ఇటలీలో ఒక్కరోజే 349 మంది మృతి

అంతర్జాతీయంగా కరోనా తన పంజా చూపిస్తున్నది. ముఖ్యంగా ఇటలీలో కరాళనృత్యం చేస్తూ ప్రపంచ దేశాలను హడలెత్తిస్తున్నది. ఇటలీలో ఆదివారం మూడు వందలమందికి పైగా మరణించగా.. సోమవారం కూడా 349 మంది ప్రాణాలు విడిచారు. దీంతో ఇటలీలో మృతుల సంఖ్య రెండు వేలకు పెరిగింది. ఇరాన్‌లోనూ కరోనా పంజా విసురుతున్నది. వైరస్ ధాటికి ఆ దేశంలో మృతుల సంఖ్య 853కు చేరింది. ఇక ప్రపంచవ్యాప్తంగా ఇప్పటివరకూ ఈ మహమ్మారి వల్ల 7,007 మంది మరణించగా, మరో 1,75,536మందికి వైరస్ సోకింది.

### కరోనా తీవ్రత అధికంగా ఉన్న దేశాలు

| దేశం | కేసులు | మరణాలు |
|---|---|---|
| చైనా | 80,880 | 3,213 |
| ఇటలీ | 27,980 | 2,158 |
| ఇరాన్ | 14,991 | 853 |
| స్పెయిన్ | 9,428 | 335 |
| ఫ్రాన్స్ | 5,423 | 127 |
| దక్షిణ కొరియా | 8,236 | 75 |
| అమెరికా | 4,165 | 72 |
| బ్రిటన్ | 1,543 | 36 |
| జపాన్ | 895 | 27 |
| నెదర్లాండ్స్ | 1,413 | 24 |

### ఫ్రీగా 17వేల శానిటైజర్ల పంపిణీ

***న్యూయార్క్:*** *కరోనా మహమ్మారి భయపెడుతున్న వేళ అమెరికాలోని టెన్నిస్సీ రాష్ట్ర పరిధిలోని ఈ-రిటైలర్ సంస్థ అమెజాన్ విక్రేత మాట్ కొల్విన్ 17,700 హ్యాండ్ శానిటైజర్ల బాటిళ్లను ఉచితంగా ప్రజలకు పంపిణీ చేశారు. ధరల దోపిడీని అరికట్టేందుకు కొల్విన్‌పై టెన్నిస్సీ అటార్నీ జనరల్ దర్యాప్తు ప్రారంభించడానికి ముందే ఈ బాటిళ్లను ఉచితంగా పంపిణీ చేయడం గమనార్హం. చట్టానుగా టెన్ పరిధిలో వలంటీర్ల సాయంతో ఆదివారం ప్రజలకు హ్యాండ్ శానిటైజర్లు పంపిణీ చేశారు.*

### జైళ్లలో ఖైదీల పరిస్థితేంటి?

**న్యూఢిల్లీ:** కరోనా వ్యాపించకుండా ప్రజలు గుమిగూడవద్దని కేంద్రం ప్రజలకు సూచనలు చేయడం తెలిసిందే. ఈ క్రమంలో ఖైదీలు గుంపుగా ఉండే జైళ్లు, జువైనల్ హోంలలో కరోనా వ్యాపించకుండా ఎలాంటి ముందస్తు జాగ్రత్తలు తీసుకున్నారని డైరెక్టర్ జనరల్(జైళ్లు), వివిధ రాష్ట్రాల ప్రధాన కార్యదర్శిలను సుప్రీంకోర్టు సోమవారం ప్రశ్నించింది. దీనిపై మార్చి 20లోపు ఆయా ప్రభుత్వాలు తమ స్పందన తెలియజేయాలని ఆదేశించింది. వైరస్ ఉద్ధృతి పెరుగుతున్న నేపథ్యంలో సుప్రీంకోర్టులోని న్యాయవాదులు, పిటిషనర్లు, ఇతరులకు కోర్టు ఆవరణలోనే థర్మల్ స్క్రీనింగ్ పరీక్షల్ని నిర్వహిస్తున్నారు.

### 31 వరకు జేఎన్‌యూ మూత

**న్యూఢిల్లీ:** దేశ రాజధాని ఢిల్లీలోని జవహర్ లాల్ నెహ్రూ యూనివర్సిటీ (జేఎన్‌యూ) క్యాంపస్‌ను ఈ నెల 31 వరకు మూసివేస్తున్నట్లు రిజిస్ట్రార్ డాక్టర్ ప్రమోద్ కుమార్ తెలిపారు. కోవిడ్-19 వల్ల క్యాంపస్‌ను మూసివేస్తున్నట్లు సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ కాలంలో విద్యార్థులకు ఎలాంటి సౌకర్యాలు ఉండవని స్పష్టం చేశారు. అలాగే లైబ్రరీ, వ్యాయామం, యోగా కేంద్రం, క్యాంటీన్, క్యాటరీలు పని చేయవన్నారు. క్యాంపస్‌లో సభలు, సమావేశాలు, వర్క్‌షాప్‌లు నిర్వహించొద్దన్నారు.



## రాజ్యసభకు మాజీ సీజేఐ గొగోయ్

- నామినేట్ చేసిన కేంద్రం

**న్యూఢిల్లీ:** సుప్రీంకోర్టు మాజీ చీఫ్ జస్టిస్ రంజన్ గొగోయ్‌ని కేంద్రం రాజ్యసభకు నామినేట్ చేసింది. ఈ మేరకు కేంద్ర హోంశాఖ సోమవారం నోటిఫికేషన్ జారీ చేసింది. రాజ్యాంగంలోని 80 అధికరణం ప్రకారం గొగోయ్‌ని రాజ్యసభకు నామినేట్ చేయాలని రాష్ట్రపతి నిర్ణయించారు. 'నామినేటెడ్ సభ్యుల్లో ఒకరైన కేటీఎస్ తులసీ రిటైర్ కావడంతో ఏర్పడిన ఖాళీని భర్తీ చేసేందుకు ఈ నిర్ణయం తీసుకున్నాం' అని తెలిపింది. గతేడాది నవంబర్ చివరిలో జస్టిస్ గొగోయ్ రిటైరయ్యారు. ఆయన సారథ్యంలోని రాజ్యాంగ ధర్మాసనం అయోధ్య భూ వివాదం, శబరిమల, రాఫెల్ యుద్ధ విమానాల ఒప్పందంపై దాఖలైన పిటిషన్లపై తీర్పులు ఇచ్చింది.

## 31 వరకే గడువు

- ఆధార్‌తో పాన్ లింక్ తప్పనిసరి

**న్యూఢిల్లీ:** ఆధార్‌తో పర్మినెంట్ అకౌంట్ నంబర్ (పాన్) అనుసంధానం తప్పనిసరని, ఇందుకు నిర్దేశించిన గడువు (ఈ నెల 31)ను మిస్‌కావద్దని ఆదాయం పన్ను (ఐటీ) శాఖ తెలిపింది. 'మార్చి 31లోగా ఆధార్‌తో పాన్ అనుసంధానం తప్పనిసరి. ఈ గడువు మిస్‌కావద్దు. ఆధార్ అథెంటికేషన్ ద్వారా/పాన్ సర్వీస్ సెంటర్లైన ఎన్‌ఎస్డీఎల్, యూటీఐటీఎస్‌ఎల్‌ను సందర్శించి అనుసంధానించవచ్చు. దీనివల్ల భవిష్యత్తులో లబ్ది చేకూరుతుంది' అని తాజాగా సోషల్ మీడియాలో పోస్టుచేసిన వీడియోలో ఐటీ శాఖ తెలిపింది.

# కమల్ 'కరోనా'స్త్రం

- మధ్యప్రదేశ్ సంక్షోభంలో అనూహ్య మలుపు
- సోమవారం జరుగని విశ్వాస పరీక్ష
- 'కరోనా' సాకుతో సభ 26వరకు వాయిదా
- నేడు బల పరీక్ష జరుపాలని గవర్నర్ అల్టిమేటం
- అవిశ్వాసం ప్రవేశపెట్టాలని కమల్‌నాథ్ సవాల్



గవర్నర్ లాల్జీ టాండన్‌తో కలిసి అసెంబ్లీకి వస్తున్న ముఖ్యమంత్రి కమల్‌నాథ్

**భోపాల్, మార్చి 16:** మధ్యప్రదేశ్ రాజకీయం అనూహ్య మలుపులు తిరుగుతున్నది. కమల్‌నాథ్ సర్కార్‌ను 'కరోనా వైరస్' గట్టెక్కించింది. విశ్వాస పరీక్ష జరుపకుండానే స్పీకర్ ఎన్‌పీ ప్రజాపతి సభను ఈ నెల 26 వరకు వాయిదా వేశారు. అయితే సీఎం కమల్‌నాథ్ మంగళవారం బలాన్ని నిరూపించుకోవాలని గవర్నర్ తాజా అల్టిమేటం జారీ చేశారు.

**గవర్నర్ ప్రసంగం రెండు నిమిషాలే..**

సోమవారం బడ్జెట్ సమావేశాలు ప్రారంభమైన వెంటనే గవర్నర్ లాల్జీ టాండన్.. సభను ఉద్దేశించి ప్రసంగించారు. రాష్ట్రంలో నెలకొన్న ప్రస్తుత పరిస్థితుల నేపథ్యంలో సభ్యులు రాజ్యాంగ సంప్రదాయాలను పాటించాలని, ప్రజాస్వామ్య మర్యాదలను కాపాడాలని కోరారు. కేవలం రెండు నిమిషాల్లోనే ఆయన ప్రసంగం ముగించి సభ నుంచి వెళ్లిపోయారు. గవర్నర్ ప్రసంగం తర్వాత మంత్రి గోవింద్ సింగ్ మాట్లాడుతూ..కరోనా విజృంభణపై ఆందోళన వ్యక్తం చేశారు. రాజస్థాన్, కేరళ, ఒడిశా, ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్రలో అసెంబ్లీ సమావేశాలు వాయిదా పడ్డాయని గుర్తుచేశారు. మరోవైపు, గవర్నర్ ఆదేశాల మేరకు వెంటనే బలపరీక్ష నిర్వహించాలని బీజేపీ చీఫ్ విప్ మిశ్రా డిమాండ్‌చేశారు. ప్రభుత్వ వాదనను పరిగణనలోకి తీసుకున్న స్పీకర్.. సభను ఈ నెల 26 వరకువాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు.

**రాజ్‌భవన్‌కు మారిన సీన్**

సభ వాయిదా వేయగానే మాజీ సీఎం శివరాజ్ సింగ్ చౌహాన్ నేతృత్వంలో 106 మంది బీజేపీ ఎమ్మెల్యేలు గవర్నర్ నివాసానికి చేరుకున్నారు. తక్షణమే బలపరీక్ష నిర్వహించాలని డిమాండ్‌చేశారు. ఈ నేపథ్యంలో సీఎం కమల్‌నాథ్ మంగళవారం సభలో తన బలాన్ని నిరూపించుకోవాలని గవర్నర్ మరోసారి ఆదేశించారు. లేనిపక్షంలో ప్రభుత్వం మైనార్టీలో పడినట్లు భావించాల్సి వస్తుందని స్పష్టం చేశారు. మరోవైపు, సీఎం కమల్‌నాథ్ సోమవారం సాయంత్రం గవర్నర్ లాల్జీ టాండన్‌తో సమావేశమయ్యారు. తర్వాత సీఎం మాట్లాడుతూ.. తన ప్రభుత్వానికి మెజారిటీ ఉన్నదని, విశ్వాస పరీక్ష నిర్వహించాల్సిన అవసరం లేదన్నారు. బీజేపీకి దమ్ముంటే తమ ప్రభుత్వంపై అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టాలని సవాల్ చేశారు. తాము బలాన్ని నిరూపించుకుంటామని ధీమా వ్యక్తంచేశారు.అంతకు ముందు కమల్‌నాథ్ గవర్నర్‌కు లేఖ రాశారు. కర్ణాటక పోలీసుల సాయంతో బీజేపీ పలువురు కాంగ్రెస్ ఎమ్మెల్యేలను బంధించిందని చెప్పారు. సభా వ్యవహారాలు స్పీకర్ పరిధిలోకి వస్తాయని, స్పీకర్ విధుల్లో జోక్యం చేసుకోవడం సరికాదన్నారు. ఆర్టికల్ 175(2) ప్రకారం.. గవర్నర్ అధికారాలను వివరిస్తూ సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును ప్రస్తావించారు.

**సుప్రీంకోర్టును ఆశ్రయించిన బీజేపీ**

తక్షణమే బలపరీక్ష నిర్వహించేలా ఆదేశాలు జారీచేయాలని బీజేపీ సీనియర్ నేత, మాజీ సీఎం శివరాజ్ సింగ్ చౌహాన్ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై కోర్టు మంగళవారం విచారణ జరుపనుంది.

## గవర్నర్ వర్సెస్ స్పీకర్

**న్యూఢిల్లీ:** మధ్యప్రదేశ్‌లో రాజకీయ పరిణామాలు ఉత్కంఠను రేకెత్తిస్తున్నాయి. గతేడాది మహారాష్ట్ర, కర్ణాటకల్లో జరిగిన నాటకీయ పరిణామాలను గుర్తుకు తెస్తున్నాయి. ఈ క్రమంలో గవర్నర్, స్పీకర్ అధికారాలపై మరోసారి చర్చ మొదలైంది. బలపరీక్ష నిర్వహణపై ఎవరిది తుది నిర్ణయం అని ప్రశ్నించగా రాజ్యాంగ నిపుణుడు, లోక్‌సభ మాజీ సెక్రటరీ జనరల్ సుభాశ్ కశ్యప్ స్పందించారు. 'దీనిపై రాజ్యాంగంలో ఎవరికీ స్పష్టమైన అధికారం లేదు. ఆర్టికల్ 175 (2) ప్రకారం గవర్నర్ బల పరీక్ష నిర్వహణకు అసెంబ్లీని కోరొచ్చు. దీనిపై ఏమి చేయాలన్నది అసెంబ్లీదే నిర్ణయం. స్పీకర్.. సభకు ప్రతినిధి మాత్రమే. అంతిమంగా సభదే తుది నిర్ణయం' అని అన్నారు. దీనిపై సుప్రీంకోర్టు 2016లో చెప్పిన తీర్పు ప్రస్తావనార్హం. స్పీకర్ విధుల్లో జోక్యం కుదరదని, స్పీకర్‌కు గవర్నర్ గైడ్ కాదని అరుణాచల్ రాజకీయ సంక్షోభంపై విచారణ సందర్భంగా కోర్టు తీర్పునిచ్చింది.

## ప్రియురాలిని చంపి.. కారులో తిప్పి!

- యూఏఈలో భారతీయుడి ఘాతుకం


**దుబాయి:** అనుమానం పెనుభూతమై.. ఐదేండ్లుగా ప్రేమించిన ప్రియురాలి ప్రాణాలు తీసింది. వేరే వ్యక్తితో మాట్లాడుతున్నదని ప్రియుడే ఆమె గొంతుకోసి చంపి 45 నిమిషాలు నగరంలో కారులో తిరిగిరక్తపు మరకల దుస్తులతోనే మురాఖబ్బత్ పోలీస్ స్టేషన్‌లో లొంగిపోయాడు. గతేడాది జులైలో జరిగిన ఈ ఘటనపై నమోదైన కేసు దుబాయి కోర్టులో ఆదివారం విచారణకొచ్చింది. భారత్‌కు చెందిన నిందితుడు (27) ఓ యువతిని ప్రేమించాడు. కానీ ఆమె వేరే వ్యక్తితో మాట్లాడుతూ మోసగిస్తున్నదని అనుమానించాడు. గత జులైలోనే ఇద్దరు మాల్‌కెళ్లినప్పుడు వాగ్వాదం జరిగింది. ప్రియుడు తన వెంట తెచ్చుకొన్న కత్తితో ఆమె గొంతుకోసి చంపేశాడు.

## లక్ష ప్రభుత్వ ఉద్యోగాలిస్తాం

- పంజాబ్ సీఎం హామీ



**చండీగఢ్:** వచ్చే రెండేండ్లలో యువతకు లక్ష ప్రభుత్వ ఉద్యోగాలిస్తామని పంజాబ్ సీఎం అమరీందర్ సింగ్ హామీ ఇచ్చారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి సోమవారంతో మూడేండ్లైన సందర్భంగా మీడియాతో ఆయన మాట్లాడారు. ఇప్పటికే 12.17 లక్షల ఉద్యోగాలు కల్పించినట్లు చెప్పారు. రాష్ట్రంలోని పలు రూట్లలో చిన్న బస్సుల కోసం ఐదు వేల కొత్త పర్మిట్లు, రవాణాకు సంబంధించి రెండు వేల పర్మిట్లు ఇస్తామన్నారు. క్రీడలను ప్రోత్సహించడంతోపాటు ప్రజల ఆరోగ్యం, యువతలో ఫిట్‌నెస్ కోసం 750 గ్రామీణ క్రీడా స్టేడియాలు నిర్మిస్తామని అమరీందర్ సింగ్ చెప్పారు.



# ఉరే తరువాయి!

- నిర్భయ దోషులకు ముగిసిన 'న్యాయ' అవకాశాలు
- ముకేశ్ పిటిషన్‌ను తిరస్కరించిన సుప్రీంకోర్టు
- ఐసీజేను ఆశ్రయించిన మిగతా ముగ్గురు దోషులు

**న్యూఢిల్లీ, మార్చి 16:** నిర్భయ కేసులోని నలుగురు దోషులైన అక్షయ్ సింగ్, పవన్ గుప్తా, వినయ్ శర్మ, ముకేశ్ సింగ్‌లను శుక్రవారం ఉరి తీయడం ఖాయంగా కనిపిస్తున్నది. వారికున్న న్యాయ అవకాశాలన్నీ ముగిసిపోయాయి. క్యురేటివ్, క్షమాభిక్ష పిటిషన్లు పునరుద్ధరించాలన్న ముకేశ్ సింగ్ అభ్యర్థనను సుప్రీంకోర్టు సోమవారం తిరస్కరించింది. అతడికి న్యాయపరమైన ఏ అవకాశాలు లేవని పేర్కొంది. కేంద్ర, ఢిల్లీ ప్రభుత్వాలు, న్యాయవాది వృందా గ్రోవర్ కలిసి నేరపూరిత కుట్ర, మోసానికి పాల్పడి తనను తప్పుదోవ పట్టించారంటూ ముకేశ్ తన తాజా పిటిషన్‌లో ఆరోపించాడు. ఈ నేపథ్యంలో దీనిపై సీబీఐతో దర్యాప్తు జరిపించాలని, తన క్యురేటివ్, రాష్ట్రపతి క్షమాభిక్ష తిరస్కరణ ఆదేశాలను రద్దు చేయాలంటూ న్యాయవాది ఎంఎల్ శర్మ ద్వారా కోర్టును ఆశ్రయించాడు. జస్టిస్‌లు అరుణ్ మిశ్రా, ఎంఆర్ షా ధర్మాసనం దీనిపై సోమవారం విచారణ జరిపింది. పిటిషన్ పరిశీలించదగినది కాదంటూ తిరస్కరించింది.

**కారుణ్య మరణం ప్రసాదించండి**

మరోవైపు కారుణ్యమరణానికి అవకాశం కల్పించాలంటూ దోషుల తల్లిదండ్రులు రాష్ట్రపతి కోవింద్‌కు ఆదివారం లేఖ రాశారు. 'కారుణ్యమరణానికి అనుమతివ్వాలని మిమ్మల్ని, బాధితురాలి తల్లిని కోరుతున్నాం. అప్పుడే భవిష్యత్తులో ఇలాంటివి జరగకుండా ఆపొచ్చు' అని పేర్కొన్నారు.

**ఐసీజేలో ఊరట కష్టమే..**

మరోవైపు నిర్భయ దోషులైన అక్షయ్, పవన్, వినయ్ సోమవారం అంతర్జాతీయ న్యాయస్థానాన్ని (ఐసీజే) ఆశ్రయించారు. ఉరిశిక్షపై స్టే విధించాలని కోరారు. అయితే ఐసీజేలో వారికి ఊరట లభించడం కష్టమేనని నిపుణులు చెప్తున్నారు. సాధారణంగా ఐసీజే ఇలాంటి కేసుల్లో తలదూర్చదన్నారు. మరోవైపు ఐసీజే.. పౌర, రాజకీయ హక్కులపై అంతర్జాతీయ ఒప్పందం (ఐసీసీపీఆర్), సార్వత్రిక ఒప్పందం ఆధారంగా పనిచేస్తుంది. ఆయా నిబంధనల ప్రకారం మరణ శిక్ష విధింపుపై నిషేధం లేదు. ఐసీసీపీఆర్‌లోని ఆర్టికల్-6 ప్రకారం మాత్రం కొన్ని పరిమితులున్నాయి. మరణ శిక్ష విధించే ముందు సమగ్రంగా న్యాయ విచారణ జరుగాలి. నేరానికి పాల్పడిన సమయంలోనే శిక్ష విధించకూడదు. క్షమాభిక్ష హక్కును ఉల్లంఘించకూడదు. దోషి వయసు 18 ఏండ్ల కంటే తక్కువగా ఉన్నప్పుడు, మానసిక పరిస్థితి సరిగా లేనప్పుడు, దోషి గర్భవతిగా ఉన్నప్పుడు మరణ శిక్ష విధించకూడదు. దోషికి ఉన్న న్యాయ విచారణ హక్కును పరిగణలోకి తీసుకోవాలి. నిర్భయ దోషుల విషయంలో ఈ నిబంధనలన్నింటినీ భారత ప్రభుత్వం, న్యాయవ్యవస్థ పాటించిందని నిపుణులు స్పష్టం చేస్తున్నారు.



కమల్‌నాథ్ ప్రభుత్వం చట్టసభలో బలాన్ని నిరూపించుకోవాలంటే పారిపోతున్నది. ప్రభుత్వ పతనాన్ని ఎవరూ కాపాడలేరు. ప్రభుత్వం ఎప్పుడో నైతికంగా ఓటమి పాలైంది. ముఖ్యమంత్రి వెంటనే రాజీనామా చేయాలి. తిరుగుబాటు ఎమ్మెల్యేలను బెంగళూరులో ఓ హోటల్‌లో బంధించి వశీకరణ మంత్రంతో తమవైపు తిప్పుకొనేందుకు ప్రయత్నిస్తున్నారు. వారి కుటుంబాలను వేధిస్తున్నారు.


**గోపాల్ భార్గవ, మధ్యప్రదేశ్ ప్రతిపక్ష బీజేపీ నేత**

మధ్యప్రదేశ్‌లో దొడ్డిదారిన అధికారంలోకి రావటానికి బీజేపీ ఎన్ని ప్రయత్నాలు చేయాల్నో అన్నీ చేస్తున్నది. ధన, కండ బలాలు ఉపయోగిస్తున్నది. కానీ కమల్‌నాథ్ ప్రభుత్వానికి పూర్తి మెజారిటీ ఉన్నది. సభలో అది నిరూపితమవుతుంది.

**నవాబ్ మాలిక్, ఎన్సీపీ నేత, మహారాష్ట్ర**



**చరిత్రలో నేడు**




**1521**

ఫిలిప్పీన్స్ చేరుకున్న పోర్చుగీస్ నావికా యాత్రికుడు ఫెర్డినాండ్ మాజిలాన్.

**1845**

రబ్బర్ బ్యాండ్‌ను కనుగొన్న లండన్‌కు చెందిన స్టీఫెన్ పెర్రీ.





**1905**

ఆధునిక భౌతిక శాస్త్రానికి పునాదులు వేసిన క్వాంటమ్ సిద్ధాంతాన్ని కనుగొన్న ఐన్‌స్టీన్.

అంతర్జాతీయ మార్కెట్‌లో చమురు ధరలపై ఆధారపడి దేశంలో పెట్రోల్, డీజిల్ ధరలు ఉంటాయని చెప్పుకొంటాం. ఇటీవలి పరిణామాల్లో చమురు ధరలు భారీగా తగ్గటంతో పెట్రోల్, డీజిల్ ధరలు తగ్గి వినియోగదారులకు మేలు జరుగాలి. కానీ కేంద్ర ప్రభుత్వం మూడు రూపాయలు ఎక్సైజ్ సుంకాన్ని పెంచి ప్రజలపై భారాన్ని మోపింది. ప్రస్తుతం లీటర్ పెట్రోల్‌పై 59 శాతం అంటే రూ.68.87లు పన్నులు, కమీషన్ల రూపంలో ప్రభుత్వానికి పోతున్నది. కాబట్టి చమురు ధరలు తగ్గినప్పడైనా వినియోగదారులకు మేలు జరిగేలా చర్యలు తీసుకోవాలి.

**ది టైమ్స్ ఆఫ్ ఇండియా**

జమ్ముకశ్మీర్‌కు ఐదుసార్లు ముఖ్యమంత్రిగా పనిచేసిన ఫరూఖ్ అబ్దుల్లాను ఏడు నెలల నిర్బంధం తర్వాత ప్రభుత్వం విడుదల చేయటం ఆహ్వానించదగినది. కశ్మీర్‌లో తిరిగి సాధారణ పరిస్థితులు నెలకొనేందుకు ఈ చర్యలు ఉపయోగపడుతాయి. గత ఆగస్టులో ఆర్టికల్ 370 రద్దుచేసిన తర్వాత కశ్మీర్‌లో అసాధారణ పరిస్థితులు కొనసాగుతున్నాయి. ఇదే సందర్భంలో మాజీ సీఎంలు ఒమర్ అబ్దుల్లా, మెహబూబా ముఫ్తీలను కూడా విడుదల చేసి జమ్ముకశ్మీర్‌కు రాష్ట్ర ప్రతిపత్తిని కల్పించాలి. అన్నిరకాల ఆంక్షలను ఎత్తివేయాలి.

**ది హిందూ**



# లౌకికత్వానికి బాసటగా!

రాజ్యాంగ విలువలకు వ్యతిరేకంగానే కాకుండా, తెలంగాణ సామరస్య సంస్కృతికి విరుద్ధంగా ఉన్న సీఏఏ, ఎన్పీఆర్, ఎన్నార్సీలను వ్యతిరేకిస్తూ తెలంగాణ అసెంబ్లీ తీర్మానించడం ప్రశంసనీయం. భారతీయ సమాజం సహన సంస్కృతికి, లౌకికత్వానికి ప్రతీక. రాజ్యాంగ నిర్మాతలు కూడా లౌకిక ప్రజాస్వామిక వ్యవస్థను నెలకొల్పాలని ఆకాంక్షించారు. ఈ నేపథ్యంలో మత ప్రాతిపదికపై రూపొందించిన సీఏఏ పట్ల వ్యతిరేకత వ్యక్తం కావడం సహజం. అందుకనే పలు రాష్ట్రాల అసెంబ్లీలు ఈ చట్టాన్ని వ్యతిరేకిస్తూ తీర్మానం చేశాయి. టీఆర్‌ఎస్ పార్లమెంటులో సీఏఏను వ్యతిరేకించింది. తెలంగాణ మంత్రివర్గం కూడా సీఏఏకు వ్యతిరేకంగా తీర్మానం చేసింది. ఈ క్రమంలో ఇప్పుడు రాష్ట్ర అసెంబ్లీ కూడా ఈ చట్టాన్ని వ్యతిరేకిస్తూ తీర్మానం చేయడం గమనార్హం. సీఏఏ మూలంగా అంతర్జాతీయంగా మన దేశ ప్రతిష్ఠ మసకబారుతున్నది. జాతీయ పౌర పట్టిక తయారుచేయడానికి గతంలో చేసిన ప్రయత్నం విఫలమైందంటూ అసెంబ్లీలో ముఖ్యమంత్రి కేసీఆర్ చేసిన వాదన కూడా బలమైనదే. 2003లోనే వాజపేయి హయాంలో ఇటువంటి ప్రయత్నం జరిగింది. మల్టీపర్పస్ నేషనల్ ఐడెంటిటీ కార్డ్స్‌ను ప్రవేశపెట్టడానికి దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాలలోని ఒక్కో ప్రాంతాన్ని ఎంచుకున్నారు. చివరికి ఈ ప్రయోగం విఫలమైందని 2011లో కేంద్రం అంగీకరించకతప్పలేదు. పౌరపట్టికలు తయారు చేయడమనేదే అత్యంత సంక్లిష్టమైన వ్యవహారం. దీనిని ఆషామాషీగా చేపట్టి వివాదాస్పదమైన అంశాలతో ప్రజలను ఆందోళనకు గురిచేయడం సబబు కాదు.

**సీఏఏ తదితరాల విషయంలో కూడా కేంద్రం మరోసారి తన విధానాన్ని సమీక్షించుకోవడం అవసరం. సీఏఏను వ్యతిరేకించినంత మాత్రాన దేశంలోకి చొరబాట్లను అరికట్టకూడదని కాదు. చొరబాటుదారులను గుర్తించకూడదనీ కాదు. దేశ భద్రతకు అవసరమైన చర్యలను కేంద్రం తీసుకుంటే, రాష్ట్రాలు, ప్రజలు సహకరించవలసిందే. కానీ అనుమానాలకు తావివ్వడం వల్లనే ఇంత ఆందోళన చెలరేగుతున్నది. అంతర్జాతీయంగా కూడా దేశ ప్రతిష్ఠకు భంగం కలుగుతున్నది. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం మేధావులతో, జాతీయ అంతర్జాతీయ అంశాల నిపుణులతో చర్చించడం మంచిది. రాష్ట్రాల :ముఖ్యమంత్రులను కూడా సంప్రదిస్తే బాగుంటుంది.**

దేశంలో ఎంతోకాలంగా జనాభా లెక్కలు చేపడుతున్నారు. ఇందులో వ్యక్తి గురించే కాకుండా అతడి ఆర్థిక, సామాజికాంశాలను కూడా సేకరిస్తారు. ఈ వివరాలకు ఆ పౌరుడు చెప్పిన వివరాలే ఆధారం. పదేండ్లకు ఒకసారి జరిగే జనాభాల లెక్కల వల్ల దేశం వివిధరంగాలలో సాధించిన పురోగతితో పాటు అనేక లోపాలు తెలుస్తాయి. ప్రజల అభివృద్ధికి ఏయే పథకాలు అమలుచేయాలనేది అర్థమవుతుంది. కానీ జాతీయ జనాభా పట్టిక (ఎన్పీఆర్) ద్వారా పౌరుడి జనన తేదీ, తల్లిదండ్రుల పేర్లు, ఎంతకాలంగా ఉంటున్నదీ, జాతీయత, చిరునామా మొదలైన వివరాలను మాత్రమే సేకరించవలసి ఉంటుంది. ఇందుకు ఆధారాలు అడుగడమనేది ఉండదు. జనం చెప్పిన విషయాలనే సేకరణ సిబ్బంది నమోదు చేసుకుంటుంది. కానీ జాతీయ పౌర పట్టిక (ఎన్నార్సీ) మాత్రం ఇందుకు భిన్నమైనది. పౌరులమని చెప్పుకోవడానికి ఆధారాలు చూపించవలసి ఉంటుంది. ఓటరు కార్డు, రేషన్‌కార్డు మొదలైన ఆధారాలను ప్రభుత్వం ఆమోదించకపోవచ్చు. పౌరుడు చూపించే ఆధారాల వల్ల సంబంధిత అధికారి సంతృప్తిచెందకపోతే ఇబ్బందులు తప్పవు. కొందరిని దేశం నుంచి పంపించవచ్చు లేదా నిర్బంధ శిబిరంలో కూడా పెట్టవచ్చు. దేశ విభజన నేపథ్యంలో లక్షలాదిమంది సరిహద్దుకు ఇరువైపులా తరలివెళ్ళారు. ఈ నేపథ్యంలో పౌరసత్వా న్ని రుజువుచేసుకోవడం అంత సులభం కాదు. పేద ప్రజలు, మహిళలు, ఇతర ప్రాంతాల నుంచి వలసవచ్చిన వారు ఆధారాలు చూపించడం కష్టం. జాతీయ జనాభా పట్టిక (ఎన్పీఆర్) ఎన్నార్సీ రూపకల్పనకు మొదటి మెట్టు అని చట్టంలో పేర్కొనడం కూడా ఆందోళనకు తావిస్తున్నది. ముఖ్యమంత్రి కేసీఆర్ చెప్పినట్టు ఒక చట్టం చేస్తే అది తమ బాగు కోసమని ప్రజలు భావించేలా ఉండాలి. కానీ తమకు ఇబ్బందులు కలుగుతాయని ఆందోళనచెందే పరిస్థితి ఉండకూడదు.

సీఏఏ న్యాయ సమీక్షకు నిలబడదనే అభిప్రాయం కూడా వ్యక్తమవుతున్నది. ఇటువంటి కీలకమైన చట్టాలు చేసే ముందు దేశవ్యాప్తంగా సుదీర్ఘ చర్చ జరుపడం ప్రజాస్వామిక వ్యవస్థలలో పరిపాటి. వివిధ కమిటీలు వేయడం, చర్చించి నిర్ణయాలు తీసుకోవడం వల్ల ప్రజలలో ఆందోళనలు చోటుచేసుకోవు. ఒక్కోసారి ప్రభుత్వం నిర్ణయం తీసుకున్న తర్వాత కూడా ప్రజలు ఆందోళనలు చేపట్టిన ఉదంతాలున్నాయి. ప్రజల ఆందోళనలకు సంతృప్తికరమైన వివరణలు ఇవ్వడం ప్రభుత్వ విధి. ప్రజల్లో ఆందోళనలు తగ్గకపోతే, నిర్ణయాలను ఉపసంహరించుకున్న సందర్భాలు కూడా ఉన్నాయి. సీఏఏ తదితరాల విషయంలో కూడా కేంద్రం మరోసారి తన విధానాన్ని సమీక్షించుకోవడం అవసరం. సీఏఏను వ్యతిరేకించినంత మాత్రాన దేశంలోకి చొరబాట్లను అరికట్టకూడదని కాదు. చొరబాటుదారులను గుర్తించకూడదనీ కాదు. దేశ భద్రతకు అవసరమైన చర్యలను కేంద్రం తీసుకుంటే, రాష్ట్రాలు, ప్రజలు సహకరించవలసిందే. కానీ అనుమానాలకు తావివ్వడం వల్లనే ఇంత ఆందోళన చెలరేగుతున్నది. అంతర్జాతీయంగా కూడా దేశ ప్రతిష్ఠకు భంగం కలుగుతున్నది. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం మేధావులతో, జాతీయ అంతర్జాతీయ అంశాల నిపుణులతో చర్చించడం మంచిది. రాష్ట్రాల ముఖ్యమంత్రులను కూడా సంప్రదిస్తే బాగుంటుంది.

**జనగళం**

### చర్యలు తీసుకోవాలి

కరోనా వైరస్ విస్తరించకుండా రాష్ట్ర ప్రభుత్వం ముందస్తు చర్యలు తీసుకున్నది. ఇందులో భాగంగా పాఠశాలలతో పాటు, సినిమా హాళ్లు, పార్క్‌లు, పబ్‌లు వంటి జన సమ్మర్థం ఉండే అన్నింటిని తాత్కాలికంగా మూసి వేయాలంటూ ఆదేశాలు జారీచేయడం హర్షణీయం. అయితే ఇదే అదనుగా కొందరు సొమ్ము చేసుకునేందుకు ప్రయత్నించటం గర్హనీయం. జలుబు, దగ్గు, జ్వరంతో రోగులు ప్రైవేట్ దవాఖాలను ఆశ్రయిస్తే పరీక్షల పేరిట అందినకాడికి దండుకుంటున్నారు. కాబట్టి ఇలాంటి వారిపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలి. ప్రజలు కూడా దగ్గు, జలుబు లాంటివి వచ్చినప్పుడు భయపడకుండా ధైర్యంగా ఉండాలి. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి.అనవసర భయాలకు గురికాకూడదు.

**- బందెల శ్రీనివాస్, కమాన్, కరీంనగర్**

### రోడ్డు ప్రమాదాలకు అడ్డుకట్ట వేయాలె

రోడ్డు ప్రమాదాలు రోజురోజుకూ పెరుగుతున్నాయి. ప్రమాదాలతో మరణాలు, క్షతగ్రాతుల సంఖ్య పెరుగుతూనే ఉన్నది. ఈ మరణాలకు నిర్లక్ష్యం, అతివేగం, మద్యం తాగి వాహనాలు నడుపడటం లాంటివే కారణాలని పలు నివేదికలు తెలుపుతున్నాయి. కాబట్టి ప్రభుత్వం పోలీసు ఉన్నతాధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాల్సిన అవసరం ఎంతైనా ఉన్నది. మితి మీరిన వేగం, మద్యం తాగి వాహనాలు నడిపే వారి డ్రైవింగ్ లైసెన్సులను రద్దు చేయాలి. అప్పుడే రోడ్డు ప్రమాదాలకు అడ్డుకట్ట పడుతుంది. రోడ్డు నిబంధనలకు ప్రథమ ప్రాధాన్యమివ్వాలి.

**- బేగరి ప్రవీణ్‌కుమార్, అంతారం, చేవెళ్ల, రంగారెడ్డి జిల్లా**

### ప్రత్యేక వసతులు కల్పించాలె

కరోనా ప్రభావం, భయాలు తీవ్రంగా ఉన్న సమయంలో పదో తరగతి పిల్లలకు పరీక్షలు నడుస్తున్నాయి. కాబట్టి అధికారులు పిల్లలందరికీ వ్యాధినుంచి రక్షణ కోసం మాస్క్‌లు, చేతులు కడుక్కునే ప్రత్యేక వసతులు కల్పించాలి. తద్వారా పిల్లల్లో ధైర్యాన్ని పెంచాలి.

**-సంధ్య విరగదిండ్ల, పార్వతిపురం , వనపర్తి జిల్లా**

**ఉత్తరాలు, రచనలు పంపవలసిన చిరునామా:** 8-2-603/1/7,8,9, కృష్ణాపురం, రోడ్‌నంబర్.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034. editpage@ntnews.com Fax-040-23291118

వ్యవసాయం

# పర్యావరణం కోసం యుద్ధం



**సి.పార్థసారథి (ఐఏఎస్)**

పర్యావరణ మార్పులను ఎదుర్కొనేందుకు కేవలం భారత్ అనుకుంటేనే కాదు, స్థానిక, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో సమగ్ర కార్యాచరణ అవసరం. కోపెన్ హగెన్ సదస్సులో నిర్ణయించినట్లుగా ఉద్గారాలను తగ్గించటం ద్వారా ఉష్ణోగ్రత పెరుగకుండా భారత్ కృషిచేయాలి. పర్యావరణ మార్పులకు అనుకూల విధానాలను రూపొందించుకుంటూనే, అభివృద్ధి చెందిన దేశాలు కార్బన్ ఉద్గారాల విడుదలకు మూల్యం చెల్లించేవిధంగా ఒత్తిడి తెస్తేనే పర్యావరణం పరిరక్షించబడుతుంది.

పర్యావరణ మార్పులు వ్యవసాయంపై తీవ్ర ప్రభావాన్ని చూపుతున్నాయి. ఫలితంగా ఆహారభద్రతపై నీలినీడలు అలుముకున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో తెలంగాణ ప్రభుత్వం చేపడుతున్న చర్యలు ఎంతో మేలు చేస్తున్నాయి. ఇప్పటికే యుద్ధ ప్రాతిపదికన హరితహారంతో మొక్కలు వనాల పెంపకం చేపట్టింది. అనావృష్టిని ఎదుర్కొనేందుకు చెరువుల పునరుద్ధరణ దాదాపు పూర్తయ్యింది. పంటల వైవిధ్యీకరణకు బాటలువేసింది. దీంతో పర్యావరణ మార్పులు విపరీతంగా చోటుచేసుకున్నప్పటికీ, సాగును సజావుగా సాగించేందుకు సాగునీటి ప్రాజెక్టులను పూర్తిచేస్తున్నది. ఒక్క మాటలో చెప్పాలంటే, పర్యావరణ మార్పులను తట్టుకునేందుకు, తెలంగాణ ప్రభుత్వం ముందస్తుగానే తయారైందని తెలుస్తున్నది.

వాతావరణ మార్పులతో అభివృద్ధి చెందుతున్న దేశాల్లో ఆహారధాన్యాల ఉత్పత్తి తరిగిపోతున్నది. మరో రెండు సెంటీగ్రేడ్ ఉష్ణోగ్రత పెరిగితే దేశంలో ప్రధాన ఆహారపంట వరి ఉత్పాదకత హెక్టారుకు ఒక టన్ను తగ్గిపోనున్నది. 2050 నాటికీ ఒక్క డిగ్రీ ఉష్ణోగ్రత పెరిగినా, దేశంలో మరో ప్రధాన ఆహారపంట గోధుమ ఉత్పాదకత తగ్గిపోతుంది. సాగుకు అనుకూల భూమి తగ్గిపోనున్నది. ప్రస్తుతం సాగు చేస్తున్న పంటరకాలు సాగుకు పనికిరావు. ఏడాదికి ఒక్క మన దేశంలోనే దాదాపు 70 లక్షల టన్నుల మేర ఉత్పత్తి పడిపోనున్నది. దీనికితోడు ఆకస్మిక వరదలు, వర్షాల లేమి సంభవించనున్నాయి. 2009లో సంభవించిన అననుకూల వర్షాభావ పరిస్థితుల వల్ల, ఒక కోటి 50 లక్షల టన్నుల వరి, 40 లక్షల టన్నుల ఇతర ఉత్పత్తి పడిపోయింది. పర్యావరణ మార్పుల వల్ల, అసాధారణ పరిస్థితులు భారత వ్యవసాయంలో చోటుచేసుకుంటున్నాయి. అసాధారణ వాతావరణ పరిస్థితులున్న దేశాల్లో భారత్ ప్రపంచంలోనే మూడో స్థానంలో ఉన్నది. ఒక్క 2015లోనే దేశంలో 15 రాష్ట్రాలు వీటి ప్రభావాన పడితే, దాదాపు 33 శాతం పంటల సాగు విస్తీర్ణం దెబ్బతిన్నది. ఇరువై వేల కోట్ల రూపాయల పైనే రైతులు నష్టపోయారు. పంటల బీమా లాంటి పథకాలతో ఆదుకుంటే తప్ప, రైతు సాగులో నిలబడలేరని భారత హరితవిప్లవ పితామహులు స్వామినాథన్ గుర్తుచేయాల్సి వచ్చింది. ఇది దేశ ఆహారభద్రతకు ప్రత్యక్ష హెచ్చరిక. ఎంత త్వరగా పరిష్కారం వెతికితే, అంత త్వరగా దేశం, ఆహార భవిష్యత్తు భద్రంగా ఉంటుంది.

తెలుగు రాష్ట్రాలకు మరిన్ని పర్యావరణ సవాళ్లు పొంచి ఉన్నట్లు ప్రపంచబ్యాంకు 'షాక్ వేవ్స్' నివేదిక తెలుపుతున్నది. పర్యావరణ మార్పుల ప్రభావాన్ని గత 25 ఏండ్లలో అధ్యయనంలో 14 శాతం ప్రజలు పేదరికం నుంచి బయటపడితే, ఏడాదికి సరాసరిన 12 శాతం ప్రజలు మళ్లీ పేదరికంలోకి నెట్టివేయబడుతున్నారు. ఎండల తీవ్రత, వర్షాల లేమి వల్ల, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో గత 25 ఏండ్లలో 15 వేల మందికి పైగా పేదలు చనిపోయారు. ప్రపంచంలో సూడాన్ దేశం తర్వాత, అత్యధిక మరణాలు జరిగినయి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోనే. 2030 నాటికీ ఐదు శాతం మేర ఆహారధాన్యాల ఉత్పత్తి పడిపోతుంది. దీంతో పేదరికం పెరుగనున్నది. 2030 నాటికీ పేదరిక నిర్మూలన చర్యలు చేపట్టకపోతే, పేదరికం 30 శాతానికి చేరుకోనున్నది. కరువు, నీటికొరత, తద్వారా పంట నష్టాల వల్ల పంటల దిగుబడులు తగ్గి ఆహారకొరత పెరగనున్నదని నివేదిక తెలిపింది. ఇక దేశంలో 2013-14లో 26.5 కోట్ల టన్నుల ఆహార ధాన్యాల ఉత్పత్తి ఉంటే, 2014-15లో 4 శాతం తగ్గి 25.3 కోట్ల టన్నులు మాత్రమే ఉత్పత్తి అయింది. అందుకు కారణం పర్యావరణ మార్పే.

ప్యారిస్‌లో జరుగుతున్న కాప్-21 సదస్సులో ప్రభుత్వం తీసుకోబోయే చర్యలను భారత్ ఇప్పటికే ప్రకటించింది. పర్యావరణ మార్పులకు అనుకూల చర్యలు చేపట్టడానికి వచ్చే పదిహేనేండ్లలో 165 లక్షల కోట్లు ఖర్చు చేయనున్నదని ప్రభుత్వం ప్రకటించింది. అలాగే కర్బన ఉద్గారాలలో మూడవ స్థానంలో ఉన్న భారత్ సౌరశక్తి ఉత్పత్తిని పెంపొందించేందుకు రూ.198 కోట్లు కేటాయించింది. భవిష్యత్తులో వాతావరణ మార్పులను తట్టుకునేందుకు సమీకృత అభివృద్ధే శరణ్యమని నివేదిక చెబుతున్నది. అధిక ఉష్ణోగ్రతలను తట్టుకునే వ్యవసాయ పద్ధతులు రైతులకు చేరవేయాలి. ముఖ్యంగా వ్యవసాయాధారిత రంగాలపై పన్ను భారం తగ్గించాలి. పేద ప్రజల సంక్షేమానికి ప్రత్యేక చర్యలు చేపట్టాలి. మొత్తంగా ప్రభుత్వం ఒక రక్షణ కవచంగా ప్రజలకు చేరువవ్వాలి.

ఐదు దశాబ్దాల కిందట హరిత విప్లవం సాకారమవుతున్న కాలంలో కోటి టన్నుల గోధుమలు దేశంలోకి దిగుమతి చేసుకుంటే, నేడు కూడా కోటి టన్నుల ఆహార పదార్థాలు దిగుమతి చేసుకుంటున్నాం. పెరిగిన సాంకేతికత, శాస్త్రీయ పరిస్థితిని మెరుగుపరచలేకపోయిందంటే అందుకు కారణం పర్యావరణ మార్పే. ఫలితంగా గత ముప్పై ఏండ్లలో క్షామ పరిస్థితులతో అభివృద్ధి చెందుతున్న దేశాలు విలవిల్లాడాయి. ప్రకృతి విపత్తుల వల్ల ప్రపంచవ్యాప్తంగా 1.5 ట్రిలియన్ అమెరికన్ డాలర్ల నష్టం జరిగిందని ప్రపంచ ఆహార, వ్యవసాయ సంస్థ తెలిపింది. ప్రపంచవ్యాప్తంగా 2.5 బిలియన్ల ప్రజలు వ్యవసాయంపై ఆధారపడితే, కేవలం 4.2 శాతం నిధులే అందుకు కేటాయించబడుతున్నాయి.

పర్యావరణ మార్పులను ఎదుర్కొనేందుకు కేవలం భారత్ అనుకుంటేనే కాదు, స్థానిక, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో సమగ్ర కార్యాచరణ అవసరం. కోపెన్ హాగెన్ సదస్సులో నిర్ణయించినట్లుగా ఉద్గారాలను తగ్గించటం ద్వారా ఉష్ణోగ్రత పెరుగకుండా భారత్ కృషిచేయాలి. పర్యావరణ మార్పులకు అనుకూల విధానాలను రూపొందించుకుంటూనే, అభివృద్ధి చెందిన దేశాలు కార్బన్ ఉద్గారాల విడుదలకు మూల్యం చెల్లించేవిధంగా ఒత్తిడి తెస్తేనే పర్యావరణం పరిరక్షించబడుతుంది.

సార్క్ దేశాలతో పాటు ప్రాంతీయ సహకారంతో వీటిని సాధించాలి. జాతీయస్థాయిలో ముఖ్యంగా పర్యావరణ అనుకూల విధానాలు రూపొందించాలి. స్థానికంగా పర్యావరణ మార్పుల ప్రభావాలను తగ్గించే తరుణోపాయాలు తరచిచూడాలి. సుస్థిర సాగు వ్యవస్థలు రూపొందించాలి. వ్యవసాయం-పర్యావరణ యూనిట్‌గా స్థానిక సాంకేతిక పద్ధతులకు ప్రాధాన్యం ఇవ్వాలి. ఆహార, పోషక వ్యవస్థల్లో నష్టాలను నివారించాలి. పంటల మార్పిడి, జీవ సేంద్రియ ఎరువులు, జీవ నియంత్రణ పద్ధతులు, పర్యావరణ వ్యవస్థతో ఇమిడ్చి, ఆధునికతను జోడించడం ద్వారా వ్యవసాయాన్ని సుస్థిరపరుచాలి. భూమి ఆరోగ్య పరిరక్షణ, నీటి సంరక్షణ, భూసారం పెంపొందింపు, నేల కోతను నివారించటం ద్వారా ఉత్పాదకతను పెంచడం దీర్ఘకాలిక లక్ష్యంగా ఎంచుకోవాలి. పర్యావరణ మార్పులను ఎదుర్కొనగలిగే సూత్రమిదే. ఉత్పాదకతను పెంచటంతో పాటు, పశుపక్షాదులు, నీరు, నేల వనరులను కాపాడగలిగే శక్తి జీవవైవిధ్యానిది. దీంతో చీడ, పీడలను, కరువుకాటకాలను తట్టుకునే పంట రకాలు వైవిధ్యంతోనే సాధ్యం. పంటలు, చేపలు, కోళ్లు, అటవీ ఉత్పత్తులు, పాడితో కూడిన ఉత్పత్తి ఆధారిత సాగు వ్యవస్థను రూపొందించాలి.



**వ్యవసాయం-పర్యావరణ యూనిట్‌గా స్థానిక సాంకేతిక పద్ధతులకు ప్రాధాన్యం ఇవ్వాలి. ఆహార, పోషక వ్యవస్థల్లో నష్టాలను నివారించాలి. పంటల మార్పిడి, జీవ సేంద్రియ ఎరువులు, జీవ నియంత్రణ పద్ధతులు, పర్యావరణ వ్యవస్థతో ఇమిడ్చి, ఆధునికతను జోడించడం ద్వారా వ్యవసాయాన్ని సుస్థిరపరుచాలి. భూమి ఆరోగ్య పరిరక్షణ, నీటి సంరక్షణ, భూసారం పెంపొందింపు, నేల కోతను నివారించటం ద్వారా ఉత్పాదకతను పెంచడం దీర్ఘకాలిక లక్ష్యంగా ఎంచుకోవాలి.**

పట్టణాలు, నగరాల్లో వ్యర్థాలను సమర్థవంతంగా ఉపయోగించుకోగలిగే వ్యవసాయాన్ని యుద్ధప్రాతిపదికన పెంపొందించాలి. తద్వారా పర్యావరణ ఆధారిత దిగుబడి నష్టాన్ని తగ్గించుకోవచ్చు. ఇంకుడు గుంతలు, పోషక ఎరువులనిచ్చే చెట్లు, బయోగ్యాస్ వాడకాన్ని పెంపొందించటం ద్వారా వర్షాధార ప్రాంతాలను కాపాడుకోవచ్చు.

రైతు సాంఘిక, ఆర్థికవ్యవస్థలను పెంపొందించే టెక్నాలజీ, ఉత్పత్తి కారక వ్యవస్థలు అవసరం. నికర ఆదాయాన్ని అందించగలిగే వ్యవసాయం, రైతుల సుస్థిర ఆర్థికానికి ఆధారం. సహకారసంస్థలు, ఉత్పత్తి కంపెనీలు, గ్రూపు సాగులను ప్రోత్సహించటం ద్వారా చిన్న, సన్నకారు రైతులకు చేయూతనివ్వాలి. పంటల బీమా కీలకమైనది. అయితే దేశంలో 20 శాతం రైతులు మాత్రమే పంటల బీమా చేస్తున్నారు. 80 శాతం మంది రైతులు ఈ రక్షణ చట్టం కిందకు రావటంలేదు. దేశంలో 14 కోట్ల మంది రైతుల భవిష్యత్తు, దేశ ఆహారభద్రతతో ముడిపడి ఉన్న పర్యావరణ మార్పుల నుంచి వ్యవసాయాన్ని కాపాడుకునే బాధ్యత ప్రభుత్వాలదే. సమగ్రమైన ప్రణాళికలతో, కార్యాచరణకు దిగాల్సిన సమయం ఇది.

# పాలన బాగుంది.. పన్నులు భారమా?

తెలంగాణం



**ఇలపావులూరి మురళీమోహనరావు**

సాధారణంగా ప్రజల నుంచి వ్యతిరేకత ఎదురవుతుందనుకునే కొన్ని చర్యలను/సంస్కరణలను అసెంబ్లీ/పార్లమెంట్ సమావేశాలు ముగిసిన తర్వాత తీసుకుంటాయి ప్రభుత్వాలు. చట్టసభలు నడుస్తున్న సమయంలో ప్రభుత్వాలు తాము తీసుకోదలచిన చర్యలకు లేదా సంస్కరణలకు సభ అనుమతి పొందాలి. సభలో ప్రతిఘటన ఎదురవుతుందనుకున్నప్పుడు సభాకాలం ముగిశాక సదరు చర్యలు తీసుకుంటాయి. కరెంట్, ఇంధనం చార్జీలు, రవాణా చార్జీలు పెంచడం లాంటివి సభలు జరుగుతున్నప్పుడు చేపట్టడానికి ప్రభుత్వాలు సాహసించవు. గతంలో పార్లమెంట్ సమావేశాలు ముగిశాక పెట్రోల్, గ్యాస్ ధరలను కేంద్రం పెంచి విమర్శలపాలైన ఉదంతాలు అనేకం ఉన్నాయి.

మొన్న అసెంబ్లీ సమావేశాలు జరుగుతున్న సమయంలో కరెంట్ చార్జీలు, ఆస్తి పన్నులు పెంచుతామని సభా సాక్షిగా ప్రకటించి సరికొత్త ఒరవడికి సాహసించారు సీఎం కేసీఆర్. ఓట్ల కోసం రాష్ట్ర ప్రయోజనాలను బలిపెట్టలేమని నిర్ద్వంద్వంగా ప్రకటించి సంచలనం సృష్టించారు. ప్రజల నెత్తిన భారం వేసేటపుడు ముఖ్యమంత్రులు కొంచెం భయపడుతారు. నిజానికి గత ఆరేండ్లలో రెండుసార్లు స్వల్పంగా కరెంట్ చార్జీలను పెంచారు. ఇది మూడోసారి. ఏమా సాహసం! అయినప్పటికీ కరెంట్ చార్జీలు పెంచుతామని కేసీఆర్ ప్రకటించినప్పటికీ ప్రజల నుంచి ఎలాంటి వ్యతిరేకత కనిపించలేదు. చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు అధికంగా పెంచిన కరెంట్ చార్జీలు కొంచెం తగ్గించమని ఆందోళన చేసిన రైతుల మీద కాల్పులకు తెగబడి ముగ్గురి ప్రాణాలను తీశారు. కానీ, మొన్నటి కేసీఆర్ ప్రకటన తర్వాత ప్రతిపక్షాలు రెచ్చగొట్టినప్పటికీ, ప్రజల నుంచి నిరసన వ్యక్తం కాలేదు. ప్రజల మీద కేసీఆర్‌కు ఉన్న నమ్మకమా? ప్రజలకు తన మీదున్న నమ్మకమా? కారణాలు విశ్లేషించడం పెద్ద కష్టమేమీ కాదు.

రాష్ట్రం విడిపోయాక తెలంగాణ మూడేండ్ల పాటు కరెంట్ కోతలు ఎదుర్కోవాల్సి ఉంటుందని అంచనాలు వేశారు. ముఖ్యమంత్రి కేసీఆర్ కూడా స్వయంగా కొన్నాళ్లపాటు కరెంట్ కష్టాలు తప్పవని చెప్పడంతో వ్యవసాయికంగా, పారిశ్రామికంగా తెలంగాణ వెనుకబడుతుందేమో అని సందేహించాం. గృహావసరాలకు కూడా కరెంట్ సరఫరా కష్టమవుతుందని నమ్మారు చాలామంది. చిన్నచిన్న పరిశ్రమలు మూతపడిపోతాయని, పరిశ్రమలు వెళ్లిపోతాయని రకరకాలుగా భయపెట్టారు. కానీ, ప్రజల భయాలను, అనుమానాలను పటాపంచలు చేస్తూ విద్యుత్ ఉత్పత్తిలో మొదటి ఏడాదిలోనే ప్రభుత్వం సాధించిన విజయం నభూతో. రాష్ట్రం విడిపోయిన తర్వాత ఈరోజు వరకు.. గత ఆరేండ్లలో కరెంట్ పోవడమన్నది చూడలేదు. రైతులకు నిరంతరాయంగా విద్యుత్‌ను సరఫరా చేయగలిగారు. ఫలితంగా ఈ రోజు తెలంగాణ పారిశ్రామిక ప్రగతిలో అగ్రగామిగా ఉండటమే గాక ఆహారధాన్యాల ఉత్పత్తిలో దేశంలోనే ప్రథమ స్థానానికి ఎగబాకి దక్షిణ భారత అన్నపూర్ణగా ఖ్యాతినొందింది. ఇవాళ తెలంగాణలో ఎక్కడచూసినా నీటి గలగలలు, పచ్చదనపు పరవళ్లు కనిపిస్తున్నాయి. చెరువులు నీళ్లతో నిగనిగలాడుతున్నాయి. అలుగులు పరుగులు తీస్తున్నాయి. కాళేశ్వరపు రవళులు గజ్జెకట్టి నాట్యమడుతున్నాయి. ఇదంతా ఎలా సాధ్యమైంది? ఇంత విజయాన్ని సాధించడానికి కేసీఆర్ ఎన్ని కష్టాలు పడిఉంటారు? ఎంత అలోచించి ఉంటారు? దాన్ని విపక్షాలు పట్టించుకోరు. కేంద్రంతో మైత్రి లేదు. అదనంగా నయా పైసా కూడా కేంద్రం విదిల్చదు. తెలంగాణకు శాశ్వత ఆస్తి లాంటి కాళేశ్వరానికి కేంద్రం ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదు. తెలంగాణలో నలుగురు బీజేపీ ఎంపీలు ఉన్నప్పటికీ, ఒక్క పథకానికి కూడా కేంద్రం నుంచి నిధులు రాబట్టడంలో విఫలమవుతున్నారు. అయినప్పటికీ కేసీఆర్ చిత్తశుద్ధి, సంకల్పబలం ప్రజల పట్ల ఆపేక్ష అన్ని వ్యతిరేకతలను తట్టుకొని సగర్వంగా నిలబడింది.

కేంద్రం రోజుకోసారి ఇంధనం ధరలను పెంచుతుంది. (దీనికి సవరించడమని ముద్దు పేరు). మొన్ననే మొబైల్స్ మీద జీఎస్టీని ఏకంగా ఆరు శాతం పెంచింది. ఇగ గ్యాస్ ధరలు నెలకోసారి పెరుగుతుంటాయి. వాటన్నింటినీ నోరు మూసుకొని భరించేవారు అర్ధ రూపాయి మేర కరెంట్ చార్జీలు పెంచితే అగ్గి మీద గుగ్గిలమవుతారు. అదేదో ప్రకటనలో డబ్బులు ఊరికే రావు అని చెప్పినట్లు, కరెంట్ కూడా ఊరికే రాదు. దాని ఉత్పత్తికి అయ్యే ఖర్చుతో పోలిస్తే, వినియోగదారుల దగ్గర వసూలు చేసేది చాలా తక్కువ. రైతులకు ఉచితంగా ఇవ్వాలి. అదీగాక దొంగతనంగా కరెంట్ వాడుకోవడం మనదగ్గర ఎక్కువ. ఇన్ని ఇబ్బందులను అధిగమించి వినియోగదారులకు కోపం రాకుండా కరెంట్ సరఫరా చేయడం కత్తిమీద సాము లాంటిది. అయినా ప్రజాగ్రహానికి గురవుతామని వెరసి కరెంట్ చార్జీలను పెంచడానికి వెనుకాడుతాయి ప్రభుత్వాలు. కానీ, అలా నిభాయించుకొని రావడం ఎన్నాళ్లో సాధ్యం కాదు. అయితే చార్జీలను ఎందుకు పెంచాల్సి వస్తున్నదో ప్రజలకు వివరించి వారి ఆమోదం పొందడం పరిపక్వత గలిగిన పాలకుని లక్షణం. అందుకే కేసీఆర్ నిర్భయంగా సభలోనే చార్జీల పెంపు అంశాన్ని నిర్మొహమాటంగా ప్రస్తావించారు.

ఇక నిరాఘాటంగా సాగుతున్న సంక్షేమ పథకాలు కేసీఆర్‌ను ప్రజల గుండెల్లో దేవుడిలా కొలువుంచాయి. తొంభై శాతం ప్రజలు కేసీఆర్ పాలన పట్ల సంతృప్తులుగా ఉన్నారు. ఒక పార్టీ పాలనలో తమకు మేలు కీడు ఎంతెంత శాతం ఉన్నాయో బేరీజు వేసుకుంటారు. ఎక్కువ శాతం మేలు జరుగుతున్నదని నమ్మినప్పుడు ఒకట్రెండు శాతం కీడును పట్టించుకోరు. పైగా తమ ముఖ్యమంత్రి వ్యక్తిత్వం, నిజాయితీ మీద విశ్వాసం ఉంచినప్పుడు, ఆయనేం చేసినా, తమ శ్రేయస్సును దృష్టిలో ఉంచుకునే చేస్తారని నమ్మినప్పుడు నాయకుని కోసం ప్రాణమైనా ఇస్తారు. ప్రజల నుంచి అలాంటి నమ్మకాన్ని సాధించడం, విశ్వాసాన్ని గెలుచుకోవడం అంత ఆషామాషీ కాదు. ఇవాళ ప్రజల నమ్మకాన్ని పూర్తిస్థాయిలో గెలుచుకున్న నాయకుడు తెలంగాణలో ఒక్క కేసీఆరే అనడంలో ఏమాత్రం సందేహించాల్సిన అవసరం లేదు. అందువల్లనే కేసీఆర్ రెండోసారి ఘనవిజయాన్ని సాధించడమే కాక, ఇటీవల జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో కూడా 95 శాతం విజయాలు సాధించగలిగింది. కేసీఆర్ మనకు వ్యతిరేకంగా ఏమీ చేయడనే విశ్వాసం ప్రజల్లో స్థిరపడింది. అందుకే కేసీఆర్ ఏం చేసినా ప్రజలు గుండెల మీద చేతులు వేసుకొని ఆమోదిస్తారు. గప్పాలు కొట్టుకోవడం, డప్పులు కొట్టుకోవడం, భజనలు చేయించుకోవడం, మీడియాను చేరదీసి స్తోత్రాలు చేయించుకోకపోవడం కేసీఆర్‌ను ఒక విలక్షణ నాయకుడిగా నిలబెట్టాయి. పనిచేసి చూపించి ప్రజలను ఓట్లు అడుగు అనే సిద్ధాంతానికి కేసీఆర్ కట్టుబడి ఉన్నారు కాబట్టే ఇవాళ కేసీఆర్‌కు ఎదురులేకుండాపోయింది. ఇరుగు పొరుగు రాష్ట్రాలు కూడా కేసీఆర్‌ను ఆదర్శంగా తీసుకుంటున్నాయి. ఆయన పథకాలను మనస్ఫూర్తిగా స్వీకరించి తమ రాష్ట్రాల్లో కూడా అమలుచేస్తున్నాయి. మొదట్లో తెలంగాణలో ఎందరో ఎగతాళి చేసిన గొర్రెల పంపిణీ పథకాన్ని ఆంధ్రప్రదేశ్‌లో కూడా అమలుచేస్తామని ఏపీ ప్రభుత్వం ప్రకటించింది. ఇక రైతుబంధు పథకాన్ని కేంద్రం కూడా అమలుచేస్తున్నది. ఇవన్నీ ముందుచూపు, దార్శనికత కలిగిన నాయకులకే సాధ్యమయ్యే విషయాలు. అవే ఆయనకు శ్రీరామరక్ష.



**తమ ముఖ్యమంత్రి వ్యక్తిత్వం, నిజాయితీ మీద విశ్వాసం ఉంచినప్పుడు, ఆయనేం చేసినా, తమ శ్రేయస్సును దృష్టిలో ఉంచుకునే చేస్తారని నమ్మినప్పుడు నాయకుని కోసం ప్రాణమైనా ఇస్తారు. ప్రజల నుంచి అలాంటి నమ్మకాన్ని సాధించడం, విశ్వాసాన్ని గెలుచుకోవడం అంత ఆషామాషీ కాదు. ఇవాళ ప్రజల నమ్మకాన్ని పూర్తిస్థాయిలో గెలుచుకున్న నాయకుడు తెలంగాణలో ఒక్క కేసీఆరే అనడంలో ఏమాత్రం సందేహించాల్సిన అవసరం లేదు.**


**(వ్యాసకర్త: సీనియర్ రాజకీయ విశ్లేషకులు)**

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481,
Published at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Ph: +91 878 2283899, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/38229.

epaper.ntnews.com

# సాగునీటి యాజమాన్యంపై పరిశోధనా కేంద్రం

### కేంద్రానికి మంత్రి నిరంజన్‌రెడ్డి ప్రతిపాదన



**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రాష్ట్రంలో పెరుగుతున్న నీటిపారుదల సౌకర్యాల నేపథ్యంలో రైతులకు నీటి యాజమాన్య పద్ధతులపై అవగాహన కల్పించేందుకు సాగునీటి యాజమాన్య పరిశోధనా కేంద్రం ఏర్పాటుచేయాలని వ్యవసాయశాఖ మంత్రి నిరంజన్‌రెడ్డి కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తిచేశారు. అదేవిధంగా జగిత్యాలలో ఆవాల పంట పరిశోధన కేంద్రం కూడా నెలకొల్పేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ మేరకు కేంద్ర వ్యవసాయశాఖ మంత్రి నరేంద్రసింగ్‌తోమర్‌కు సోమవారం మంత్రి నిరంజన్‌రెడ్డి ప్రతిపాదనలు పంపారు. కాళేశ్వరం ఎత్తిపోతలతో సాగుకు సమృద్ధిగా నీరు అందుతున్నదని, కోటి ఎకరాల ఆయకట్టు స్థిరీకరణ వైపు తెలంగాణ అడుగులు పడ్డాయని తెలిపారు. అందుబాటులోకి వచ్చిన సాగునీరును సమర్థంగా వాడుకొనేందుకు నీటి వినియోగ పరిశోధనా కేంద్రం ఏర్పాటు అవసరమన్నారు.

# సీఎం కేసీఆర్‌కు బ్రాహ్మణుల కృతజ్ఞతలు

### బ్రాహ్మణ సంక్షేమానికి రూ.50 కోట్లు కేటాయింపుపై హర్షం

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రాష్ట్రంలోని బ్రాహ్మణుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని తాజా బడ్జెట్‌లో రూ.50 కోట్లు కేటాయించడం పట్ల బ్రాహ్మణ ప్రతినిధులు హర్షం వ్యక్తంచేశారు. ప్రభుత్వం తమపట్ల చూపుతున్న ఔదార్యం అభినందనీయమని బాలానగర్ కార్పొరేటర్ కందూరి నరేంద్రచారి, అఖిల భారత బ్రాహ్మణ సేవాసంఘం అధ్యక్షుడు రాహుల్ దేశ్‌పాండే ఓ సంయుక్త ప్రకటనలో సీఎం కేసీఆర్‌కు, ఆర్థికశాఖ మంత్రి టీ హరీశ్‌రావుకు కృతజ్ఞతలు తెలిపారు. సోమవారం బ్రాహ్మణ సంక్షేమ పరిషత్ చైర్మన్ కేవీ రమణాచారిని కలుసుకొని ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. తెలంగాణలోని బ్రాహ్మణుల సంక్షేమానికి రమణాచారి అన్నివిధాలుగా కృషిచేస్తున్నారని, సంక్షేమ పరిషత్ ద్వారా అమలుచేస్తున్న కార్యక్రమాలు అందరికీ సద్వినియోగం కావాలని ఆకాంక్షించారు. అనంతరం శాసనమండలి ఆవరణలో ఎమ్మెల్సీ పురాణం సతీశ్‌ను కలిసిన వారు కృతజ్ఞతలు తెలిపి సత్కరించారు.


# రేపు ఓ మోస్తరు వానలు

**హైదరాబాద్/ హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ:** దక్షిణ ఛత్తీస్‌గఢ్, దాని పరిసర ప్రాంతాల్లో సముద్రమట్టానికి 0.9 కిలోమీటర్ల ఎత్తు వద్ద ఉపరితల ఆవర్తనం కొనసాగుతున్నదని హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు తెలిపారు. దీని ప్రభావంతో బుధవారం రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన తేలికపాటి నుంచి ఓ మోస్తరు వానలు కురిసే అవకాశం ఉన్నదని చెప్పారు. వచ్చే 24 గంటల వరకు రాష్ట్రంలో పొడి వాతావరణం ఉండొచ్చని పేర్కొన్నారు. మరోవైపు, గ్రేటర్ హైదరాబాద్‌లో కొన్నిరోజులుగా ఎండలు మండుతున్నాయి. మధ్యాహ్న సమయంలో ఎండ తీవ్రత అధికంగా ఉంటున్నది. సోమవారం గరిష్ఠ ఉష్ణోగ్రత 34 డిగ్రీలు, కనిష్ఠ ఉష్ణోగ్రత 21.1 డిగ్రీలు, గాలిలో తేమ 75 శాతంగా నమోదైందని వాతావరణ కేంద్రం అధికారులు తెలిపారు.



# జోరుగా మూడో మోటర్

- తిప్పాపూర్ సర్జ్‌పూల్‌లో ట్రయల్‌రన్ విజయవంతం
- జలాశయంలోకి చేరిన 0.7టీఎంసీల నీరు
- రెండ్రోజుల్లో మరో మోటరు పరీక్షకు సమాయత్తం



తిప్పాపూర్ సర్జ్‌పూల్‌లో కాళేశ్వరం జలాలను ఎత్తిపోస్తున్న మూడో నంబర్ పంప్

**హైదరాబాద్, నమస్తేతెలంగాణ:** కాళేశ్వరం ఎత్తిపోతల పథకంలో భాగంగా తిప్పాపూర్ సర్జ్‌పూల్ నుంచి అన్నపూర్ణ జలాశయంలోకి నీటిని తరలించేందుకు జరిపిన మూడో మోటర్ పరీక్ష విజయవంతమైంది. రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలం అనంతగిరి శివారులోని అన్నపూర్ణ జలాశయానికి బోయినపల్లి మండలం శ్రీరాజరాజేశ్వర జలాశయం నుంచి గోదావరి జలాలను ఎత్తిపోస్తున్న సంగతి తెలిసిందే. ఇప్పటికే రెండు మోటర్ల పరీక్ష విజయవంతం కాగా, తాజాగా మూడో మోటర్‌ను పరీక్షించారు. దీంతో గోదావరి జలాలు అన్నపూర్ణ రిజర్వాయర్‌లోకి పరుగులు తీశాయి. సోమవారం నిర్వహించిన మూడోమోటర్ ట్రయల్‌రన్ విజయవంతమైనట్టు ఈఎన్సీ హరీరాం తెలిపారు. ఈ మోటర్ ద్వారా కూడా 2,836 క్యూసెక్కుల నీరు జలాశయంలోకి దుంకినట్టు అధికారులు పేర్కొన్నారు.

### సర్జ్‌పూల్ నుంచి..

శ్రీరాజరాజేశ్వర జలాశయం నుంచి గోదావరి జలాలను తిప్పాపూర్ శివారులోని సర్జ్‌పూల్ (మహాబావి)కి తరలించి, అక్కడి నుంచి అన్నపూర్ణ జలాశయంలోకి ఎత్తిపోస్తున్నారు. ఈ ప్రక్రియలో భాగంగా ఈ నెల 11న మొదటి మోటర్, 14న నాల్గో నంబర్ మోటర్‌ను విజయవంతంగా పరీక్షించారు. ఒక్కో మోటర్ సామర్థ్యం 106 మెగావాట్లు కాగా, రెండో నంబర్ మోటర్ పరీక్షను మరో రెండురోజుల్లో పూర్తిచేసేందుకు అధికారులు ప్రయత్నిస్తున్నారు. నాలుగు మోటర్లు పనిచేయడం ప్రారంభమైతే రోజుకు టీఎంసీ నీటిని సర్జ్‌పూల్ నుంచి అన్నపూర్ణ జలాశయంలోకి ఎత్తిపోయవచ్చు. అయితే ప్రభుత్వ ఆదేశాల ప్రకారం ప్రస్తుతం ఒక్క మోటర్ ద్వారానే నిరవధికంగా నీటిని పంప్‌చేస్తున్నారు. దీంతో 3.5 టీఎంసీల నిల్వ సామర్థ్యమున్న అన్నపూర్ణ జలాశయంలోకి సోమవారం సాయంత్రానికి 0.7టీఎంసీల నీరు చేరిందని అధికారులు చెప్పారు. సాంకేతికంగా ఈ స్థాయి నీటి నిల్వతో అన్నపూర్ణ రిజర్వాయర్ నుంచి రంగనాయకసాగర్ జలాశయానికి నీటిని తరలించవచ్చని భావిస్తున్నారు. ప్రభుత్వం నుంచి ఆదేశాలు అందగానే చంద్లాపూర్ పంప్‌హౌజ్ వద్ద కూడా మోటర్ల ట్రయల్‌రన్ చేపట్టేందుకు అధికారులు సిద్ధమవుతున్నారు.

### సరస్వతి బరాజ్‌కు గోదావరి జలాలు

**కాళేశ్వరం:** కాళేశ్వరం ప్రాజెక్టులో భాగమైన జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని లక్ష్మి పంప్‌హౌజ్‌లో ఒక మోటర్‌ను నిరంతరం నడిపిస్తున్నారు. రోజుకు 2,300 క్యూసెక్కుల నీటిని సరస్వతి బరాజ్‌కు తరలిస్తున్నారు. సోమవారం ఉదయం 9వ నంబర్ మోటర్‌ను నిలిపి వేసి, సాయంత్రం 3వ నంబర్ మోటర్‌ను నడిపించారు.



### యాదాద్రి సమాచారం

- ఉదయం 4 గంటలకు లక్ష్మీనర్సింహా స్వామివారి ఆలయం తెరుస్తారు
- ఉ.4 నుంచి 4:30 వరకు సుప్రభాతం
- 4:30 నుంచి 5 వరకు బాలభోగం
- 5 నుంచి 7:15 వరకు సహస్రనామార్చన
- ఉ.7:15 నుంచి మ.12 వరకు ధర్మ, ఉభయ దర్శనాలు
- ఉ.9 నుంచి 10 వరకు సుదర్శన నారసింహ హోమం
- 10 నుంచి 12 వరకు నిత్యకల్యాణం
- మ. 12 నుంచి 12:30 వరకు స్వామి అమ్మవార్లకు నివేదన
- 12:30 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఆలయం మూసివేత
- సాయంత్రం 4 గంటల నుంచి రాత్రి 7 వరకు ధర్మ, ఉభయ దర్శనాలు
- రాత్రి 7 నుంచి 8:10 వరకు ఆరాధన, సహస్ర నామార్చనలు
- రాత్రి 8:15 నుంచి 9 వరకు ధర్మ, ఉభయ దర్శనాలు
- రాత్రి 9 నుంచి 9:30 వరకు పవళింపు సేవ, దర్శనాలు నిలిపివేత
- రాత్రి 9.30 నుంచి 10 వరకు ద్వారబంధనం, ఆలయ మూసివేత.

**విశేష పూజ**

మంగళ వారం ఆంజనేయస్వామివారికి ఆకు పూజ. ఉ.9 నుంచి ఉ.10.15 వరకు. టికెట్ ధర రూ. 216

**గదుల సమాచారం**

కొండ కింద తులసీవనంలో 100గదులు ఖాళీగా ఉన్నాయి. రూ.250 నుంచి రూ.1,700 వరకు గదులు భక్తులకు అందుబాటులో ఉన్నాయి.

# సదస్సుకు నిధులు మంజూరు చేయండి

### మైనార్టీ కమిషన్ చైర్మన్ లేఖ

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** మైనార్టీలకు సంబంధించిన అంశాలపై చర్చించేందుకు రెండు రోజులపాటు నిర్వహించే సదస్సుకు నిధులను కేటాయించాలని కోరుతూ మైనార్టీ కమిషన్ చైర్మన్ మహమ్మద్ ఖమ్రుద్దీన్ మైనార్టీ సంక్షేమశాఖ కార్యదర్శికి లేఖ రాశారు. సోమవారం మైనార్టీ కమిషన్ కార్యాలయంలో మండలి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సదస్సు నిర్వహణకు రూ.20 లక్షలు మంజూరు చేయాలని కోరారు. ఈ సమావేశంలో మైనార్టీ కమిషన్ వైస్‌చైర్మన్ శంకర్ ల్యూక్, సభ్యులు మహ్మద్ అర్షద్‌అలీఖాన్, గకట్టయ్య, విద్యాస్రవంతి, గుస్తీ నోరియా, సురేందర్‌సింగ్, ఎంఏ అజీమ్, కార్యదర్శి హరీశ్‌చందర్‌సాహు పాల్గొన్నారు.

# ఏడుపాయలకు వెళ్తూ..


### ఆరుగురు దుర్మరణం

- మెదక్ జిల్లా సంగాయిపేట శివారులో ఆర్టీసీ బస్సు-డీసీఎం వాహనం ఢీ
- మృతుల్లో ఐదుగురు మహిళలు, చిన్నారి
- మరో ప్రమాదంలో ముగ్గురు..



మెదక్ జిల్లా సంగాయిపేట శివారులో జరిగిన రోడ్డు ప్రమాదంలో నుజ్జునుజ్జయిన డీసీఎం వాహనం


**మెదక్ ప్రతినిధి, నమస్తేతెలంగాణ:** మరో పదినిమిషాల్లో ఏడుపాయల అమ్మవారి సన్నిధికి చేరుకోవాల్సి ఉండగా అంతలోనే ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఇందులో ఆరుగురు దుర్మరణం చెందగా 11 మంది గాయపడ్డారు. మృతుల్లో ఐదుగురు మహిళలు, ఓ చిన్నారి ఉన్నారు. ఈ ఘటన మెదక్ జిల్లా కొల్చారం మండలం సంగాయిపేట శివారులో సోమవారం మధ్యాహ్నం చోటుచేసుకున్నది. పోలీసుల కథనం ప్రకారం.. సంగారెడ్డి మండలం ఫసల్‌వాదికి చెందిన గొడుగు రాములు సోమవారం ఏడుపాయల దుర్గామాత సన్నిధిలో నిర్వహించే శుభకార్యానికి బంధువులతో కలిసి డీసీఎం వాహనంలో బయలుదేరారు. సంగారెడ్డి డిపోకు చెందిన ఆర్టీసీ అద్దె బస్సు మెదక్ నుంచి సంగారెడ్డి వైపు వస్తుండగా కొల్చారం మండలం సంగాయిపేట శివారులో ఎదురుగా వస్తున్న డీసీఎం వాహనాన్ని బలంగా ఢీకొట్టింది. ఈ ఘటనలో ఓ మహిళ ఎగిరి డీసీఎం టైర్ల కింద పడి నుజ్జునుజ్జు కాగా, మరో నలుగురు మహిళలు డీసీఎంలోనే దుర్మరణం చెందారు. ఓ చిన్నారి దవాఖానలో చికిత్స పొందుతూ ప్రాణాలు విడిచింది. గాయపడిన 11 మందిని మెదక్ ఏరియా దవాఖానకు తరలించారు. డీసీఎం వాహనంలో ఉన్న మరో ఎనిమిది మంది సురక్షితంగా బయటపడ్డారు. కాగా బస్సులో ఉన్నవారికి ఎలాంటి గాయాలు కాలేదు.



బాధితురాలిని ఓదారుస్తున్న కలెక్టర్ ధర్మారెడ్డి



మణెమ్మ, రజిత (ఫైల్)



మాధవి, మధురిమ (ఫైల్)

### మృతులు వీరే..

సంగారెడ్డి మండలం అంగడిపేటకు చెందిన చాపల మాధవి(40), కంది మండలం బద్రిగూడెంకు చెందిన మన్నె మంజుల(40), ఫసల్‌వాదికి చెందిన గొడుగు రజిత(45), గంజిగూడెంకు చెందిన నీరుడి దుర్గమ్మ (55), గుడాల మాణెమ్మ(55) అక్కడికక్కడే మృతి చెందారు. ఫసల్‌వాదికి చెందిన దిగ్వాల్ మధురిమ(9) మెదక్ ఏరియా దవాఖానలో చికిత్స పొందుతూ మరణించింది. కాగా కుమ్మరి జానకి, అనసూయ, యాదమ్మ, ఈశ్వరమ్మ, చందు, లక్ష్మి, సువర్ణ, శివలీల, గౌరి, లక్ష్మి, జియావుద్దీన్(డీసీఎం డ్రైవర్) గాయపడ్డారు.


### కలెక్టర్ పరామర్శ..

ప్రమాదం జరిగిన విషయం తెలిసిన వెంటనే మెదక్ కలెక్టర్ ధర్మారెడ్డి ఏరియా దవాఖానకు వెళ్లి క్షతగాత్రులను పరామర్శించారు. మార్చురీలో ఉన్న మృతదేహాలను పరిశీలించి, బాధిత కుటుంబాలను ఓదార్చారు. ఆర్టీసీ అద్దె బస్సు డ్రైవర్ నిర్లక్ష్యం వల్లే ఈ ప్రమాదం జరిగిందని డీసీఎంలో ఉన్న వారు ఆరోపించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

### మంత్రులు హరీశ్, పువ్వాడ దిగ్భ్రాంతి

మెదక్ జిల్లా సంగాయిపేట శివారులో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆరుగురు దుర్మరణం చెందడంపట్ల ఆర్థిక శాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు, రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మెదక్ కలెక్టర్ ధర్మారెడ్డితో ఫోన్‌లో మాట్లాడిన మంత్రి హరీశ్‌రావు ప్రమాదం జరిగిన తీరును తెలుసుకున్నారు. క్షతగాత్రులకు మెరుగైన చికిత్స అందేలా చూడాలని ఆదేశించారు. ప్రమాదంలో మరణించిన బాధిత కుటుంబాలను, క్షతగాత్రులను ఆదుకుంటామని మంత్రి పువ్వాడ హామీ ఇచ్చారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందేలా చర్యలు తీసుకోవాలని ఆర్టీసీ అధికారులను ఆదేశించారు.

## నార్సింగి వద్ద ముగ్గురు..



వీరవాణి కృష్ణ , అంజయ్య, పిట్ల కిష్టయ్య (ఫైల్)

**మెదక్ జిల్లా** రామాయంపేట సర్కిల్ పరిధిలోని నార్సింగి జాతీయ రహదారి వద్ద ఆదివారం అర్ధరాత్రి లారీ-ఓమ్నీ వ్యాన్ ఢీకొనడంతో ముగ్గురు దుర్మరణం చెందారు. రామాయంపేట సీఐ నాగార్జునగౌడ్ కథనం ప్రకారం.. రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండలం దమ్మన్నపేటకు చెందిన వీరవాణి కృష్ణ తన తోడల్లుడు రవి దుబాయ్‌కి వెళ్తున్నాడు. కృష్ణ తన స్నేహితుడి ఓమ్నీ వ్యాన్ తీసుకొని మాచారెడ్డి నుంచి హైదరాబాద్ శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు వెళ్లి రవికి వీడ్కోలు పలికి తిరుగు ప్రయాణమయ్యారు. ఈ వ్యాన్‌లో ఐదుగురు ఉన్నారు. నార్సింగి శివారుకు రాగానే జాతీయ రహదారి పక్కన ఆగి ఉన్న లారీని వెనుక నుంచి వ్యాన్ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో వీరవాణి కృష్ణ(28), కామారెడ్డి జిల్లా మాచారెడ్డికి చెందిన పిట్ల కిష్టయ్య(60), అంజయ్య(25)లు అక్కడికక్కడే దుర్మరణం చెందారు. కావ్య, అజయ్‌లకు తీవ్రగాయాలు కాగా రామాయంపేట దవాఖానకు తరలించారు.

# డ్రోన్ కేసు క్వాష్ పిటిషన్లపై విచారణ

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** డ్రోన్ కెమెరా కేసులో ఏ2గా ఉన్న రేవంత్‌రెడ్డి సోదరుడు అనుముల కృష్ణారెడ్డి, ఏ4గా ఉన్న పోరెడ్డి విజయపాల్‌రెడ్డిపై తీవ్ర చర్యలు తీసుకోవద్దని సైబరాబాద్ పోలీసులకు హైకోర్టు ఆదేశాలు జారీచేసింది. నార్సింగి పోలీస్‌స్టేషన్‌లో నమోదైన డ్రోన్ కెమెరా కేసులో పరారీలో ఉన్న వీరు హైకోర్టులో క్వాష్ పిటిషన్లు దాఖలుచేశారు. తమను అరెస్ట్ చేయరాదని, తమపై నమోదైన ఎఫ్‌ఐఆర్‌ను కొట్టేయాలని విజ్ఞప్తిచేశారు. వీటిపై సోమవారం విచారణ చేపట్టిన జస్టిస్ శ్రీదేవి ధర్మాసనం.. నిందితులపై తీవ్ర చర్యలు చేపట్టరాదని సూచించింది. ఇదే కేసులో ఏ1గా ఉన్న ఎంపీ రేవంత్‌రెడ్డి ఇప్పటికే జ్యుడీషియల్ రిమాండ్‌లో ఉన్నారు. రేవంత్‌రెడ్డి దాఖలుచేసిన బెయిల్, క్వాష్ పిటిషన్లు మంగళవారం విచారణకు రావాల్సి ఉన్నాయి. కరోనా వైరస్ వ్యాప్తి నేపథ్యంలో మంగళవారం కోర్టు విచారణ లేకపోవడంతో మరుసటిరోజు ఈ కేసులు విచారణకు వచ్చే అవకాశాలున్నాయి.

## హైదరాబాద్-పుణె రైలు రాకపోకల్లో మార్పులు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** హైదరాబాద్-పుణె ట్రైవీక్లీ ఎక్స్‌ప్రెస్ రాకపోకల్లో రైల్వే బోర్డు మార్పులు చేసింది. రైలు ఆది,బుధ, శుక్రవారాల్లో హైదరాబాద్ నుంచి వెళ్తుంది. పుణె నుంచి హైదరాబాద్‌కు సోమ, గురు, శనివారాల్లో బయల్దేరుతుంది. ఏప్రిల్ 1 నుంచి ఇది అమలులోకి వస్తుందని దక్షిణ మధ్య రైల్వే సోమవారం తెలిపింది.



సోమవారం హైదరాబాద్‌లో రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు వినోద్‌కుమార్‌ను కలిసి పుష్పగుచ్ఛం అందజేస్తున్న మేదరి కులస్థులు

# మేదరులకు ప్రభుత్వం అండ

### ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు వినోద్‌ను కలిసిన కులసంఘ ప్రతినిధులు

**హైదరాబాద్,నమస్తేతెలంగాణ:** మేదరులకు ప్రభుత్వం అన్ని రకాలుగా అండగా ఉంటుందని రాష్ట్ర ప్రణాళికాసంఘం ఉపాధ్యక్షుడు వినోద్‌కుమార్ పేర్కొన్నారు. సోమవారం మినిస్టర్స్ క్వార్టర్స్‌లో మేదర కులస్థులు వినోద్‌కుమార్‌ను కలిసి తమ సమస్యలను విన్నవించారు. స్పందించిన ఆయన అటవీశాఖ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డికి లేఖరాసి మేదరుల సమస్యలు పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. వెదురు ముడిసరుకును రాయితీపై అందించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. వృత్తి నైపుణ్య శిక్షణ అవసరమన్నారు. వినోద్‌కుమార్‌ను కలిసిన ప్రతినిధి బృందంలో మేదర సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కే వెంకట్రాముడు, ప్రధాన కార్యదర్శి మురళీకృష్ణ తదితరులు ఉన్నారు.



ములుగులో మాట్లాడుతున్న డీజీపీ మహేందర్‌రెడ్డి

# పోలీసులు అప్రమత్తంగా ఉండాలి

- మావోయిస్టుల కదలికల నేపథ్యంలో
- డీజీపీ మహేందర్‌రెడ్డి ఆదేశం

**ములుగు జిల్లా ప్రతినిధి, నమస్తేతెలంగాణ/భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, నమస్తే తెలంగాణ:** ములుగు, జయశంకర్ భూపాలపల్లి జిల్లాల్లో మావోయిస్టు కార్యకలాపాలను నియంత్రించాలని డీజీపీ మహేందర్‌రెడ్డి పోలీస్ అధికారులను ఆదేశించారు. ములుగు జిల్లా కేంద్రంలోని పోలీస్‌కార్యాలయంలో రెండు జిల్లాల అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. అంతకుముందు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా లక్ష్మీదేవిపల్లిలోని సింగరేణి గెస్ట్‌హౌస్‌లో మహబూబాబాద్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల పోలీస్ అధికారులతో సమీక్షించారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. మేడారం జాతర నిర్వహణలో పోలీసు అధికారులు అంకితభావంతో పనిచేశారని కొనియాడారు. ఫిర్యాదుదారులతో స్నేహపూర్వకంగా వ్యవహరించాలని కోరారు. విచారణలో రాజీపడకుండా చిత్తశుద్ధితో పనిచేయాలని సూచించారు. మావోయిస్టులు తెలంగాణలోకి ప్రవేశించారనే సమాచారం ఉన్నదన్నారు. ఈ నేపథ్యంలో ఏజెన్సీ ప్రాంతాల్లో పోలీసులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఆయా కార్యక్రమాల్లో ఓఎస్డీలు సురేశ్‌కుమార్, శోభన్‌కుమార్, గ్రేహౌండ్స్ అదనపు డీజీ కొత్తకోట శ్రీనివాస్‌రెడ్డి, నార్త్ జోన్ ఐజీ నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# స్వగ్రామానికి ప్రేమయ్య మృతదేహం

- ఇటీవల దుబాయ్‌లో మృతి
- మంత్రి కేటీఆర్, ఎమ్మెల్సీ సుభాష్‌రెడ్డి చొరవతో ఐదు రోజుల్లో ఇంటికి

**హవేళిఘనపూర్:** ఇటీవల దుబాయ్‌లో మృతి చెందిన మెదక్ జిల్లా హవేళిఘనపూర్ మండలం బూర్గుపల్లికి చెందిన ప్రేమయ్య మృతదేహాన్ని సోమవారం స్వగ్రామానికి తీసుకొచ్చారు. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. బూర్గుపల్లికి చెందిన మరెల్లి ప్రేమయ్య(40) 19 రోజుల క్రితమే బతుకుదెరువు కోసం దుబాయ్ వెళ్లాడు. ఈనెల 11న తాను ఉంటున్న బిల్డింగ్‌పై బట్టలు ఆరవేస్తుండగా ప్రమాదవశాత్తు కిందపడి తీవ్రంగా గాయపడ్డాడు. తోటికార్మికు లు గమనించి దవాఖానకు తరలిస్తుండగా ప్రాణాలు కోల్పోయాడు. మృతదేహాన్ని స్వదేశానికి తీసుకొచ్చేందుకు కుటుంబసభ్యులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. దీంతో ఎమ్మెల్సీ సుభాష్‌రెడ్డి చొరువ తీసుకొని మంత్రి కేటీఆర్ సహకారంతో విదేశాంగ అధికారులతో మాట్లాడి మృతదేహాన్ని స్వగ్రామానికి తీసుకొచ్చేందుకు ఏర్పాట్లు చేశారు. ప్రేమయ్యకు భార్య సుశీల, కుమార్తె యశోద ఉన్నారు.

# పసుపు రైతుల పోరుబాట

- మెట్‌పల్లిలో బైఠాయింపు

**మెట్‌పల్లి, నమస్తేతెలంగాణ/మెట్‌పల్లి టౌన్:** పసుపు రైతులు పోరుబాట పట్టారు. పసుపుబోర్డు ఏర్పాటు చేయాల్సిందేనంటూ ముక్తకంఠంతో నినదించారు. పార్లమెంట్ ఎన్నికల్లో బోర్డు ఏర్పాటుకు హామీ ఇచ్చి.. విస్మరించిన నిజామాబాద్ ఎంపీ అర్వింద్ వెంటనే పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. జగిత్యాల జిల్లా మెట్‌పల్లి, ఇబ్రహీంపట్నం, మల్లాపూర్, కోరుట్ల మండలాలకు చెందిన పసుపు రైతులు సోమవారం పెద్ద ఎత్తున మెట్‌పల్లికి తరలివచ్చి ఆందోళనకు దిగారు. స్థానిక వ్యవసాయ మార్కెట్‌యార్డు నుంచి ర్యాలీగా బయలుదేరి జాతీయ రహదారి మీదుగా పాత బస్టాండ్‌కు చేరుకుని, బైఠాయించారు. పసుపు క్వింటాల్‌కు రూ.15వేలు మద్దతు ధర ప్రకటించాలని కోరారు. పసుపు పంటను మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేయాలని, నిల్వలకోసం కోల్డ్‌స్టోరేజీలు ఏర్పాటు చేయాలన్నారు. రైతుల నిరసనతో సుమారు రెండు గంటలపాటు ట్రాఫిక్ స్తంభించింది. పోలీస్ అధికారులు జోక్యం చేసుకుని రైతులను సముదాయించే ప్రయత్నం చేశారు. సబ్‌కలెక్టర్ కార్యాలయ డీఏవో అక్కడికి వచ్చి.. రైతుల నుంచి వినతిపత్రం స్వీకరించడంతో ఆందోళన విరమించారు.

# సిలిండర్‌పేలి తల్లీకొడుకుల సజీవదహనం

### పెద్దపల్లి జిల్లా దొంగతుర్తిలో ఘటన




ధ్వంసమైన ఇంటిపైకప్పు

**ధర్మారం:** వంట గ్యాస్ సిలిండర్ పేలి తల్లీకొడుకులు సజీవ దహనమైన ఘటన పెద్దపల్లి జిల్లా ధర్మారం మండలం దొంగతుర్తిలో సోమవారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. ధర్మారం ఏఎస్ఐ రవికుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. దొంగతుర్తికి చెందిన గొట్టె నారాయణ, యశోద(45) దంపతులకు కొడుకు రాహుల్ (18), కూతురు రాణి ఉన్నారు. కొడుకు ధర్మారం మండల కేంద్రంలో ఇంటర్ ప్రథమ సంవత్సరం, కూతురు రామగుండం గురుకులంలో ఎనిమిదో తరగతి చదువుతుంది. కాగా, సోమవారం రాత్రి తల్లీ కొడుకులు యశోద, రాహుల్ వంటగదిలో నిద్రిస్తుండగా, నారాయణ మరో గదిలో పడుకున్నాడు. సోమవారం అర్ధరాత్రి 12 గంటలు దాటిన తర్వాత ఇంట్లోని గ్యాస్ సిలిండర్ లీకై ప్రమాదశాత్తు పేలింది. దీంతో అదే గదిలో నిద్రిస్తున్న తల్లీకొడుకులు సజీవ దహనమయ్యారు. కాగా, ఇంటి పైకప్పు పూర్తిగా ధ్వంసమైంది. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. సమాచారం తెలియడంతో పెద్దపల్లి నుంచి అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలను ఆర్పివేశారు.

## వడ్డీరేట్ల కోతలు!

- కరోనా నేపథ్యంలో ఆర్బీఐ సంకేతాలు
- యెస్ బ్యాంక్‌కు అండగా ఉంటాం: దాస్



**ముంబై, మార్చి 16:** కరోనా వైరస్ విజృంభిస్తున్న నేపథ్యంలో వడ్డీరేట్లను తగ్గిస్తామన్న సంకేతాలను ఇచ్చింది రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ). ఏప్రిల్ ద్రవ్య సమీక్షలో కోతలకు అవకాశాలున్నాయన్న రీతిలో ఆర్బీఐ గవర్నర్ శక్తికాంత దాస్ వ్యాఖ్యానించారు. దేశీయ స్టాక్ మార్కెట్ల భారీ పతనం, యెస్ బ్యాంక్ సంక్షోభం, భారత ఆర్థిక వ్యవస్థ మందగమనం మధ్య సోమవారం దాస్ విలేకరులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఎలాంటి ఆర్థిక విపత్తులనైనా ఎదుర్కొనే సత్తా ఆర్బీఐకి ఉందన్నారు. అందుకు తగిన విధాన నిర్ణయాలు ఆర్బీఐ తీసుకోగలదని చెప్పారు. వచ్చే ఆర్థిక సంవత్సరం (2020-21) తొలి ద్వైమాసిక ద్రవ్యపరపతి విధాన సమీక్ష ఫలితం ఏప్రిల్ 3న విడుదల కానున్నది. దీంతో 50 బేసిస్ పాయింట్లు తగ్గించాలని వ్యాపార, పారిశ్రామిక సంఘం సీఐఐ డిమాండ్ చేస్తున్నది. కాగా, రెపో రేటును 5.15 శాతం వద్దే ఎందుకు ఉంచుతున్నారన్న ప్రశ్నకు బదులిస్తూ అది మానిటరీ పాలసీ కమిటీ నిర్ణయమన్నారు. ఇదిలావుంటే బ్యాలెన్స్ షీట్లు, ఆస్తులపై కరోనా వైరస్ ప్రభావాన్ని అంచనా వేయాలంటూ బ్యాంకులు, ఆర్థిక సంస్థలకు ఆర్బీఐ సూచించింది. యెస్ బ్యాంక్‌కు ఆర్బీఐ అన్ని రకాలుగా అండగా ఉంటుందన్న దాస్.. బ్యాంక్ పునరుద్ధరణ ప్రణాళికాబద్ధంగా జరుగుతున్నదని వివరించారు. ఈ నెల 18 సాయంత్రం మారటోరియం ఎత్తివేస్తామన్నారు. ఇక 18నే రూ.25వేల కోట్ల కోసం 5 విడుత లాంగ్ టర్మ్ రెపో ఆపరేషన్స్ (ఎల్టీఆర్వో)ను చేపట్టనున్నది ఆర్బీఐ.


తెలంగాణ ప్రభుత్వము
రెవెన్యూ (భూ సేకరణ) శాఖ
జిల్లా కలెక్టర్ సిద్దిపేట గారి కార్యాలయం
ఫారం -VII
(చట్టం 30/2013 యొక్క సెక్షన్ -19(1) మరియు రూల్ -25 యొక్క సబ్ రూల్ (1) ప్రకారం)
కలెక్టర్/సంయుక్త కలెక్టర్/స్పెషల్ కలెక్టర్(భూసేకరణ)/స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ (భూసేకరణ) తుది ప్రకటన

ఎ1/457/2019
ఫైలు నెం.ఎఫ్/2-ప్రభుత్వ భూమి/2019 తేదీ: 27-02-2020

తెలంగాణ ప్రభుత్వం/జిల్లా కలెక్టర్, నల్లగొండ వారి ఆదేశానుసారం నల్లగొండ జిల్లా, బ్రాహ్మణపల్లి గ్రామము, డిండి మండలం విస్తీర్ణం ఎ.32.01 గుంటల భూమి ప్రజా ప్రయోజనార్థం డిండి లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టులో భాగంగా సింగరాజుపల్లి రిజర్వాయర్ డి.ఎల్.ఐ.యస్ కొరకై ఈ దిగువ చూపిన భూమి అవసరము అయి ఉన్నదని భావించినారు.
కావున ఈ ప్రాజెక్టు క్రింద నల్లగొండ జిల్లా, బ్రాహ్మణపల్లి గ్రామము, డిండి మండలం, విస్తీర్ణం: 32.01 గుంటల భూమి ఈ క్రింద చూపిన విధముగా భూసేకరణ నిమిత్తం ప్రకటన రూఢీ జారీచేయనైనది.

షెడ్యూల్
గ్రామం: బ్రాహ్మణపల్లి | మండలం: డిండి | జిల్లా: నల్లగొండ
విస్తీర్ణం: 32.01

| క్ర.సం. | సర్వే నెం.భూమి స్వరూపము విస్తీర్ణము ఎ.గుం.లు | పట్టా కలిగి వున్న విస్తీర్ణం ఎ.గుం.లు | పట్టా లేకుండ అనుభవములో ఉన్న విస్తీర్ణం | పట్టాదారు/అనుభవదారు పేరు మరియు తండ్రి / భర్తపేరు | చెట్లు / కట్టడములు |
|---|---|---|---|---|---|
| 1 | 2 | 3 | 4 | 5 | 6 |
| 1 | 179 | 5.11 | - | ఎలిమినేటి హుస్సేన్ తండ్రి: లక్ష్మయ్య | 5 తాటిచెట్లు 3 నిమ్మ చెట్లు 1 బోర్లు మరియు పైపులైన్ |
| 2 | 179 | 4.01 | - | ఎలిమినేటి పుల్లమ్మ భర్త: లక్ష్మయ్య | 1 బోరు మరియు పైపులైన్ |
| 3 | 179 | 4.39 | - | నక్క బాలమ్మ భర్త: పెద్ద లింగయ్య | - |
| 4 | 179 | 4.10 | - | ఎలిమినేటి వెంకటయ్య తండ్రి: రాములయ్య | - |
| 5 | 179 | 2.00 | - | వడ్లకొండ తిరుపతమ్మ భర్త: కృష్ణయ్య | - |
| 6 | 179 | 3.20 | - | ఎలిమినేటి గెల్వమ్మ భర్త: కృష్ణయ్య | - |
| 7 | 179 | - | 0.10 | వడ్లకొండ వెంకటయ్య భర్త: బలరాం | - |
| 8 | 179 | - | 1.20 | వడ్లకొండ చిన్నలింగయ్య భర్త: బలరాం | - |
| 9 | 179 | 0.08 | - | కదారి కృష్ణయ్య తండ్రి: చిన్న లింగయ్య | - |
| 10 | 179 | 1.20 | - | శ్రీపతి పర్వతాలు తండ్రి: [illegible] | - |
| 11 | 179 | - | 0.20 | పాసుగోటి గోవర్ధన్ రావు తండ్రి: నారాయణరావు | - |
| 12 | 179 | - | 0.13 | గుండెబోయిన వెంకటయ్య తండ్రి: బాలయ్య | - |
| 13 | 179 | - | 0.21 | జంతుక రామచంద్రం తండ్రి: మల్లయ్య | - |
| 14 | 179 | - | 3.00 | పాసుగోటి విజయ చందర్ తండ్రి: గోవర్ధన్ | - |
| 15 | 179 | 0.08 | - | కదారి పర్వతాలు తండ్రి: [illegible] | - |
| మొత్తం విస్తీర్ణము | | 25.37 | 6.04 | | |

సెక్షన్ 15( కేంద్ర చట్టం 30/2013) క్రింద భూసేకరణ పై వచ్చిన అభ్యంతరాలను పరిశీలించిన పిదప ఇట్టి ప్రకటన (డిక్లరేషన్) జారీ చేయనైనది. భూసేకరణ తల పెట్టిన భూమిలో, బొగ్గు, ఇనుము, స్లేట్ మరియు ఇతర ఖనిజములు ఇట్టి భూములలో లేదా కొంత భాగములో లభ్యమైనచో, ఖనిజాలు ప్రాజెక్టు నిర్మాణమునకు ఉపయోగమున్న పక్షములో, వాటిని స్వీకరించబడును లేనిచో స్వీకరించబడవు. పైన భూమిని భూసేకరణ చేయు భూముల యొక్క నమూనా ప్రత్యేక ఉప కలెక్టరు, ఎ.యం.ఆర్. ప్రాజెక్టు, యూనిట్-2, నల్లగొండ నందు కార్యాలయపు పనివేళలందు చూసుకోనవచ్చును.

ప్రత్యేక ఉపకలెక్టరు (భూ.సే), ఎ.యం.ఆర్.పి.యూనిట్-2 నల్లగొండ | అదనపు కలెక్టర్ నల్లగొండ | జిల్లా కలెక్టర్ నల్లగొండ

DIPR Ro.No.1422/LA/PP/Agency/2019-20



తెలంగాణ ఫుడ్స్
(తెలంగాణ ప్రభుత్వ యాజమాన్య సంస్థ)
Ref No. TF/HRD/1109/Tenders/2020-21 టెండరు ప్రకటన తేదీ: 14-03-2020
1. దిగువ పనుల కోసం తెలంగాణ ఫుడ్స్, IDA నాచారం వద్ద మ్యాన్‌పవర్ సరఫరా. i) క్యాంటీన్, హౌస్ కీపింగ్, డ్రైవర్స్ పని కోసం, మెటీరియళ్ళ సేకరణ మరియు వేరుచేయుట, కసురు (ధాన్యాలు/పిండి) ముడి సరుకులు అంతర్గత షిఫ్టింగ్, ముడి సరుకు అన్‌లోడింగ్, ఫినిష్డ్ ఫుడ్ లోడింగ్, మెట్రిక్ టన్ను ప్రాతిపదికన అవసరమైన ప్రొడక్షన్ మ్యాన్‌పవర్. ii) వివిధ సెక్షన్లలో పనికి అధిక నైపుణ్యాలు, నైపుణ్యత, అర్ధ నైపుణ్యత & నైపుణ్యం లేని వారు కావలెను. బిడ్ దాఖలు ముగింపు తేదీ, సమయం: 31-03-2020న సా. 5.00 గం. గమనిక: నియమ నిబంధనలు, స్పెసిఫికేషన్లు మొదలగువాటితో పూర్తి టెండరు ప్రకటన మరియు టెండరు షెడ్యూలును వెబ్‌సైట్ http://tender.telangana.eprocurement.gov.in నుండి డౌన్‌లోడ్ చేసుకోవచ్చును.
DIPR RO.No. 911PP/CL/Advt/1/2019-20, Dt: 16-03-2020 సం/- మేనేజర్ (HRD)



తెలంగాణ ప్రభుత్వం
సూపరింటెండింగ్ ఇంజినీర్ కార్యాలయం, PR రీజియన్, వరంగల్
టెండర్ ప్రకటన
NIT No. 111, 115, 117, 123, 124, 126, 127, 131, 136/19-20 తేదీ: 17-02-2020
**పనుల సంఖ్య:** 09, పనుల పేరు : దిగువ సంతకందారు పరిధిలో తరిగొప్పుల (మం||)లో ప్యాకేజ్ నం. JNG/BTR/05 (02. పనులు), లింగాల ఘన్‌పూర్ & రఘునాథ్‌పల్లి (మం)లో ప్యాకేజ్ నం. JNG/BTR/07 (05 పనులు), నల్లబెల్లి (మం)లో ప్యాకేజ్ నం. WLR/BTR/06 (03 పనులు), పర్వతగిరి (మం)లో ప్యాకేజ్ నం. WLR/BTR/07 (04 పనులు) మరియు ఇతర సివిల్ పనులు. మొత్తం ECV:రూ. 18.63 కోట్లు. బిడ్ దాఖలు ప్రారంభ తేదీ మరియు ముగింపు తేదీ: 20-03-2020న రా. 9.00గం. నుండి 27-03-2020న మ. 3.00గం.వరకు. తదుపరి వివరాలకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ మార్కెట్‌ప్లేస్ https://tender.telangana.gov.inను దర్శించండి. ఫోన్ నం. 0870-2578114.
సం/- సూపరింటెండింగ్ ఇంజినీర్, PR రీజియన్, వరంగల్
DIPR RO. No. 2656-DP/CL/Advt/1/2019-20, Dt: 16/03/2020



తెలంగాణ ప్రభుత్వం
చీఫ్ ఇంజినీర్-II కార్యాలయం, మిషన్ భగీరథ శాఖ, హైదరాబాద్
e-proc. Notice No. 22/CE-II/MB/2020, ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు ప్రకటన తేదీ: 13-03-2020
**పని పేరు:** దిగువ సంతకందారు పరిధిలోని వరంగల్ జిల్లాలో 17 మండలాలు మరియు పాలేరు సెగ్మెంట్ నుండి ఖమ్మం జిల్లాలో 1 మండలానికి ''త్రాగునీటి సరఫరా ఏర్పాటు చేయు'' ప్రధాన పని క్రింద ప్రహరీ గోడతోసహా డోర్నకల్ వద్ద G+1 కార్యాలయ భవనం నిర్మాణం. ECV: రూ. 67.00 లక్షలు. ఇ-ప్రొక్యూర్‌మెంట్ మార్కెట్‌లో టెండరు డాక్యుమెంట్ల లభ్యత: 20-03-2020 నుండి 03-04-2020న మ|| 3.00 గం|| వరకు. సాంకేతిక బిడ్ తెరుచు తేదీ: 03-04-2020న సా|| 4.00 గం. ఆర్థిక బిడ్ తెరుచు తేదీ: 07-04-2020న ఉ|| 11.30 గం. తదుపరి వివరాలను ఇ-ప్రొక్యూర్‌మెంట్ మార్కెట్ ప్లేస్: https://tender.telangana.gov.in నుండి పొందవచ్చును. ఫోన్ నెం: 9100122213.
DIPR RO.No. 2657-DP/CL/ADVT/1/2019-20, Dt: 16-03-2020 సం/- చీఫ్ ఇంజినీర్-II, MB, హైదరాబాద్



శ్రీ రాజ రాజేశ్వర స్వామి దేవస్థానము, వేములవాడ: రాజన్న సిరిసిల్ల జిల్లా:
షార్ట్ టెండర్ నోటిఫికేషన్ (మూడవ పిలుపు)
ఆర్.సి.నం.బి4/1293/2019 తేదీ: 12-03-2020
దేవస్థానమునకు చెందియున్న ఈ క్రింది అంశములను తేదీ: 01/04/2020 నుండి తేదీ: 31/03/2022 వరకు రెండు సంవత్సరముల (02) కాలం పాటు లీజుకు/ లైసెన్సుకు ఇచ్చుటకు గాను ఇ-టెండర్-పేపర్ టెండర్-కం-బహిరంగవేలము నిర్వహించబడును. 1) దేవస్థానం రెండు కళ్యాణకట్టల యందు భక్తులు సమర్పించే తలనీలాలు ప్రోగుచేసుకొను లైసెన్సు హక్కు. 2) శ్రీ స్వామివారి ఆలయము నందు భక్తులు సమర్పించు కొబ్బరి ముక్కలు ప్రోగుచేసుకొను లైసెన్సు హక్కు. 3) దేవస్థానం టి.టి.డి. భవనము ఖాళీ స్థలము నందు పార్కింగ్ ప్లేసును నిర్వహించు లీజు హక్కు. 4) శ్రీ స్వామివారి ఆలయము మరియు అనుబంధ ఆలయములకు వచ్చు భక్తుల పాదరక్షలు భద్రపరచు లీజు హక్కు. పై అంశములకు బహిరంగ వేలము జరుగు తేదీ: 28/03/2020. ఆసక్తి గలవారు htpps://tender.telangana.gov.in నకు లాగ్ ఆన్ చేసి పూర్తి వివరములు పొందవచ్చును. అట్లే దేవస్థానం లీజుల విభాగము నందు కూడా పూర్తి వివరములు తెలుసుకొనవచ్చును. పూర్తి వివరములకై సంప్రదించవలసిన ఫోన్ నంబర్లు: 9490525578, 8121269879 & 9963607403.
DIPR RO No.909-PP/CL/Advt/1/2019-20, Dt: 16/3/2020 సం/- కార్యనిర్వహణాధికారి (ఎఫ్.ఎ.సి.)
(2018-2020 సం.నందు 9,00,000 మంది భక్తులు దేవస్థానం కల్యాణకట్టల యందు తలనీలాలు సమర్పించినారు)



తెలంగాణ ప్రభుత్వం
SE కార్యాలయం, నీటిపారుదల వలయం, మహబూబ్‌నగర్
ఇ-ప్రొక్యూర్‌మెంట్ ప్రకటన
T.N. No. 12, 13/2019-20, తేదీ: 27-01-2020, T.N. No. 28, 29, 30/2019-20, తేదీ: 10-03-2020.
పనుల సంఖ్య: (5), **పనుల పేరు:** దిగువ సంతకందారు పరిధిలో చిన్న నీటిపారుదల - నాగర్‌కర్నూల్ జిల్లా, తాడూర్ (మం), పాపగల్ గ్రామం, డెయిరీ ఫామ్ దగ్గర దుందుబి వాగుపై చెక్‌డ్యామ్ నిర్మాణం, నాగర్‌కర్నూల్ జిల్లా, తాడూర్ (మం), సిర్సవాడ గ్రామం వద్ద దుందుబి వాగుపై చెక్‌డ్యామ్ నిర్మాణం, నాగర్‌కర్నూల్ జిల్లా, తిమ్మాజీపేట (మం), నేరెళ్లపల్లి గ్రామం వద్ద దుందుబి వాగుపై చెక్‌డ్యామ్ నిర్మాణం, మహబూబ్‌నగర్ జిల్లా, మిడ్జిల్ (గ్రా&మం), వెల్‌గోముల శివారు సమీపాన మున్ననూర్ వాగుపై చెక్‌డ్యామ్ నిర్మాణం, మహబూబ్‌నగర్ జిల్లా, మిడ్జిల్ (మం), అయ్యవారిపల్లి గ్రామం సమీపాన అయ్యవారిపల్లి వాగుపై (డిండి వాగు) చెక్‌డ్యామ్ నిర్మాణం. **మొత్తం ECV: రూ. 2.57 కోట్లు**. టెండర్ల స్వీకరణకు ఆఖరి తేదీ, సమయం: 24-03-2020న సా|| 5.00 గం. తదుపరి వివరాలను ఇ-ప్రొక్యూర్‌మెంట్ మార్కెట్ ప్లేస్ www.tender.telangana.gov.inలో చూడవచ్చును. ఫోన్ నం: 9177306253, 7093604056.
సం/- సూపరింటెండింగ్ ఇంజినీర్, నీటిపారుదల వలయం, మహబూబ్‌నగర్
DIPR RO.No. 918-PP/CL/ADVT/1/2019-20, Dt: 16-03-2020



SIRCILLA MUNICIPALITY
GOVERNMENT OF TELANGANA
TEL NO. 08723-230482, Email: mcsrcl2007@yahoo.co.in
Website: http://sircillamunicipality.telangana.gov.in
No. RFP/597/2019-20 Dt: 16-03-2020
Request For Proposal
Proposals are invited from Public Limited/Private Limited Companies who have adequate experience and adequate financial strength for **" Design supply, installation, operation (&) maintenance of Smart Integrated Washrooms including rehabilitation of existing public toilet block (if any) on Design, Build, Finance, Operate & Transfer (DBFOT) basis"** at 15 locations in Sircilla Municipality as per terms and conditions laid down in the RFP. Details can be obtained from our website http://sircillamunicipality.telangana.gov.in
RFP document is available on above site from : sircillamunicipality.telangana.gov.in
Last date of submission of bid document on : 21-03-2020
Commissioner, Sircilla Municipality reserves the right to accept or reject any proposal or all the offers without assigning any reason.
Sd/- **Commissioner,** Sircilla Municipality.





# నష్టపుటేరులు

**స్టాక్ మార్కెట్లలో సీన్ రిపీటైంది. ఈ నెల 9న, 12న ఏం జరిగిందో.. సోమవారమూ అదే జరిగింది. మాయదారి కరోనా మళ్లీ ముంచింది. మదుపరుల భయాల మధ్య దేశీయ ఈక్విటీ మార్కెట్లలో నష్టపుటేరులు పారాయి. ప్రపంచాన్ని వణికిస్తున్న ఈ ప్రాణాంతక వైరస్ దెబ్బకు మరోసారి షేర్ బజార్.. బేజారైంది. అమెరికా ఫెడరల్ రిజర్వ్ బ్యాంక్ మరో దఫా ఆకస్మిక వడ్డీరేట్ల కోత కూడా మార్కెట్ సెంటిమెంట్‌ను గాయపరిచింది. పైగా ఆసియా, ఐరోపా అంతర్జాతీయ మార్కెట్లన్నీ నష్టాల్లోనే కదలాడుతుండటం పరిస్థితుల్ని మరింతగా దిగజార్చింది. దీంతో శుక్రవారం భీకర నష్టాల నుంచి తేరుకుని లాభాలను అందుకున్న సూచీలు.. సోమవారం తిరిగి అమ్మకాల ఒత్తిడికి లోనైయ్యాయి.**

**ముంబై, మార్చి 16:**

ఉదయం మొదలైన అర గంటలోనే సెన్సెక్స్ 1,851 పాయింట్లు, నిఫ్టీ 524.85 పాయింట్లు పడిపోయాయి. సమయం గడుస్తున్నకొద్దీ ఈ నష్టాలు మరింత పెరిగాయి. చివరకు బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ (బీఎస్ఈ) సూచీ సెన్సెక్స్ 2,713.41 పాయింట్లు లేదా 7.96 శాతం పతనమై 31,390.07 వద్ద స్థిరపడగా, 30 నెలల కనిష్ఠాన్ని తాకింది. నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ (ఎన్ఎస్ఈ) సూచీ నిఫ్టీ 757.80 పాయింట్లు లేదా 7.61 శాతం క్షీణించి 9,200 మార్కుకు దిగువన 9,197.40 వద్ద నిలిచి, మూడేండ్ల దిగువకు చేరింది. అంతేగాక భారతీయ స్టాక్ మార్కెట్ల చరిత్రలోనే ఇది రెండో అతిపెద్ద పతనంగా నమోదైంది. గత గురువారం సెన్సెక్స్ 2,919.26 పాయింట్లు, నిఫ్టీ 868.25 పాయింట్లు కోల్పోయిన విషయం తెలిసిందే. మరుసటి రోజు శుక్రవారం కూడా తీవ్ర ఒడిదుడుకుల మధ్య ఓ దశలో సెన్సెక్స్ 3,213 పాయింట్లు, నిఫ్టీ 966 పాయింట్ల మేర నష్టపోయాయి. దీంతో 12 ఏండ్ల తర్వాత ట్రేడింగ్‌ను 45 నిమిషాలపాటు నిలిపివేయాల్సిన దుస్థితి ఏర్పడింది. తిరిగి ఆరంభమైన తర్వాత సూచీలు కోలుకోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. కానీ రెండు రోజుల సెలవుల అనంతరం సోమవారం మొదలైన మార్కెట్లు.. మళ్లీ నష్టాల పాటే పాడాయి. అయితే రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) వచ్చే నెల ద్రవ్యసమీక్షలో కీలక వడ్డీరేట్లను తగ్గించనుందన్న అంచనాలు మార్కెట్లలో వినిపించాయి. అయినప్పటికీ కరోనా భయాల మధ్య ఈ ఊహాగానాలు నిలబడలేకపోయాయి.

### 7.62 లక్షల కోట్లు హాంఫట్

**స్టాక్** మార్కెట్ల భీకర నష్టాల మధ్య మదుపరుల సంపద సోమవారం రూ.7.62 లక్షల కోట్లు కరిగిపోయింది. బీఎస్ఈలోని సంస్థల మార్కెట్ విలువ ఈ ఒక్కరోజే రూ.7,62,290.23 కోట్లు హరించుకుపోయి రూ.1,21,63,952.59 కోట్లకు పడిపోయింది. మార్చి 9, 12 తేదీల్లో వాటిల్లిన నష్టాలతో కలిపితే ఈ మూడు రోజుల్లో మదుపరుల సంపద ఏకంగా రూ.25 లక్షల కోట్లకు పైగా ఆవిరైపోవడం గమనార్హం. సెన్సెక్స్ 7,500 పాయింట్లు కోల్పోయింది మరి. మరోవైపు భారత అపర కుబేరుడు ముకేశ్ అంబానీకి కరోనా దెబ్బ గట్టిగానే తగులుతున్నది. రిలయన్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ మార్కెట్ విలువ మరో రూ.58,091.87 కోట్లు పడిపోయింది. బీఎస్ఈలో 8.28 శాతం నష్టపోయి రూ.1,015.25 వద్ద సంస్థ షేర్ విలువ స్థిరపడింది. ఒకానొక దశలో 9.15 శాతం మేర దిగజారింది. ప్రస్తుతం సంస్థ మార్కెట్ విలువ రూ.6,43,594.13 కోట్లుగా ఉన్నది.

### ఒక్కటంటే ఒక్కటీ లేదు..

**కరోనా** వైరస్ దెబ్బ స్టాక్ మార్కెట్లను పట్టిపీడిస్తున్నది. ఈ వైరస్ సెగకు సోమవారం బీఎస్ఈలో లిస్టైన అన్ని షేర్లు పతనాన్ని నమోదు చేసుకున్నాయి. ఇండస్ఇండ్ బ్యాంక్ ఏకంగా 17.50 శాతం క్షీణించి టాప్ లూజర్‌గా నిలిచింది. టాటా స్టీల్ 11.02 శాతం, యాక్సిస్ బ్యాంక్ 10.38 శాతం, ఐసీఐసీఐ బ్యాంక్ 9.96 శాతం, ఐటీసీ 9.28 శాతం, ఇన్ఫోసిస్ 9.24 శాతం, ఓఎన్జీసీ 8.73 శాతం, మహీంద్రా అండ్ మహీంద్రా 8.67 శాతం, హెచ్‌సీఎల్ టెక్ 8.48 శాతం, రిలయన్స్ 8.28 శాతం, ఎన్టీపీసీ 8.19 శాతం, ఎల్అండ్‌టీ 7.99 శాతం చొప్పున పతనం చెందాయి. వీటితోపాటు ఎస్బీఐ 7.84 శాతం, టెక్ మహీంద్రా 7.81 శాతం, బజాజ్ ఫైనాన్స్ 7.09 శాతం, అల్ట్రాటెక్ సిమెంట్ 6.80 శాతం, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ 6.73 శాతం, టైటాన్ 6.73 శాతం, ఏషియన్ పెయింట్స్ 6.38 శాతం, మారుతి 6.04 శాతం, టీసీఎస్ 6.04 శాతం, భారతీ ఎయిర్‌టెల్ 5.98 శాతం, కొటక్ బ్యాంక్ 5.88 శాతం వరకు మార్కెట్ వాటాను కోల్పోయాయి.




### నిలిచిపోయిన వాల్‌స్ట్రీట్

కరోనా ధాటికి ప్రపంచ స్టాక్ మార్కెట్లు కుప్పకూలుతున్నాయి. సోమవారం భీకర నష్టాల కారణంగా అమెరికా వాల్‌స్ట్రీట్ విరామం తీసుకున్నది. వైరస్ వ్యాప్తి నిరోధంలో భాగంగా ఎయిర్ లైన్స్ నుంచి రెస్టారెంట్లదాకా మూసివేయడంతో మదుపరులు అమ్మకాల ఒత్తిడిలోకి జారుకున్నారు. ఫెడ్ రిజర్వ్ వడ్డీరేట్ల కోత కూడా భయపెట్టింది. ప్రధాన ఐరోపా మార్కెట్లు 8 శాతం వరకు పడిపోయాయి. ఇక ఆసియా మార్కెట్లూ భారీ నష్టాలకు లోనవగా, చైనా 3.40 శాతం, హాంకాంగ్ 4.03 శాతం, దక్షిణ కొరియా 3.19 శాతం, జపాన్ 2.46 శాతం నష్టపోయాయి. బ్రెంట్ క్రూడాయిల్ ఫ్యూచర్ బ్యారెల్ ధర 7.53 శాతం క్షీణించి 31.30 డాలర్లకు పరిమితమైంది.

### ఫెడ్ నిర్ణయంతో భయాలు

**అమెరికా** ఫెడరల్ రిజర్వ్ బ్యాంక్ వడ్డీరేట్ల కోత కూడా సోమవారం స్టాక్ మార్కెట్ల ఉసురు తీసింది. దేశ ఆర్థిక వ్యవస్థపై కరోనా వైరస్ ప్రభావం భారీగా కనిపిస్తుండటంతో అప్రమత్తమైన ఫెడ్ రిజర్వ్.. మరోసారి వడ్డీరేట్లను తగ్గించింది. కోతపెట్టి రెండు వారాలైన కాకముందే మళ్లీ వడ్డీరేట్లను తగ్గించడం.. అదికూడా దాదాపు శూన్య స్థాయికి తీసుకురావడం కరోనాతో వాటిల్లబోయే నష్టాలను మదుపరుల ముందుంచింది. ఆదివారం 0-0.25 శాతానికి ప్రామాణిక రుణ రేటును కుదిస్తూ ఫెడ్ నిర్ణయం తీసుకున్నది. 2008 ప్రపంచ ఆర్థిక మాంద్యం నాటి స్థాయికి వడ్డీరేట్లు వెళ్లిపోయాయి. ఈ పరిణామం ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు పెద్దన్నగా వ్యవహరించే అమెరికా ఆర్థిక పరిస్థితిని తెలియపరుస్తుండటంతో మదుపరులలో ఒక్కసారిగా ఆందోళనలు చెలరేగాయి.

### యెస్ బ్యాంక్ షేర్లు

లాభాల్లో ముగిశాయి. ఆర్థిక సంక్షోభంలో కొట్టుమిట్టాడుతున్న ఈ బ్యాంక్‌కు ఎస్బీఐ చేయూతనిస్తున్న నేపథ్యంలో మదుపరులు పెట్టుబడులకు ఆసక్తి చూపుతున్నారు. బీఎస్ఈలో 45.21 శాతం ఎగిసి రూ.37.10 వద్ద, ఎన్ఎస్ఈలో 45 శాతం ఎగబాకి రూ.37.05 వద్ద స్థిరపడ్డాయి.

## పసిడి పరుగు

### 450 పెరిగిన తులం ధర

**బంగారం** ధరలు మళ్లీ పెరిగాయి. ఒకవైపు స్టాక్ మార్కెట్ల భారీ పతనం, మరోవైపు రూపాయికి మరిన్ని చిల్లులు పడుతుండటంతో పెట్టుబడిదారుల తమ పెట్టుబడులను అతి విలువైన లోహాలవైపు మళ్లించడంతో ఈ ధరలు అమాంతం ఎగబాకాయి. ఢిల్లీ బులియన్ మార్కెట్లో పదిగ్రాముల పసిడి ధర రూ.455 అధికమై రూ.41,610 పలికింది. అంతకుముందు ఈ ధర రూ.41,155గా ఉన్నది. పసిడి ధరలు పుంజుకున్నప్పటికీ వెండి మాత్రం భారీగా పడిపోయింది. కిలో వెండి ధర ఏకంగా రూ.1,280 తగ్గి రూ.40,304కి పరిమితమైంది. తులం బంగారం ధర ఇంచుమించు కిలో వెండి ధర సమాన స్థాయిలో ఉన్నాయి. న్యూయార్క్ బులియన్ మార్కెట్లో ఔన్స్ గోల్డ్ ధర 1,539 డాలర్లు పలుకగా, వెండి 15.64 డాలర్ల వద్ద ఉన్నది.


తెలంగాణ ప్రభుత్వం
నీటిపారుదల మరియు ఆయకట్టు అభివృద్ధి శాఖ
నెం. 04/ఎస్.ఇ/జివిసి-4/2019-20, ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండర్ నోటీస్ తేదీ: 12-03-2020
క్రమ సంఖ్య: 1. పని పేరు: ఎస్.ఆర్.ఎస్.పి. స్టేజ్-1 దిగువ మానేరు కాకతీయ కాలువ కి.మీ. 146.625 దగ్గర ఆర్.సి.సి. (Crash Barriers) గోడ నిర్మించుట గురించి. అంచనా విలువ (లక్షలలో): 25.38. బిడ్ డాక్యుమెంట్ డౌన్‌లోడ్ చేసుకొనుటకు తేదీ: 19-03-2020న మ|| 1.00 గం. నుండి 06-04-2020న మ|| 2.00 గం. వరకు. టెండర్లు స్వీకరించుటకు చివరి తేదీ మరియు సమయం: 06-04-2020న మ|| 3.00 గం. వరకు. ఫోన్ నెం: 9182009339, ఇ-మెయిల్: segvc4@gmail.com. మిగతా వివరాలకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ మార్కెట్ ప్లేస్ @ www.eprocurement.gov.in వెబ్‌సైట్‌లో చూడగలరు.
సం/- (శ్రీ బి.విజయ భాస్కర్ రావు, బి.ఇ.,) పర్యవేక్షక అభియంత, జి.వి.సి.-4, ఎల్.ఎం.డి. కాలనీ.
DIPR RO.No. 2667-DP/CL/ADVT/1/2019-20, Dt: 16-03-2020


## అనిల్ అంబానీకి సమన్లు

యెస్ బ్యాంక్ సంక్షోభం కేసులో మరో నలుగురికీ జారీ చేసిన ఈడీ • 19న హాజరుకావాల్సిందేనని ఆదేశం

**న్యూఢిల్లీ/ముంబై, మార్చి 16:** అనిల్ అంబానీకి గట్టి ఎదురుదెబ్బ తగిలింది. యెస్ బ్యాంక్ సంక్షోభానికి సంబంధించిన కేసులో అడాగ్ చైర్మన్ అనిల్ అంబానీకి ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) సమన్లు జారీ చేసింది. ఈ కేసులో ఇదివరకే అరెస్టైన యెస్ బ్యాంక్ ప్రమోటర్ రాణా కపూర్‌ను విచారిస్తున్న ఈడీ..తాజాగా అనిల్ అంబానీకి సమన్లు జారీ చేయడం మరింత ప్రాధాన్యతను సంతరించుకున్నది. ఈ మేరకు ముంబైలోని బాలార్డ్ ఎస్టేట్ ప్రాంతంలో ఈడీ కార్యాలయానికి హాజరుకావాలని అనిల్ అంబానీని ఆదేశించినప్పటికీ అనారోగ్య కారణాల వల్ల హాజరుకాలేనని అనిల్ పేర్కొన్నట్లు ఈడీ వర్గాలు వెల్లడించాయి. యెస్ బ్యాంక్ వద్ద అనిల్ అంబానీకి సంబంధించిన పలు కంపెనీలు రూ.12 వేల కోట్లకు పైగా రుణాలు తీసుకొని తిరిగి చెల్లింపులు జరుపడంలో విఫలమయ్యారు. ప్రస్తుతం ఇవి నిరర్థక ఆస్తుల జాబితాలోకి చేరాయి. 60 ఏండ్ల వయస్సు కలిగిన అనిల్ అంబానీని ఈ నెల 19న హాజరుకావాల్సిందేనని స్పష్టంచేసింది. మరోవైపు యెస్ బ్యాంక్ వద్ద తీసుకున్న రుణాలకు పూర్తిస్థాయి తాకట్టు కింద ఉన్నాయని గతవారం రిలయన్స్ వెల్లడించింది. బ్యాంక్ వద్ద తీసుకున్న రుణాలను తిరిగి చెల్లింపుల జరుపడానికి సిద్ధంగా ఉన్నట్లు ఇదివరకే సంస్థ ప్రకటించింది. కాగా, అనిల్‌తోపాటు యెస్ బ్యాంక్ నుంచి రుణాలు పొందిన అన్ని సంస్థలకు సమన్లు జారీ చేసినట్లు ఈడీ వర్గాలు వెల్లడించాయి. విడుతలవారీగా ఒక్కొక్కరిని ప్రశ్నించనున్నట్లు తెలిపాయి.




**సమన్లు జారీ చేసిన వారిలో మరికొంత మంది**

| కంపెనీ | పేరు |
|---|---|
| జీ గ్రూపు | సుభాష్ చంద్ర |
| జెట్ ఎయిర్‌వేస్ | నరేశ్ గోయల్ |
| ఇండియా బుల్స్ | సమీర్ గెహ్లాట్ |
| డీహెచ్ఎఫ్ఎల్ | కపిల్ వాధావాన్ |

### మాస్క్‌తో రాణా కపూర్

కరోనా వైరస్ నేపథ్యంలో రాణా కపూర్ మాస్క్‌తో కనిపించారు. కపూర్ కస్టడీ ముగియడంతో ప్రాంతీయ కోర్టులో హాజర్ పరిచిన ఈడీ..ఆయన కస్టడీని ఈ నెల 20 వరకు పొడిగించింది. అంతకుముందు ఆయనను మెడికల్ చెకప్ నిమిత్తం స్థానిక హాస్పిటల్‌లో ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. కపూర్‌తోపాటు ఆయన కుటుంబ సభ్యులు రూ.4,300 కోట్ల ముడుపులు అందుకున్నట్లు వచ్చిన ఆరోపణలపై ఈడీ వీరిపై క్రిమినల్ కేసును దాఖలు చేసింది.

నమస్తే తెలంగాణ
జిందగీ
/nt.zindagi
9 కరీంనగర్
మంగళవారం 17 మార్చి 2020
WWW. NTNEWS.COM

## ఫొటో చెప్పిన జీవితం



ప్రతి మహిళకూ అదనపు బాధ్యతలుంటాయి. వాటిని నిర్వర్తిస్తూనే ఉన్నతమైన లక్ష్యాలను ఏర్పరుచుకోగల శక్తి మహిళల్లో ఉంటుంది. దానికి నిదర్శనంగా మొన్న సానియా మీర్జా షేర్ చేసిన ఫొటో నిలుస్తున్నది. ఇటీవల దుబాయ్‌లో టెన్నీస్ ఫెడ్ కప్ పోటీల్లో ఆమె పాల్గొన్నది. ఈ సందర్భంగా ఆట విరామ సమయాన్ని ఆమె కొడుకు ఇజాన్‌తో గడిపింది. ఆ ఫొటోను ఇన్‌స్టా, ఫేస్‌బుక్‌లో షేర్ చేసింది. 'నా జీవితం ఈ చిత్రంలో కనిపిస్తుంది' అని క్రీడాకారిణిగా, తల్లిగా తన బాధ్యత ఏంటో సందేశాన్ని రాసింది. తల్లులు తమ పాత్ర నిర్వహిస్తూనే ఏక కాలంలో అనుకున్నవి సాధించవచ్చు అనేది ఈ చిత్రంద్వారా నిరూపితం అవుతున్నది. దీన్ని చూసి 'ఐరన్ లేడీ' అంటూ నెటిజన్లు, సెలబ్రిటీలు కామెంట్లలో ఆనందాన్ని వ్యక్తం చేశారు.

## వీగన్ లెదర్‌తో జంతువులకు విముక్తి!



లెదర్‌తో తయారు చేసిన హ్యాండ్ బ్యాగులు, బూట్లు, జాకెట్స్ వేటికైనా మార్కెట్లో భలే గిరాకి. ఇవి ఎక్కువ రోజులు కొత్తవిగా కనిపిస్తాయి. కాకపోతే వీటి తయారీకి కంగారూలు, ఉష్ట్రపక్షి, గొర్రెలు, ఎలిగేటర్లు, ఆవులు వంటి మరెన్నో జంతువుల తోలును ఉపయోగిస్తారు. వీటికి రంగులు వేసేందుకు కృత్రిమ రసాయనాలు అవసరం. ఇవి నీటి వనరులు, నేల, గాలిని కలుషితం చేస్తాయి. తద్వారా హానికరమైన వ్యాధులను కూడా కలిగిస్తాయి. పర్యావరణకు అనుకూలమైన ఫాక్స్ తోలును ఎంచుకోవడం ద్వారా అమాయక జంతువులను వధను నిరోధించవచ్చు.



**వీగన్ లెదర్ తయారీ :** వీగన్ తోలు తరుచుగా పాలియురేతేన్ నుంచి తయారవుతుంది. ఇది విషపూరితం కానవసరం లేదు. పండ్ల వ్యర్థాలు, పైనాపిల్ ఆకులు, కార్క్, రీసైకిల్ ప్లాస్టిక్ వంటి పదార్థాల నుంచి వినూత్నమైన లెదర్‌ను తయారు చేస్తారు.

**వీగన్ లెదర్ ఎక్కడ వాడుతున్నారు? :** స్టెల్లా మక్కార్ట్నీ, ననుష్కా, అవేక్ వంటి బ్రాండ్లు తమ ఉత్పత్తులకు తోలు వాడకాన్ని పూర్తిగా నిషేధించాయి. ఆటోమొబైల్ కంపెనీలు బీఎమ్‌డబ్ల్యూ, మెర్సిడెస్ బెంజ్, టెస్లా వంటి కారు ఇంటీరియర్‌కు, సీటింగ్‌కు వీగన్ లెదర్‌ను ఉపయోగిస్తున్నారు. ఆలివ్, కనాబిస్, ఆర్చర్ వంటి స్వదేశీ వీగన్ బ్రాండ్ల వాడకం భవిష్యత్తులో పెరగడం ఖాయం.

### వంటింటి చిట్కాలు



- పాస్తా ఉడికేందుకు చాలా సమయం తీసుకుంటుంది. అందుకని రాత్రంతా మూత పెట్టిన పాత్రలో నానబెట్టి ఉడికిస్తే త్వరగా ఉడుకుతుంది.
- ఉల్లిముక్కలను నూనెలో వేయించేటప్పుడు కొంచెం వంటసోడా వేయడం వల్ల రెండురెట్లు వేగంగా వేగుతుంది.
- చీజ్‌ను 68–77 డిగ్రీల సెంటిగ్రేడ్ ఉష్ణోగ్రత వద్ద పెట్టాలి. అప్పుడు చీజ్‌ను త్వరగా కట్ చేయవచ్చు.

## ర'కూల్' స్టైల్



తెలుగు సినిమాల్లో ఈ మధ్య తక్కువ కనిపిస్తున్న భామ ఎవరంటే రకుల్ అనేస్తాం. బాలీవుడ్‌లో పాగా వేసిన ఈ ముద్దుగుమ్మ.. అప్పుడప్పుడు ఫ్యాషన్‌వీక్‌ల్లో సైతం మెరిసిపోతున్నది. ఈ మధ్యకాలంలో ఒక అవార్డు ఫంక్షన్‌కి అదిరిపోయే లుక్‌తో వచ్చేసింది. లావెండర్ కలర్ చీర డ్రేపింగ్‌తో వచ్చిన డ్రెస్‌లాంటిది వేసుకుంది. దీనికి హాల్టర్ నెక్ బ్లౌజ్ పర్‌ఫెక్ట్ లుక్‌ని తెచ్చింది. షాహిలా ఖాన్ డిజైన్ చేసిన ఈ అవుట్‌ఫిట్‌కు ఒకవైపు స్లిట్ రావడం అదనపు ఆకర్షణ. సిల్వర్ హీల్స్, సింపుల్ మేకప్‌తో మెరిసిపోయింది. అన్నింటినీ మించి మెడలో మూడు వరుసలు ఉన్న నెక్ పీస్ అందరి దృష్టినీ ఆకర్షించింది. ఎమరాల్డ్స్, డైమండ్స్‌తో వేసుకున్న నెక్లెస్ రకుల్ స్టైల్ స్టేట్‌మెంట్‌గా చెప్పొచ్చు.


**ఇప్పుడు ప్రపంచాన్ని వణికిస్తోన్న ఏకైక మహమ్మారి.. కరోనా. ఎవరి నోట విన్నా కరోనా మాటలే. ప్రపంచవ్యాప్తంగా లక్షా 45 వేల మందికి పైగా కరోనా పాజిటివ్‌గా నిర్ధరాణ అయ్యారు. మనదేశంలో 80 మందికి పైగా కరోనాతో బాధపడుతున్నట్టు తేలింది. ఇలాంటి పరిస్థితుల్లో కరోనా వైరస్ గురించి అనేక రకాల అపోహలు, భయాలు చుట్టుముట్టి ఉన్నాయి. అందుకే ఈ అపోహల్లో నిజానిజాలు వివరిస్తున్నారు సీనియర్ డాక్టర్ బి. విజయ్ కుమార్.**

# కరోనా.. కల్లోలంలో నిజమెంత?





### కరోనా వైరస్ ఎలా వ్యాపిస్తుంది?



ఇంతకుముందు సార్స్, మెర్స్ లాంటి కరోనా వైరస్‌ల ఇన్‌ఫెక్షన్ వచ్చినప్పుడు ఇంతగా భయపెట్టలేదు. ఇది పుట్టింది జంతువుల నుంచే అయినా ఇప్పుడు మనిషి నుంచి మనిషికి వేగంగా పెరుగుతున్నది. ఇంతకుముందు కరోనా వైరస్‌లు రెండూ గబ్బిలాల నుంచే వచ్చాయి కాబట్టి ఇది కూడా వాటి నుంచే వచ్చిందని భావిస్తున్నారు. ఈ కరోనా వైరస్ ప్రత్యేకత ఏంటంటే వేగంగా వ్యాపించడం. నోటి నుంచి, ఊపిరితిత్తుల నుంచి వచ్చే తుంపరలే దీని వాహకాలు. తుంపరలు టేబుల్ మీద పడినా, చేతుల మీద పడినా, మనం వాడే తలుపులు, గొళ్లాలు, టాయిలెట్లు ఎక్కడ పడినా వాటిలో ఉండే వైరస్ 48 గంటల నుంచి కొన్నిసార్లు అయిదారు రోజుల వరకు కూడా బతికే ఉండొచ్చు. వాటిని తాకి ముక్కు, కళ్లు ముట్టుకుంటే మనకి ట్రాన్స్‌మిట్ అయ్యే ప్రమాదం ఉంటుంది.

### లక్షణాలేంటి?



ఎనభై శాతం మందిలో సాధారణ ఫ్లూ, జ్వరం, ఒళ్లునొప్పులు ఉండి వారం నుంచి పదిహేను రోజుల్లో అన్నీ తగ్గిపోతాయి. 20 శాతం మందిలో మాత్రమే కొంచెం తీవ్రంగా ఉండొచ్చు. ఊపిరితిత్తులు కూడా ప్రభావితమై దమ్ము, ఆయాసంతో ఊపిరాడక తీవ్రమైన అనారోగ్యం పాలవుతారు.


### కరోనా రాకుండా ఉండాలంటే మాస్కులు తప్పనిసరా?

ఆరోగ్యంగా ఉన్నవాళ్లకు మాస్కులు అవసరం లేదు. మాస్కులు ఇన్‌ఫెక్షన్ ఉన్నవాళ్లు ధరిస్తే వాళ్ల తుంపరలు దూరంగా పడకుండా, మరొకరికి వ్యాపించకుండా ఉంటాయి. ఇన్‌ఫెక్ట్ అయిన వాళ్లకు చికిత్స అందించేవాళ్లు, హ్యాండిల్ చేసేవాళ్లు ధరిస్తే ఉపయోగకరంగా ఉంటుంది. హ్యాండ్ వాష్, హ్యాండ్ శానిటైజర్ వాడడం, ఎక్కడ ముట్టుకున్నా, ముఖ భాగాలను ఎక్కడా టచ్ చేయకుండా ఉండడం అవసరం.



### కుటుంబంలో ఎవరికైనా కరోనా ఉంటే ఏం చేయాలి?

పేషెంట్ చేత మాస్క్ ధరింపచేయడం ముఖ్యం. తరచుగా చేతులు కడుక్కోవాలి. వాళ్లను విడిగా వేరే గదిలో ఉంచాలి. ఎవరైనా ఒకరు మాస్క్ వేసుకుని వాళ్లను చూసుకోవాలి. కనీసం 14 రోజుల పాటు అలా సెల్ఫ్ మానిటరింగ్ చేసుకోవాలి. రిస్క్ ఎక్కువగా ఉన్నవాళ్లు వాళ్ల దగ్గరికి వెళ్లొద్దు.




### ఆహారం ద్వారా వ్యాపిస్తుందా?

మనం తీసుకునే ఆహారం ద్వారా ఇది వ్యాపిస్తుందనడానికి దాఖలాలేమీ లేవు. చికెన్ నుంచి వస్తుందని రూమర్లు వ్యాపించాయి. అయితే కోళ్లు కూడా ఫ్లూ వచ్చి చనిపోతాయి. అలాంటి వాటిజోలికి వెళ్లకుండా చికెన్‌ను బాగా ఉడికించి వండితే ఇది రాదు. మనదేశంలో బాగా ఉడికిస్తారు కాబట్టి దానిలో వైరస్ ఒకవేళ ఉన్నా అది బతకదు. అయితే సలాడ్స్ లాంటివి తినేటప్పుడు ముఖ్యంగా బయట ఎక్కడో హోటల్స్‌లోనో, బండి మీదో పండ్లు కట్ చేసి అమ్మే చోట తింటే మాత్రం రిస్కే. వాళ్లకి ఇన్‌ఫెక్షన్ ఉండి తుంపరలు పడితే కష్టమే. కాబట్టి బయటి ఫుడ్‌కి దూరంగా ఉండడం బెటర్.

### మన రాష్ట్రంలో కరోనా వైరస్ టెస్ట్ ఎక్కడ చేస్తారు?





దేశ వ్యాప్తంగా కొన్ని సెంటర్లలోనే ఇది అందుబాటులో ఉంది. మన రాష్ట్రంలో గాంధీ హాస్పిటల్‌లో ఉంది. ఉస్మానియాలో కూడా ఓపెన్ చేస్తున్నారు. లక్షణాలు తీవ్రంగా ఉన్నవాళ్లు, కరోనా వచ్చే రిస్క్ ఉన్నవాళ్లకు టెస్టు చేయాల్సిందే. ఫ్లూ వచ్చి తీవ్రంగా ఇబ్బంది ఉండి, అయిదారు రోజులైనా తగ్గకుండా, శ్వాసలో ఇబ్బంది అవుతుందంటే వాళ్లను పరీక్షకు పంపిస్తున్నారు.

### ఎక్కువ ఉష్ణోగ్రతల్లో కరోనా పెరగదా?



దీనికి కూడా వందశాతం రుజువులేమీ లేవు. మన శరీర ఉష్ణోగ్రత 37 డిగ్రీల సెంటీగ్రేడ్. ఇక్కడ పెరగొచ్చు. అయితే అది బతకాలంటే చాలా అంశాలు దోహదపడుతాయి. మన శరీరం బయట తుంపరల ద్వారా పడినప్పుడు మాత్రం ఎక్కువ ఉష్ణోగ్రతల ప్రభావం వైరస్ పై ఉండే అవకాశం ఉంది. అందువల్ల అధిక ఉష్ణోగ్రత గల ప్రదేశాల్లో వ్యాపించడం కష్టం.

### కరోనా వైరస్ వల్ల ఎవరికి రిస్కు?



ఇప్పటివరకు కొవిడ్–19 గురించి పూర్తి సమాచారం లేదు. ఇంతకుముందు వచ్చిన కరోనా జాతి వైరస్‌ల ప్రకారం చూస్తే వృద్ధులు, బీపీ, షుగర్, గుండెజబ్బులు, శ్వాసకోశ వ్యాధులున్నవాళ్లు, వ్యాధి నిరోధకత తక్కువ ఉన్నవాళ్లు, క్యాన్సర్ పేషెంట్లలో వైరస్ ఎక్కువ ప్రభావం చూపించొచ్చు. యువతలో కూడా ఇన్‌ఫెక్షన్ రావొచ్చు. పిల్లల్లో ఎక్కువగా కనిపించడం లేదు. అయితే ఇన్‌ఫెక్షన్‌తో తీవ్రమైన ఇబ్బంది ఎదుర్కోకపోయినప్పటికీ, ఇన్‌ఫెక్షన్ ఉన్న పిల్లలు స్కూల్ నుంచి ఇంటికి వచ్చిన తరువాత పెద్దవాళ్లకు రావొచ్చు. అందుకే స్కూళ్లకు సెలవులివ్వాల్సిన అవసరం ఏర్పడింది.



**డాక్టర్ బి. విజయ్ కుమార్**
సీనియర్ జనరల్ ఫిజీషియన్
యశోద హాస్పిటల్,
సికింద్రాబాద్

### ఇలాంటి పరిస్థితిలో ప్రయాణాలు చేయడం మంచిదేనా?



సార్స్, మెర్స్ స్థానికంగా మాత్రమే వ్యాపించాయి. కానీ ఈ రకమైన కరోనా దాదాపు అన్ని దేశాలకూ పాకింది. అందువల్ల ప్రయాణాలు మానేయడమే మంచిది. గుమిగూడే ఫంక్షన్లు, పెళ్లిళ్లకు దూరంగా ఉండాలి. ఎంతకాలమనేది తెలీదు గానీ, కమ్యూనిటీ మొత్తంలో ఇమ్యూనిటీ సాధారణంగా రావడానికి 3 నుంచి 6 నెలలు పడుతుంది. నాలుగు నుంచి ఆరు వారాల పాటు ఈ ట్రాన్స్‌మిషన్ అత్యంత వేగంగా ఉంటుంది. కాబట్టి అంతకాలం గ్రూప్ మీటింగ్స్ అవాయిడ్ చేయడం మంచిది.

... రచన ముడుంబై

## చెక్కు తీసేస్తుంది



కూరగాయల పొట్టు తీసేయాలన్నా.. ఆలూ, ఆపిల్ చెక్కు తీయాలన్నా చాలా పెద్ద పనే. దానికే ఎక్కువ సమయం పోతుంది కూడా. అలాకాకుండా చటుక్కున ఆ పని జరిగిపోతే ఎంత హాయో అనుకునేవాళ్లు చాలామందే ఉంటారు. అలాంటి వారికోసమే దీన్ని తయారుచేశారు. కూరగాయ సైజును బట్టి పైన పిన్‌ని ఫిక్స్ చేసుకోవచ్చు. కింద ఉన్న పిన్ మాత్రం కదులదు. ఈ రెండింటి మధ్య కూరగాయలు, పండ్లను పెట్టి ఒక బటన్ నొక్కితే చాలు.. 10 సెకన్లలో పొట్టు వచ్చేస్తుంది. స్టయిన్‌లెస్ స్టీల్‌తో తయారైన ఈ పరికరం పై చెక్కును మాత్రమే తీసేస్తుంది. అందులో న్యూట్రిషియన్స్ పోయేలా మాత్రం చెక్కు తీయదు. బ్యాటరీతోనే కాదు.. ఆడప్టర్‌తో పనిచేసే పీలర్స్ కూడా మార్కెట్‌లోకి వచ్చాయి. వీటి ధర సుమారు 1500 రూపాయల వరకు ఉంది. పని అంత సులువు అయినప్పుడు ఈ మాత్రం ఖర్చు చేయడంలో తప్పులేదేమో!

## ఎల్లో వర్క్‌షాప్ వారికోసమే!

**నేర్చుకున్న కళ ను వర్క్‌షాపులుగా నిర్వహించి ఇతరులకు నేర్పిస్తుంటారు. అయితే ఈ వర్క్‌షాపులు నిర్వహిస్తున్నది ఆమె కోసం కాదు. మరొక కారణం ఉంది.**




హైదరాబాద్‌కు చెందిన సాక్షి విజయ్ ఆర్టిస్ట్‌గా మారింది. కళ ఆమెకు మాత్రమే సొంతం కావాలనుకోలేదు. నలుగురికి నేర్పాలనుకున్నది. 2020 జనవరిలో 'ఎల్లో వర్క్‌షాపు' నిర్వహించింది. ఇంతకుముందు నీరూస్ కాలిగ్రఫీ నడిపిస్తున్న నిరంజన్ పి ఆర్టిస్ట్‌తో కలిసి పనిచేసింది. ఆయన 'కాలిగ్రఫీ' బోధిస్తున్నాడు. ఐఐటీ హైదరాబాద్‌లో ఎమ్ఎస్ పూర్తయ్యాక యామ్‌స్టర్‌డామ్‌లోని బుకింగ్ డాట్ కమ్‌లో ట్రావెల్స్ సెర్చ్ ఇంజిన్‌గా పనిచేసింది. ఆ సమయంలోనే ఆర్ట్‌పై ఆసక్తి పెరిగింది. 25 ఏండ్ల సాక్షి ఆర్ట్స్‌లో అన్ని రకాలు నేర్చుకున్నది. 2019లో ఇండియాకు వచ్చి, బెంగళూరు, జైపూర్ వంటి నగరాల్లో వర్క్‌షాపులు నిర్వహించింది. వీటి పెట్టుబడికి కావాల్సిన డబ్బుకోసం ఇతర ఆర్టిస్టులకు సహాయం అందించింది. ప్రస్తుతం సాక్షి ఉబెర్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ చేస్తున్నది. తన శైలికి తగినట్లుగా ఎల్లో వర్క్‌షాపు నిర్వహిస్తున్నది. ఇందులో పాల్గొనేవారు వర్క్‌షాపు గురించి ముందుగానే విచారించి రివ్యూస్ తెలుసుకొని రావొచ్చని సవాలు చేస్తున్నది.

## ఆకట్టుకుంటున్న కరోనా పాట




కరోనాపై ఎవరికి తోచినట్లుగా వారు అవగాహన కల్పిస్తున్న నేపథ్యంలో రష్మీ సర్వీ అనే యువతి తాజాగా తన పాట ద్వారా అవగహన కల్పిస్తున్న వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నది. 2018లో హాలీవుడ్ సింగర్ కామిలా కాబెల్లో పాడిన పాట 'హవానా'కు 'కరోనా' వెర్షన్‌తో పాడిన ఈ పాటను సోమవారం ఆమె ట్విటర్‌లో షేర్ చేసింది. ఈ వీడియోకు 'ఆందోళన పడాల్సిన అవసరం లేదు. తరచూ చేతులను శుభ్రంగా కడుక్కుంటూ పరిశుభ్రంగా ఉండండి. మీకు ఎమైనా కరోనా వ్యాధి లక్షణాలు కనిపిస్తే వెంటనే డాక్టర్ను సంప్రదించండి' అంటూ రష్మీ ట్వీట్ చేసింది. కాగా ''కరోనా.. హో.. నా.. నా. నా ఆలోచన మొత్తం నీ మీదే ఉంది కరోనా.. హో నానా. చైనా నుంచి వచ్చిన ఓ కరోనా.. నీలో ఏదో ఉంది కరోనా.. నా.. నా'' అంటూ సాగే ఈ పాటతో రష్మీ ప్రతిఒక్కరినీ ఆశ్చర్యపరుస్తున్నది. ఇప్పటి వరకూ ఆ పాటకు 13వేల వ్యూస్ వచ్చాయి. 'తన వాయిస్ చాలా బాగుంది'. 'అందమైన గొంతు నుంచి అద్భుతమైన సాహిత్యం' అంటూ నెటిజన్లు కామెంట్లు పెడుతున్నారు. అంతేగాక ప్రముఖ వ్యాపార దిగ్గజ కంపెనీ మహీంద్రా గ్రూప్ సంస్థల యాజమాని ఆనంద్ మహీంద్రా కూడా ఆమె పాటకు ఫిదా అయ్యారు. ఈ వీడియోను ఆయన తన ట్విటర్లో పంచుకుంటూ.. రష్మీపై ప్రశంసల జల్లు కురిపించారు.



# జార్జియాలో ప్రభాస్

**కరోనా** ప్రభావంతో అన్ని భాషల సినిమాల చిత్రీకరణలకు బ్రేక్ పడింది. స్టార్ హీరోలంతా షూటింగ్‌లకు ప్యాకప్ చెప్పేశారు. ప్రభాస్ మాత్రం తాజా సినిమా షూటింగ్‌తో బిజీగా ఉన్నారు. ఆయన హీరోగా రాధాకృష్ణకుమార్ దర్శకత్వంలో ఓ సినిమా తెరకెక్కుతున్న విషయం తెలిసిందే. ప్రస్తుతం ఈ సినిమా చిత్రీకరణ జార్జియాలో జరుగుతున్నది. ప్రభాస్‌తో పాటు పూజాహెగ్డే, ప్రియదర్శిలపై కీలక సన్నివేశాల్ని తెరకెక్కిస్తున్నారు. జార్జియాలో కరోనా భయం లేకపోవడంతో నిరాటంకంగా చిత్ర బృందం షూటింగ్‌ను జరుపుతున్నది. పదిడిగ్రీల చలి, వర్షం, కరోనా భయం..ఈ ప్రతికూల పరిస్థితులేవి చిత్రబృందంలోని స్ఫూర్తిని అడ్డుకోలేవని పేర్కొన్న దర్శకుడు రాధాకృష్ణకుమార్ ఆన్‌లొకేషన్‌కు సంబంధించిన ఓ స్టిల్‌ను ట్విట్టర్‌లో పోస్ట్ చేశారు. యూవీ క్రియేషన్స్, గోపీకృష్ణ మూవీస్ సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నాయి.

# వారి విలువ పెంచొద్దు!

ఎలాంటి భేషజాలకు తావులేకుండా మనసులోని భావాల్ని నిర్మొహమాటంగా వ్యక్తం చేస్తుంటుంది పంజాబీ సుందరి రకుల్‌ప్రీత్‌సింగ్. సోషల్‌మీడియాలో తనపై వచ్చే ట్రోల్స్‌ని ధీటుగా తిప్పికొడుతుంది. అయితే ఈ మధ్యకాలంలో తాను ఈ తరహా ప్రతికూలాంశాలకు దూరంగా ఉంటున్నానని, అంతగా పట్టించుకోవడం లేదని చెప్పింది రకుల్‌ప్రీత్‌సింగ్. అందుకు కారణాల్ని వివరిస్తూ 'సాధారణంగా సోషల్‌మీడియాలో విమర్శలకు దిగేవాళ్లకు స్వంత వ్యక్తిత్వం ఉండదు. ఎలాంటి స్వీయ ప్రతిభాపాటవాలు లేకపోవడం వల్ల గుర్తింపులేమితో బాధపడుతుంటారు. ఒకవేళ మనం అలాంటి వాళ్ల ట్రోల్స్‌కు జవాబిస్తే వాళ్ల విలువ పెంచినట్లవుతుంది. అందుకే ఇటీవలకాలంలో సోషల్‌మీడియాలో వచ్చే నెగెటివిటీకి దూరంగా ఉంటున్నా. ప్రశాంతచిత్తంతో నా వృత్తిమీద ఏకాగ్రత నిలుపుతున్నా' అని చెప్పుకొచ్చింది. అయితే తన వ్యకిగత ప్రతిష్టను దిగజార్చే, అందం గురించిన వెకిలి వ్యాఖ్యల్ని మాత్రం ఏమాత్రం ఉపేక్షించనని స్పష్టం చేసింది. ప్రస్తుతం ఈ సుందరి తెలుగులో ఏ సినిమాలోనూ నటించడం లేదు. తమిళంలో ఇండియన్–2 చిత్రంలో ఓ కథానాయికగా నటిస్తోంది.



రకుల్‌ప్రీత్‌సింగ్


# పోలీస్ అధికారిగా



నాని

**కెరీర్‌లో** ఎక్కువగా పక్కింటికుర్రాడు, లవర్‌బాయ్ పాత్రలతోనే ప్రేక్షకుల్ని అలరించారు నాని. తొలిసారి ఆయన పోలీస్ పాత్రలో కనిపించబోతున్నట్లు సమాచారం. నాని కథానాయకుడిగా శివనిర్వాణ దర్శకత్వంలో రూపొందుతున్న చిత్రం 'టక్ జగదీష్'. రీతూవర్మ, ఐశ్వర్యారాజేష్ కథానాయికలుగా నటిస్తున్నారు. ఈ సినిమాలో నాని పోలీస్ అధికారిగా నటిస్తున్నట్లు తెలిసింది. అతడి పాత్ర భిన్న పార్శ్వాలతో శక్తివంతంగా సాగుతుందని చెబుతున్నారు. అన్నదమ్ముల అనుబంధం నేపథ్యంలో దర్శకుడు శివనిర్వాణ ఈ సినిమాను రూపొందిస్తున్నట్లు సమాచారం. ప్రస్తుతం రాజమండ్రి పరిసర ప్రాంతాల్లో రెండో షెడ్యూల్‌ను చిత్రీకరిస్తున్నారు. షైన్ స్క్రీన్ పతాకంపై సాహూ గారపాటి, హరీష్ పెద్ది ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు.

# దేవుళ్లకు సొంతం



ఇళయరాజా

**మూడేళ్ల** విరామం తర్వాత సీనియర్ దర్శకుడు కృష్ణవంశీ రూపొందిస్తున్న చిత్రం 'రంగమార్తండ'. మరాఠీ చిత్రం 'నటసామ్రాట్' ఆధారంగా తెరకెక్కుతున్న ఈ చిత్రంలో ప్రకాష్‌రాజ్, రమ్యకృష్ణ కీలక పాత్రల్ని పోషిస్తున్నారు. ప్రస్తుతం ఈ సినిమాకు సంబంధించి పాటల రికార్డింగ్ ప్రారంభమైనట్లు కృష్ణవంశీ సోమవారం ట్విట్టర్ ద్వారా పేర్కొన్నారు 'రంగమార్తండ' మ్యూజిక్ డైరీస్ పేరుతో ఇళయరాజా స్వరాల్ని సమకూర్చుతున్న ఫొటోల్ని ట్విట్టర్‌లో పోస్ట్ చేశారు. 'దేవుళ్లకు మాత్రమే సొంతమైన ప్రత్యేకమైన కళ ఆయన సొంతం. సంగీత రచన చేస్తున్న ఇళయరాజా' అనే వ్యాఖ్యను జోడించారు. ఇళయరాజా పనిలో నిమగ్నమైన ఈ ఫొటోలు అభిమానుల్ని ఆకట్టుకుంటున్నాయి.



మహేష్‌బాబు

# మహేష్‌కు కథ చెప్పాడా?



వెంకీ కుడుముల

**'ఛలో'** 'భీష్మ' వంటి ఫీల్‌గుడ్ రొమాంటిక్ ఎంటర్‌టైనర్స్ ద్వారా ప్రతిభావంతుడైన దర్శకుడిగా పేరు తెచ్చుకున్నారు వెంకీ కుడుముల. వాణిజ్య ఇతివృత్తాలకు చక్కటి వినోదాత్మక అంశాల్ని మేళవించి విజయాల్ని అందుకున్నారాయన. 'భీష్మ' విజయంతో పలువురు అగ్రహీరోలు వెంకీ కుడుములతో కలిసి పనిచేసేందుకు ఆసక్తిని ప్రదర్శిస్తున్నారని సమాచారం. తాజాగా ఓ స్టోరీ నరేషన్ కోసం మహేష్‌బాబుతో వెంకీ కుడుముల భేటీ అయ్యారని ఫిల్మ్‌నగర్ వర్గాల్లో వినిపిస్తోంది. వెంకీ చెప్పిన కథ నచ్చడంతో ఆయనతో సినిమా చేయడానికి మహేష్ ఆసక్తిని చూపించారని సమాచారం. అయితే ప్రస్తుతం మహేష్‌బాబుకు ఉన్న కమిట్‌మెంట్స్ పూర్తయ్యాకే ఈ ప్రాజెక్ట్ గురించి స్పష్టత వస్తుందని అంటున్నారు. ఇటీవలే 'సరిలేరు నీకెవ్వరు' చిత్రంతో చక్కటి విజయాన్ని సొంతం చేసుకున్న మహేష్‌బాబు తన తదుపరి సినిమాను పరశురామ్ దర్శకత్వంలో చేయడానికి సన్నాహాలు చేసుకుంటున్నారు.

# వినోదాల 'ఒరేయ్ బుజ్జిగా'



రాహుల్ సిప్లిగంజ్, అనూప్, రాధామోహన్, సునీల్‌రావు, రాజ్‌తరుణ్, విజయ్

**రాజ్‌తరుణ్**, మాళవిక నాయర్ జంటగా నటిస్తున్న చిత్రం 'ఒరేయ్ బుజ్జిగా'. విజయ్‌కుమార్ కొండా దర్శకుడు. కె.కె.రాధామోహన్ నిర్మాత. ఈ చిత్ర ప్రీరిలీజ్ వేడుకను ఇటీవల కరీంనగర్‌లో నిర్వహించారు. నగర మేయర్ సునీల్‌రావు ముఖ్యఅతిథిగా హాజరై ఆడియో బిగ్‌సీడీని ఆవిష్కరించారు. దర్శకుడు మాట్లాడుతూ 'సంపూర్ణ హాస్యరసభరిత చిత్రమిది. రెండున్నర గంటలు నవ్విస్తుంది. అనూప్ అద్భుతమైన సంగీతాన్నందించారు. రాజ్‌తరుణ్ పాత్ర చిత్రణ వైవిధ్యంగా సాగుతుంది. యువతతో పాటు కుటుంబ ప్రేక్షకుల్ని అలరించే చిత్రమవుతుంది' అని చెప్పారు. 'నేను వరంగల్ ఆర్‌ఈసీలో చదువుకున్నా. తెలంగాణతో గొప్ప సంబంధం ఉంది. ఈ నెల 25న విడుదల చేద్దామనుకున్నాం. కరోనా ప్రభావంతో ఈ నెల 21 వరకు థియేటర్లు మూసివేస్తున్నారు కాబట్టి తిరిగి ఓపెన్ చేయగానే విడుదల తేదిని ప్రకటిస్తాం' అని నిర్మాత తెలిపారు.

# ఈఈలకే అధికారం

**పనుల పూర్తి గడువు పెంపుపై**

**పంచాయతీరాజ్‌శాఖ కమిషనర్ ఆదేశాలు జారీ**

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** పంచాయతీరాజ్‌శాఖ పరిధిలోని పనుల పూర్తికి ఒప్పందం గడువును పెంచే అధికారాలను సులభతరం చేస్తూ ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీచేసింది. ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ (ఈఈ) స్థాయిలో సాంకేతిక మంజూరు పొందిన పనుల్లో 50 శాతం వరకు అదనపు గడువును పెంచే అధికారాన్ని ఈఈకే ఇచ్చారు. అంతకన్నా ఎక్కువ గడువు కావాలంటే సూపరింటెండెంట్ ఇంజినీర్, వంద శాతం గడువు పెంచే అధికారం సీఈ, ఈఎన్సీలకు ఉంటుందని పంచాయతీరాజ్‌శాఖ కార్యదర్శి సందీప్ సుల్తానియా జారీచేసిన ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. సూపరింటెండెంట్ ఇంజినీర్ (ఎస్ఈ) స్థాయిలో సాంకేతిక మంజూరు పొందిన పనుల్లో 50 శాతం వరకు అదనపు గడువును పెంచే అధికారాన్ని ఎస్ఈకే ఇచ్చారు. అంతకుమించి కావాలంటే సీఈగానీ, ఈఎన్సీగానీ అనుమతించాలి. వంద శాతం అదనపు గడువుకు అనుమతి ఇచ్చే అధికారం ఈఎన్సీకి ఉంటుందని తెలిపారు. సీఈ, ఈఎన్సీ స్థాయిలో సాంకేతిక మంజూరు పొందిన పనులకు 50 శాతం గడువును పెంచే అధికారం వారికే ఉంటుంది. అంతకుమించి గడువు కావాలంటే ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాలని ఉత్తర్వుల్లో స్పష్టంచేశారు. తాజా ఉత్తర్వుల ద్వారా ఒప్పంద గడువు పొడిగింపులో జరుగుతున్న జాప్యాన్ని నివారించేందుకు సాధ్యమవుతుంది.

# ఎన్నికల వాయిదాపై సుప్రీంకు ఏపీ

- ఈసీ ఉత్తర్వులు కొట్టివేయాలని పిటిషన్
- నేడు విచారించనున్న న్యాయస్థానం

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ఆంధ్రప్రదేశ్ ఎన్నికల కమిషనర్ స్థానిక సంస్థల ఎన్నికలను వాయిదా వేస్తూ తీసుకున్న నిర్ణయాన్ని ఆ రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టులో సవాల్‌చేసింది. స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియను యథావిధిగా కొనసాగించేలా ఆదేశాలివ్వాలని కోరుతూ సోమవారం పిటిషన్ దాఖలుచేసింది. ఎన్నికలను వాయిదా వేస్తున్న కమిషనర్ ఇచ్చిన ఉత్తర్వులను కొట్టివేయాలని పిటిషన్‌లో పేర్కొన్నది. ఈ పిటిషన్‌పై న్యాయస్థానం మంగళవారం విచారణ చేపట్టనున్నది. కాగా, స్థానిక ఎన్నికలను యథాతథంగా కొనసాగించాలని కోరుతూ ఏపీ సీఎస్ నీలం సాహ్నీ ఎన్నికల సంఘానికి లేఖ రాశారు. కరోనా వైరస్ సాకుతో ఎన్నికలను ఆరు వారాలపాటు వాయిదా వేయాలన్న నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని కోరారు. ఎన్నికల నిర్వహణకు ప్రభుత్వం సర్వసన్నద్ధంగా ఉన్నదని పేర్కొన్నారు. కరోనా వ్యాప్తి కట్టడికి ప్రభుత్వం ఇప్పటికే అనేక చర్యలు చేపట్టిందని ఈసీ దృష్టికి తీసుకెళ్లారు. పోలింగ్ రోజున ప్రజలు గుమిగూడకుండా నియంత్రించవచ్చని తెలిపారు. ఎన్నికల వాయిదాపై గవర్నర్‌కు రాష్ట్ర ఎన్నికల కమిషనర్ (ఎస్ఈసీ) వివరణ ఇచ్చారు. గవర్నర్ విశ్వభూషన్ హరిచందన్ పిలుపుమేరకు ఎస్ఈసీ నిమ్మగడ్డ రమేశ్‌కుమార్‌ను రాజ్‌భవన్‌కు వెళ్లారు. ఎన్నికల వాయిదాపై గంటకుపైగా సుదీర్ఘంగా వివరించారు. గవర్నర్‌తో భేటీ వివరాలను మీడియాకు వెల్లడించడానికి ఎస్ఈసీ నిరాకరించారు. స్థానిక ఎన్నికల వాయిదాపై సోమవారం ఏపీ హైకోర్టులో విచారణ జరిగింది. ఇదే అంశంపై సుప్రీం కోర్టులో విచారణ ఉన్నందున తదుపరి విచారణను ఈ నెల 19కి వాయిదా వేస్తున్నట్టు హైకోర్టు తెలిపింది.

# పోరుగడ్డపై పోగుబంధం

ప్రత్యేక తెలంగాణ
ఫలం.. ఫలితం
Success of Telangana

- కూలీలుగా వలసవెళ్లి యజమానులుగా తిరిగొచ్చిన నేతన్న
- నౌకరీ చోడో.. వ్యాపార్ కరో స్ఫూర్తితో వేలమందికి ఉపాధి
- సొంతరాష్ట్రంపై మక్కువతో వెల్ఫేర్ సొసైటీగా సంఘటితం
- మడికొండ పవర్‌లూమ్ క్లస్టర్‌లో సొంతయూనిట్ల స్థాపన

**వరంగల్ ప్రతినిధి, నమస్తే తెలంగాణ:**

దాదాపు అర్ధశతాబ్దం క్రితం పుట్టినఊరు, కన్నవాళ్లు, కట్టుకున్నవాళ్లు, కడుపున పుట్టినవాళ్లను వదిలి తెలంగాణ నుంచి చేనేత కార్మికులు మహారాష్ట్ర, గుజరాత్ రాష్ట్రాల్లోని షోలాపూర్, భివండీ, ముంబై, సూరత్, అహ్మదాబాద్ తదితర ప్రాంతాలకు వలసవెళ్లారు. అక్కడ కూలీలుగా ఒక్కపూట తిండి దొరకని స్థితిని అనుభవించారు. డ్యూటీ అయ్యాక పడుకొనేందుకు జాగా కూడా దొరికేది కాదు. చెరుకుతోటల్లో పడుకుందామని వెళితే ఆసాములు చద్దర్లు గుంజుకుపోయేవారు. మగ్గం బొందలో నిల్చుని బట్టలు మార్చుకునేవారు. పొట్టెన్నిపడ్డా పనిని నమ్ముకుంటే దేన్నైనా జయించవచ్చని తెలంగాణ నేతన్న నిరూపించాడు. పరాయిరాష్ట్రంలో బతకడమే సవాల్‌గా మారినస్థితిలో పనిని, తనకు అన్నం పెట్టే మగ్గాన్ని నమ్ముకుని ఒక్కోమెట్టు ఎదిగారు. కూలీలుగా పనులు చేస్తూనే చేనేతరంగంలో వివిధ విభాగాల్లో నైపుణ్యం సంపాదించారు. స్వయంగా మరమగ్గాలు నడపడమే కాకుండా.. వస్త్రతయారీలో అన్నిరకాల విభాగాల్లో ఆరితేరారు. రెండు మూడుదశాబ్దాల అనుభవాన్ని రంగరించుకొని ఆయాప్రాంతాల్లో చిన్నచిన్న మగ్గం యూనిట్లను నెలకొల్పే స్థాయికి చేరుకున్నారు. పోటీతత్వాన్నీ అలవర్చుకొన్నారు. తెలంగాణలోని ఉమ్మడి వరంగల్, కరీంనగర్, నల్లగొండ ఖమ్మం జిల్లాల నుంచి దాదాపు మూడు నుంచి నాలుగు లక్షల మంది వలసవెళ్లినవారి పుణ్యమా అని మహారాష్ట్ర, గుజరాత్ రాష్ట్రాల్లో చేనేతరంగం వృద్ధిచెందింది.

## ప్రత్యేక రాష్ట్ర ఉద్యమంతో స్ఫూర్తి

ప్రత్యేక తెలంగాణ కోసం కే చంద్రశేఖర్‌రావు ప్రాణాలకు తెగించి నడిపిన ఉద్యమం వలసవెళ్లిన నేతన్నల్లో కొత్తకాంతులను నింపింది. 2009లో తెలంగాణ రాష్ట్ర ప్రకటన రాగానే సూరత్, షోలాపూర్, భివండీ ప్రాంతాల్లో ఉన్నవారంతా కాకతీయ టెక్స్‌టైల్ అండ్ వీవర్స్ వెల్ఫేర్ పొదుపు, పరపతి సహాయసంఘాన్ని ఏర్పాటుచేసుకున్నారు. ఉమ్మడి వరంగల్ నుంచి వెళ్లి ఆయాప్రాంతాల్లో మిల్లులు నడిపే సామర్థ్యం ఉన్న వాళ్లంతా ఏకమయ్యారు. పోరుగడ్డ పట్ల తమకున్న అభిమానాన్ని చంపుకోలేక స్వరాష్ట్రంలోనే పెట్టుబడులు పెట్టి చేనేతను అభివృద్ధి చేయడంతోపాటు, పలువురికి ఉపాధి కల్పించాలని నిర్ణయించుకున్నారు. రాష్ట్రం ఏర్పాటుకాగానే.. కాకతీయ వీవర్స్ సొసైటీ సభ్యులు కేంద్ర ఎంఎస్ఎంఈ (మైక్రో స్మాల్ అండ్ మీడియం ఎంటర్‌ప్రైజెస్) స్కీం కింద మడికొండ పారిశ్రామికవాడలో పవర్‌లూమ్ క్లస్టర్‌ను ఏర్పాటు చేసుకున్నారు.

## చలించిన సీఎం కేసీఆర్..

రాష్ట్రం ఆవిర్భావం జరిగిన తొలినాళ్లల్లో (2014లో) సూరత్–తెలంగాణ వలస ప్రజల ఐక్య సమితి ప్రతినిధులతో ముఖ్యమంత్రి కేసీఆర్ దాదాపు ఆరుగంటలపాటు చర్చించారు. అక్కడ తెలంగాణ చేనేత కార్మికులు పడుతున్న కష్టాలు తెలుసుకొని చలించిపోయారు. ఆజంజాహి మిల్లును తలదన్నే రీతిలో భారీ టెక్స్‌టైల్‌పార్క్‌ను నిర్మించుకుందాం అంటూ వరంగల్‌లో జరిగిన ఎన్నికల సభలో మాటఇచ్చిన విషయాన్ని ఈ సందర్భంగా వారికి గుర్తుచేశారు. త్వరలోనే రాష్ట్ర ప్రతినిధి బృందాన్ని మహారాష్ట్ర, గుజరాత్‌కు పంపిస్తామని హామీఇచ్చారు. 'రాష్ట్రాన్ని సాధించుకున్నాం. ఆత్మగౌరవంతో బతుకుదాం. రాష్ట్రానికి రండి' అంటూ పిలుపునిచ్చారు. అందులోభాగంగానే మాజీ ఉపముఖ్యమంత్రి కడియం శ్రీహరి, ఎమ్మెల్యేలు అరూరి రమేశ్, చల్లా ధర్మారెడ్డి, మాజీ ఐఏఎస్ అధికారి బీవీ పాపారావు, పరిశ్రమలశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ జయేశ్‌రంజన్ తదితరులను సూరత్, భివండీ, షోలాపూర్ తదితర ప్రాంతాలకు పంపి సమగ్ర అధ్యయనం చేయించారు. అనంతర పరిణామాల పర్యవసానంగానే రాష్ట్రప్రభుత్వం చేనేత విధానాన్ని ప్రకటించింది. కొద్దిరోజుల్లోనే వరంగల్ రూరల్ జిల్లా సంగెం, గీసుగొండ మండలాల్లో రెండువేల ఎకరాల సువిశాల ప్రాంతంలో కాకతీయ మెగా టెక్స్‌టైల్‌పార్క్‌కు శంకుస్థాపనచేశారు. దక్షిణకొరియా సహ దేశంలోని అనేక కంపెనీలు కాకతీయ మెగాటెక్స్‌టైల్ పార్క్‌లో పెట్టుబడులు పెట్టడానికి రాష్ట్ర ప్రభుత్వంతో ఒప్పందం కుదుర్చుకున్న విషయం తెలిసిందే.



మడికొండ పారిశ్రామికవాడలోని కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్క్‌లో ఏర్పాటుచేసిన యంత్రాలు

## తొలి పవర్‌లూమ్ క్లస్టర్ మడికొండ

వరంగల్ అర్బన్ జిల్లా మడికొండ పారిశ్రామికవాడలో 60 ఎకరాల్లో కాకతీయ టెక్స్‌టైల్ అండ్ వీవర్స్ వెల్ఫేర్‌కి చెందిన 364 మంది సభ్యుల టెక్స్‌టైల్ వ్యాపార సముదాయం రాష్ట్రంలోనే తొలి పవర్లూమ్ క్లస్టర్‌గా రూపుదిద్దుకుంటున్నది. ప్రభుత్వం, టీఎస్ఐఐసీ, కాకతీయ పట్టణాభివృద్ధి సంస్థ, కాకతీయ వీవర్స్ సొసైటీ వాటాగా దాదాపు రూ.10 కోట్లతో మౌలిక వసతులను కల్పిస్తున్నారు. ఇప్పటికే 260 షెడ్ల నిర్మాణం పూర్తిచేశారు. సూరత్, భివండీ,. షోలాపూర్ తదితర ప్రాంతాల్లోని అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో మిషన్లకు ధీటైన యంత్రాలు, యంత్ర పరికరాలను చైనా నుంచి దిగుమతి చేసుకుంటున్నారు. ఇప్పటికే 45 షెడ్స్‌లో మిషన్లను కూడా అమర్చారు.

## నౌకరీ చోడో.. వ్యాపార్ కరో..

**నౌకరీ చోడో..**వ్యాపార్ కరో.. ఇది నాలుగు దశాబ్దాల క్రితం గుజరాత్‌ను ప్రభావితం చేసిన నినాదం. పెద్దపెద్ద పెట్టుబడిదారులు రాష్ట్రంలో భారీస్థాయి పరిశ్రమల స్థాపనకు ముందుకొచ్చినప్పటికీ గుజరాతీలు మాత్రం ఉద్యోగాలు చేయడం మానేసి తమకున్న తెలివితేటలు, జ్ఞానంతో చిన్నచిన్న పెట్టుబడులతో కుటీరపరిశ్రమలను ఏర్పాటుచేసుకున్నారు. వాటితోనే వ్యాపారాల్లో అంచెలంచెలుగా ఎదిగారు. ఆ నినాదం అక్కడ కూలీలుగా చేరిన తెలంగాణ చేనేత కార్మికుల్లోనూ స్ఫూర్తి నింపింది. ప్రత్యేక రాష్ట్ర స్వప్నం సాకారంకావడంతో ఆ నినాదస్ఫూర్తితో తెలంగాణలో కొద్దిపాటి పెట్టుబడిని పెట్టి.. తమకున్న అనుభవాన్ని, ప్రభుత్వప్రోత్సాహాన్ని అందిపుచ్చుకొని పరిశ్రమలు ఏర్పాటుచేయాలని సంకల్పించారు.

## మగ్గం నుంచి మరయంత్రం దాకా..


**ఒకవైపు** దారం కండెను సరిచేస్తూ.. మరోవైపు మగ్గం గుంటలో కాళ్లుపెట్టి మగ్గాన్ని టక్.. టక్‌మని కొడుతూ నడిపినకాలం నుంచి ఓరుగల్లు వలస నేతన్న నేడు మరమగ్గాన్ని నడపటమే కాదు.. దాని నిర్వహణనూ ఔపోసన పట్టాడు. నైపుణ్యంగల నేతన్నగా మారాడు. రాట్నంపై నూలు వడకడం, కండెలకు దారం ఎక్కించడం, రంగు పూయడం, సాంచాలు నడపడం ఇలా ఒక్కొక్కరిదీ ఒక్కోపని. కానీ కాలం మారుతున్న కొద్దీ అన్నిపనుల్లో ఆరితేరి నైపుణ్యం కలిగిన పారిశ్రామికవేత్తగా మారాడు. సొంతగడ్డను వదిలి పేగుబంధాన్ని వదిలి పోగుబంధం పెనవేసుకున్న ఒకనాటి కూలీలే నేడు యజమానులుగా తరలివచ్చి పుట్టినగడ్డమీద ఉత్పత్తి శ్రామికులుగా అవతారం ఎత్తబోతుండటం విశేషం.



## ప్రత్యేక శిక్షణ కేంద్రం

కాకతీయ టెక్స్‌టైల్ అండ్ వీవర్స్ వెల్ఫేర్ సొసైటీ రూపొందిస్తున్న ప్రాంగణంలో ప్రత్యేకంగా శిక్షణకేంద్రాన్ని ఏర్పాటుచేస్తున్నారు. పదో తరగతి నుంచి డిగ్రీ చదివిన ఉద్యోగార్థులకు (చేనేత కార్మికుల పిల్లలు, ఇతర ఆసక్తిగల వారికి) టెక్స్‌టైల్‌రంగంలో వస్తున్న మార్పులు, ఉపాధి అవకాశాలు, యంత్రవినియోగం, పనివిధానం, మొదలైన అంశాలపై శిక్షణ ఇచ్చి ఇక్కడే ఉపాధి కల్పించేలా ఏర్పాట్లుచేశారు.

### ప్రభుత్వ సహకారం మరువలేం



గుజరాత్, మహారాష్ట్రకు వలసవెళ్లిన లక్షల మంది చేనేత కార్మికుల జీవితాలను బాగుచేయాలని సీఎం కేసీఆర్ కంకణం కట్టుకున్నారు. ఇతర రాష్ట్రాల్లో చేనేతరంగం అభివృద్ధిలో మన రాష్ట్ర నేతన్నల శ్రమ ఎంతో ఉన్నది. రాష్ట్రం వచ్చాకకూడా అక్కడే ఎందుకుండాలె అన్నది ప్రభుత్వ లక్ష్యం. మేమూ మా ప్రాంతానికి వెళ్లాలని ఇక్కడికొచ్చినం. ఇక్కడ యూనిట్ మొదలుపెట్టినం. రాష్ట్ర ప్రభుత్వం అందుతున్న సహకారం మరువలేం. కష్టపడేవారితో సొసైటీ ఏర్పాటు చేసుకున్నాం. కాకతీయ మెగా టెక్స్‌టైల్‌పార్క్ శంకుస్థాపనతో లక్షల మంది నేత కార్మికులకు ధైర్యమొచ్చింది.

–దర్గా స్వామి, అధ్యక్షుడు, కాకతీయ వీవర్స్ సొసైటీ, మడికొండ


### ఉద్యమకల నెరవేరుతున్నది



ఉద్యమకాలంలో సూరత్ తెలంగాణ వలస ప్రజల ఐక్యసమితి ఆధ్వర్యంలో అక్కడా ఉద్యమాలు చేసినం. తెలంగాణ సాధించిన కొద్దిరోజుల్లోనే సీఎం కేసీఆర్ మమ్ములను పిలిపించుకొని చర్చించారు. అప్పుడు గట్టి నమ్మకం కలిగింది. ఆ నమ్మకంతోనే ఇక్కడ యూనిట్ ప్రారంభిస్తున్నాం. పవర్‌లూమ్స్ నిర్వహణలో కలిసి ఉండాలని అనుకున్నం. ఆ కల నెరవేరింది.


–మచ్చా వీరన్న, కురవి, మహబూబాబాద్ జిల్లా

### పుట్టిన గడ్డమీద బతకటం కోసమే



నలభై ఏండ్ల క్రితం అక్కడకు పోయి కూలీ పనులు చేసినం. కూడులేక బతికినం. తిరిగి వస్తామో రామో అనుకునే వాళ్లం. మేం పడ్డ కష్టాలు మా పిల్లలు పడొద్దని ఆలోచించినం. ఇప్పుడు ఇక్కడ యూనిట్ యజమానులుగా మారినం. అసలు పుట్టిన గడ్డమీద బతకటం అనేది అన్నిటికన్నా సంతోషాన్ని ఇస్తున్నది.

–కూరపాటి ఐలయ్య, పెనుగొండ, కేసముద్రం



# తలనొప్పిని తేలిగ్గా తీసుకోవద్దు!


## బ్రెయిన్ ట్యూమర్

**తలనొప్పే కదా అనుకుంటే దాని వెనుక ప్రమాదం ఉండొచ్చు. మందులు వాడినా తలనొప్పి తగ్గదు. కాని పెరుగుతూ ఉంటుంది. రెండు వారాల వరకు అలాగే ఉందంటే మెదడులో ఏ కణితో ఉందేమో అని అనుమానించాలంటున్నారు వైద్యులు. మెదడులో ఏర్పడిన కణితివల్ల ఇంట్రా క్రేనియల్ ప్రెషర్ పెరిగి, ఆయా నరాలపై ప్రభావం పడుతుంది. అందుకే తలనొప్పితో పాటు వాంతులు, చూపు మసకబారడం, ఫిట్స్ లాంటివి వస్తాయి. వీటిని ఏమాత్రం నిర్లక్ష్యం చేయొద్దు.**

**మెదడులో ఏర్పడే** కణితులు క్యాన్సర్ వల్లనే కాదు.., క్యాన్సర్ కాని కణుతులు కూడా ఏర్పడవచ్చు. వీటిని బినైన్ ట్యూమర్లు అంటారు. మెనింజోమాస్, ష్వానోమాస్, పిట్యుటరీ ట్యూమర్లు సాధారణంగా బినైన్ కణితులే ఉంటాయి. గ్లయోమాస్, మెడ్యులో బ్లాస్టోమాస్, లింఫోమాస్ లాంటివి క్యాన్సర్ కణుతులు. ట్యూమర్ ఏర్పడిన భాగాన్ని బట్టి క్యాన్సర్ల పేర్లు ఉంటాయి. న్యూరోఎపిథీలియల్ కణజాలాల నుంచి పుట్టేవి సాధారణంగా గ్లయల్ ట్యూమర్లు అయి ఉంటాయి. వీటిలో ఆస్టియోసైటోమాస్, ఆలిగోడెంట్రో గ్లయోమాస్, ఎపెన్డైమోమాస్ ప్రధానమైనవి. ష్వానోమాస్, న్యూరో ఫైబ్రోమాస్ కణుతులు క్రేనియల్ లేదా స్పైనల్ నరాల నుంచి పుడుతాయి. మెదడు పొరలనుంచి పుట్టేవి మెనింజోమాస్. పిట్యుటరీ గ్రంథిలో రెండు రకాల కణుతులు ఏర్పడుతాయి. కొన్ని గ్రంథి పనితీరును దెబ్బతీస్తాయి. కొన్ని నాన్ ఫంక్షనల్ భాగాల్లో ఏర్పడుతాయి. ఫంక్షనల్ ట్యూమర్లు – ప్రొలాక్టినోమాస్, గ్రోత్ హార్మోన్ సెక్రిటింగ్ ట్యూమర్లు. కాగా నాన్ ఫంక్షనల్ ట్యూమర్లను అడినోమాస్ అంటారు. ఇవి గాకుండా లింఫోమాస్, జెర్మ్ సెల్ ట్యూమర్లు, మెటాస్టాటిక్ ట్యూమర్లు కూడా మెదడులో ఏర్పడుతుంటాయి.

### లక్షణాలు

- మెదడు పై భాగం (సుప్రా టెంటోరియల్ విభాగం – సెరిబ్రమ్)లో అంటే ఫ్రంటల్ లోబ్‌లో కణితి ఏర్పడినప్పుడు జ్ఞాపక శక్తి తగ్గిపోతుంది. ప్రవర్తనలో మార్పులు, మూత్ర విసర్జనలో సమస్యలు, కాళ్లూచేతులు బలహీనం అవుతాయి. మాటపై కూడా ప్రభావం పడుతుంది.
- పెరిటల్ లోబ్‌లో కణితి ఉంటే స్పర్శ దెబ్బతింటుంది. చేతితో ఏదైనా పట్టుకున్నా స్పర్శ తెలియదు.
- టెంపోరల్ లోబ్‌లో కణితి ఉంటే వినికిడి, వాసనలకు సంబంధించిన సమస్యలు వస్తాయి. ఏ శబ్దమూ లేకపోయినా ఏదో వినిపిస్తుంది. ఏమీ లేకపోయినా వాసన వస్తుంది.
- ఆక్సిపీటల్ లోబ్‌లో కణితి ఉంటే దృష్టి క్షేత్రంలో లోపాలు వస్తాయి. ఎదురుగా ఉన్నది మొత్తం కనిపించదు.
- మెదడు కింది భాగంలో (ఇంట్రా టెంటోరియల్ విభాగం – బ్రెయిన్ స్టెమ్, సెరిబెల్లమ్, క్రేనియల్ నరాలు) కణితి ఏర్పడినప్పుడు నడకలో సమస్య అంటే సరిగ్గా నడవలేరు. తూలుతూ ఉంటారు. మింగడం, మాటలో సమస్య ఉంటుంది. కంట్రోల్ లేకుండా కళ్లు పైకీ కిందకీ, పక్కలకీ కదిలిస్తుంటారు. (నిస్టేగ్మస్).



### ఆధునిక సర్జరీలు

**మైక్రోస్కోపిక్ సర్జరీ** – మెదడు లోపలి భాగాలను మాగ్నిఫై చేసి చూపిస్తుంది కాబట్టి నార్మల్‌గా ఉన్న మెదడు కణజాలానికి, ట్యూమర్ కణజాలానికి మధ్య తేడా స్పష్టంగా తెలుస్తుంది.

**ఎండోస్కోపిక్ సర్జరీలు** – పిట్యుటరీ కణితులకు ముక్కులో నుంచి వెళ్లి కణితి తీస్తారు.

అల్ట్రాసోనిక్ యాస్పిరేటర్

**ఇంట్రా ఆపరేటివ్ ఎంఆర్ఐ** – సర్జరీ తరువాత ఆపరేషన్ బెడ్ మీదనే ఎంఆర్ఐ చేసి ఇంకా ఎంత ట్యూమర్ తీయాలి అనేది చూసుకోవచ్చు. రికరెన్సీ తగ్గించొచ్చు.

**న్యూరో నావిగేషన్** – తలపై ప్రోబ్ పెట్టగానే ట్యూమర్ ఏ భాగంలో ఉందో చూపిస్తుంది. కాబట్టి ట్యూమర్ ఉన్న భాగంలోనే కట్ చేసి ఆపరేషన్ చేయొచ్చు. మొత్తం ఓపెన్ చేయాల్సిన అవసరం ఉండదు.

### సర్జరీ తరువాత


బయాప్సీలో కణితి బినైన్ దా, క్యాన్సర్‌దా అనేది తెలిసిపోతుంది. బినైన్ ట్యూమర్ అయితే 6 నెలలకు ఒకసారి ఫాలోఅప్‌కు రమ్మంటారు. క్యాన్సర్ కణితి అయితే రేడియేషన్, కీమోథెరపీ కోసం క్యాన్సర్ స్పెషలిస్టు దగ్గరికి పంపిస్తారు.

### కారణాలు

- డిఎన్ఎలో ఉత్పరివర్తనాలు (మార్పులు) సంభవించడం
- ట్యూమర్ సప్రెసార్ జీన్స్ (పి53) ఇన్‌హిబిషన్ వల్ల అసాధారణ పెరుగుదల కనిపిస్తుంది.
- వంశపారంపర్య కారణాలు – న్యూరోఫైబ్రోమాస్, వాన్ హిప్పెల్ లిండో (విహెచ్ఎల్) సిండ్రోమ్ లాంటివి
- తీవ్రమైన గాయాలు (ట్రామా)

### చికిత్స

ముందుగా మెదడుకు సిటి స్కాన్ చేస్తారు. ఆ తరువాత కణితి ఏ గ్రేడ్‌లో ఉందో తెలుసుకోవడానికి కాంట్రాస్ట్‌తో ఎంఆర్ఐ చేస్తారు. ఒకవేళ అది మెటాస్టాసిస్ అని బయటపడితే ఏ అవయవం దగ్గర కణితి మొదలైందో తెలుసుకోవడానికి పెట్-సిటి చేస్తారు. సాధారణంగా 3 సెంటీమీటర్ల సైజు కన్నా చిన్నగా ఉండే ట్యూమర్లకు, ష్వానోమాస్‌కి సర్జరీ అవసరం ఉండదు. రేడియోథెరపీతో చికిత్స చేస్తారు. సర్జరీని జనరల్ అనెస్తీషియాలో చేయొచ్చు. లేదా అవేక్ సర్జరీ కూడా చేయొచ్చు. దీన్ని అవేక్ క్రేనియాటమీ అంటారు. కదలికలను కంట్రోల్ చేసే మోటార్ భాగంలో అంటే ఫ్రంటల్ లోబ్‌లో కణితులు ఏర్పడినప్పుడు జనరల్ అనెస్తీషియా ఇవ్వడం కన్నా అవేక్ క్రేనియాటమీ మంచి ఫలితాన్ని ఇస్తుంది. కణితిలో కొంచెం భాగం తీసేసి పేషెంట్ మెలకువతో ఉంటాడు కాబట్టి కాళ్లూ చేతుల కదలిక ఎలా ఉందో చెక్ చేయడం దీనివల్ల సాధ్యమవుతుంది. కొన్నిసార్లు కణితిని తీయడానికి ముట్టుకోగానే కదలిక ప్రభావితం కావొచ్చు. ఇలాంటప్పుడు దాన్ని శస్త్రచికిత్సతో తీయకుండా, కీమో లేదా రేడియేషన్ ఇస్తారు. కదలికలు దెబ్బతినకుండా సర్జరీ చేయడం ఈ విధానంలో సాధ్యపడుతుంది.



### స్టీరియోటాక్టిక్ బయాప్సీ

పుర్రె తెరువకుండా దాదాపు 2 మి.మీ. రంధ్రం చేసి, దాని గుండా చిన్న సూదిని పంపి చేసే బయాప్సీ ఇది. ఈ విధానంలో మొదట తలకు ఒక ఫ్రేమ్ ఫిక్స్ చేస్తారు. లోకల్ అనెస్తీషియా ఇస్తారు. తరువాత సిటి/ఎంఆర్ఐ చేస్తారు. అప్పుడు కొన్ని కొలతల ఆధారంగా సూదిని ఎక్కడి నుంచి, ఎంత పొడవు వరకు లోపలికి పంపాలనేది నిర్ణయిస్తారు. ఆ సూదితో బయాప్సీ తీస్తారు. స్టీరియాటాక్టిక్ బయాప్సీ సాధారణంగా వృద్ధులు, జనరల్ అనెస్తీషియా ఇవ్వలేని వాళ్లకు, ఎక్కువ చోట్ల కణితులున్నవాళ్లకు, కణితి మెదడులో లోతుగా, లోపలి కణజాలాల్లో ఏర్పడినప్పుడు, మోటార్ కార్టెక్స్, థాలమస్, బ్రెయిన్ స్టెమ్ లాంటి కీలకమైన భాగాల్లో కణితులు ఏర్పడినప్పుడు ఈ రకమైన బయాప్సీ చేస్తారు. సాధారణంగా మెదడులో లోతుగా ఉన్న కణజాలాల్లో ఏర్పడే కణితులు క్యాన్సర్‌వే అయివుంటాయి. వీటికి కీమో లేదా రేడియేషన్ ఇస్తారు. ఎక్కువ చోట్ల కణితులుండడానికి కారణం టిబి అవ్వొచ్చు.




**డాక్టర్ భవాని ప్రసాద్ గంజి**
సీనియర్ స్పైన్ & న్యూరోసర్జన్
యశోద హాస్పిటల్స్, సికింద్రాబాద్
8121022333


పొలం పనులు చేసుకునే రైతులు.., బరువులు మోసే కూలీలు.. ఇంతకుముందైతే నడుంనొప్పికి కేరాఫ్ అడ్రస్‌లు వీళ్లు. ఇప్పుడు మాత్రం నడుము నొప్పో, మెడనొప్పో కనిపించని సాఫ్ట్‌వేర్ ఉద్యోగి ఉండరంటే అతిశయోక్తి కాదు. ఎక్కువ సేపు కూర్చుని ఉండడం, కూర్చునే భంగిమ లాంటివన్నీ ఈ సమస్యలకు ప్రధాన కారణాలు. ఎక్కువ మంది భుజాలు జార్చి కూర్చుంటుంటారు. కాని కూర్చున్నా, నిల్చున్నా వెన్ను నిటారుగా ఉంచాలి. ఎక్కువ సమయం కూర్చోవాల్సి వస్తే వెనకాల సపోర్టు ఉండాలి. గంటకోసారి లేచి, అటూ ఇటూ నడవాలి. లేకుంటే ఆపరేషన్ చేయాల్సిన పరిస్థితి వస్తుంది.

# నిటారుగా కూర్చోండి.. నడుమునొప్పికి బై చెప్పండి!



**ఇటీవలి కాలంలో** నడుమునొప్పి, వెన్నునొప్పి లాంటి వాటికి చిన్నా పెద్దా వయసు తేడా లేకుండా పోయింది. యువతలో జీవనశైలి కారణమైతే చిన్న పిల్లల్లో కూడా నడుము నొప్పి రావడానికి కారణం మాత్రం స్కూల్ బ్యాగులే. కొందరు పిల్లలకు పుట్టుకతోనే ఎముక సమస్యలు ఉండడం వల్ల కూడా ఈ నొప్పులు రావొచ్చు. సాధారనంగా స్పైన్ ఫ్యూజన్స్ ఏర్పడి ఇలాంటి సమస్యలు వస్తాయి. ఇక వయసు పెరిగిన వాళ్లలో ముఖ్యంగా ఆడవాళ్లలో కాల్షియం తగ్గిపోయి ఆస్టియోపోరొసిస్ సమస్య వస్తుంది. దీనివల్ల ఎముకలు అరిగిపోతాయి. ఎముకలు అరిగిపోవడం వల్ల నడుము నొప్పి, కీళ్లనొప్పులు సర్వసాధారణం. మెనోపాజ్ దాటినవాళ్లలో ఈ నొప్పులు సాధారణంగా కనిపిస్తాయి. గుంతల రోడ్లు, స్టైల్‌గా ముందుకు వంగి నడపాల్సిన బండ్లు కూడా డిస్క్ సమస్యలను తెస్తున్నాయి.

### లక్షణాలు

నడుమునొప్పి వస్తూ పోతూ ఉంటుంది. కూర్చున్నప్పుడు, పని చేసేటప్పుడు నొప్పి లేస్తుంది. మొదటి దశలో ఇలా నొప్పి వచ్చిపోవడానికి కారణం నడుము కండరాలు బలహీనంగా ఉండడం. ఎముక, కండరాలపై బరువు సమానంగా పడాలి. లేకపోతే నొప్పి వస్తుంది. ఇలాంటప్పుడు మూడు నాలుగు రోజులు మందులు వాడి, వ్యాయామం చేస్తే తగ్గుతుంది. కండరాలను బలోపేతం చేసే వ్యాయామాలు చేయాలి. – కూర్చుని లేచేటప్పుడు, ఎక్కువ సేపు నడిచినప్పుడు, ఎక్కువ సేపు కూర్చున్నప్పుడు, నిలబడినప్పుడు నొప్పి ఉంటుంది. మొదట్లో నొప్పి వస్తూ తగ్గుతూ ఉంటుంది. ఆ తరువాత ఎప్పటికీ నొప్పి ఉంటూనే ఉంటుంది. నొప్పి తీవ్రత పెరుగుతుంది. దీన్ని కూడా నిర్లక్ష్యం చేస్తే సయాటికా నొప్పిగా మారుతుంది.

- కండరం పట్టేయడం (మజిల్ స్పాజ్మ్) వల్ల నొప్పి తీవ్రంగా ఉంటుంది. కండరం పట్టేయడానికి రెండు కారణాలుంటాయి. నడుము కండరం సంకోచించి అలాగే ఉండిపోవడం ఒక కారణం. పడుకున్నప్పుడు ఇది కొంచె రిలాక్స్ అవుతుంది. అందువల్ల రెస్ట్‌లో నొప్పి తగ్గుతుంది. ఇలాంటప్పుడు ఏ పనిచేసినా, నిల్చున్నా, నడిచినా నొప్పే ఉంటుంది. పడుకుంటే మాత్రం తగ్గుతుంది. ఇప్పుడు కూడా మూడు నాలుగు రోజులు మందులు వాడి, ఫిజియోథెరపీ చేస్తే నొప్పి తగ్గిపోతుంది. ఇకపోతే డిస్క్ చిరిగిపోయి దాని నుంచి రసాయనాలు విడుదలవడం వల్ల కూడా మజిల్ స్పాజ్మ్ అవుతుంది.
- చివరగా నడుము నుంచి నొప్పి కాళ్లకు పాకుతుంది. దీన్ని సయాటికా అంటారు. చినిగిన డిస్క్ పక్కనున్న కాలుకు వెళ్లే సయాటికా నరంపై ఒత్తిడి కలిగిస్తుంది. అందుకే నడుములో మొదలైన నొప్పి కాలుకు పాకుతుంది. ఇందుకు మరో కారణం రాడిక్యులైటిస్ – రసాయనాలు నరం మూలాన్ని ఇరిటేట్ చేసి నొప్పి కలిగిస్తాయి. దాంతో ఇది కాలికి పాకుతుంది. సయాటికా ఉన్నవాళ్లకు రెడ్ ఫ్లాగ్ సంకేతాలు కనిపిస్తే ఎంఆర్ఐ చేసి వెంటనే సర్జరీ చేయాల్సి ఉంటుంది.

### వీళ్లలో ఎక్కువ

- డ్రైవర్లు – ఎక్కువ దూరం డ్రైవ్ చేసినప్పుడు ఎక్కువసేపు కూర్చుని ఉంటారు కాబట్టి నడుము నొప్పి వస్తుంది.
- కూలీపని చేసేవాళ్లు, బరువులు మోసేవాళ్లలో ఎక్కువ.
- సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు ఎప్పుడూ కూర్చునే పనిచేయాలి కాబట్టి వీళ్లలో మెడనొప్పి ఎక్కువ.
- మెనోపాజ్ దశకు చేరిన మహిళలు

### రెడ్ ఫ్లాగ్ సంకేతాలు

- కాళ్లకు పట్టు ఉండదు. చెప్పులు వేసుకుంటే కూడా కాలి నుంచి జారిపోతాయి.
- మూత్ర విసర్జన సమస్య – ఇన్‌కాంటినెన్స్ ఉంటుంది.
- మల విసర్జనపై పట్టు ఉండదు.
- డిస్క్‌లో ఇన్‌ఫెక్షన్ ఉంటే నడుము నొప్పితో పాటు తీవ్రమైన జ్వరం కూడా ఉంటుంది.

### సమస్యకు మూలాలివే..

- ట్రామా – అకస్మాత్తుగా బైక్ మీద నుంచి కింద పడడం, మెట్లు ఎక్కుతూ, దిగుతూ కింద పడడం
- వెన్నుపాములో ఇన్‌ఫెక్షన్లు – క్షయ, ఇతర బాక్టీరియా ఇన్‌ఫెక్షన్లు
- వెన్నుపాములో కణుతులు
- డిస్క్ డీజనరేషన్ – డిస్క్‌లోని కొల్లాజన్ తగ్గిపోవడం. వయసుతో పాటు కొల్లాజన్ తగ్గడం వల్ల గ్యాప్ తగ్గి, నరం మూలం ఇరిటేట్ అవుతుంది.
- డిస్క్ బల్జ్ – డిస్క్‌పై ఒత్తిడి వల్ల అది బయటికి వస్తూ, లోపలికి వెళ్తూ ఉంటుంది. నడుము కండరాలు బలహీనంగా ఉండడం వల్ల ఇలా జరుగుతుంది.
- డిస్క్ ప్రొట్రూజెన్ – డిస్క్‌పై బరువు పడడం వల్ల డిస్క్ బయటికి వచ్చేస్తుంది. దీన్నే డిస్క్ ప్రొలాప్స్ అంటారు.
- ఎక్స్‌ట్రూడెడ్ డిస్క్ – డిస్క్‌పై చిన్నగా టేర్ అవుతుంది. దాని నుంచి రసాయనాలు బయటకు వస్తాయి.
- మైగ్రేటెడ్ డిస్క్ – డిస్క్ మొత్తం వెళ్లి ఇంకోచోట ఉంటుంది.

### సర్జరీ

**ఓపెన్ లామినెక్టమీ** – ఓపెన్ డిసెక్టమీ – వీటి ద్వారా ఎముకను కట్ చేసి దాని ద్వారా వెళ్లి డిస్క్‌ను తొలగిస్తారు. ఈ సంప్రదాయిక సర్జరీ ద్వారా ఎముక తీయకుండా డిస్క్‌ను తీయడం సాధ్యం కాదు. నడుము వెనుక నుంచి వెళ్లి ఈ సర్జరీ చేస్తారు.

**మైక్రోస్కోపిక్ డిసెక్టమీ** - ఓపెన్ సర్జరీ కన్నా చిన్న కోత (1 సెంటీమీటర్) పెట్టి మైక్రోస్కోప్‌లో చూస్తూ సర్జరీ నిర్వహిస్తారు.

వీటి తర్వాత ఇప్పుడు ఎక్కువ కోత అవసరం లేని సర్జరీలు చేస్తున్నారు.

**కీహోల్** – ఎండోస్కోపిక్ డిసెక్టమీ : నడుము పక్క వైపు నుంచి 1 సెం.మీ కన్నా చిన్న రంధ్రం పెడతారు. దీని నుంచి డైరెక్ట్‌గా డిస్క్ స్పేస్‌లోకి వెళ్తారు. మైక్రోస్కోప్‌లో చూస్తూ నరం మీద ఒత్తిడిని తీసేసి నరాన్ని ఒత్తిడి నుంచి ఫ్రీ చేస్తారు.


**రేడియో అబ్లేషన్** - రేడియో ఫ్రీక్వెన్సీని పంపి డీజనరేట్ అయిన డిస్క్‌ను అబ్లేట్ చేస్తారు.

**ఫిక్సేషన్లు** – కొన్నిసార్లు డిస్క్ డీజనరేషన్ వల్ల ఒక ఎముక ఇంకోదానిపై నుంచి కిందకి జారుతుంది (లిస్తెసిస్). ఈ సమస్యకు ఇంతకుముందు ఓపెన్ సర్జరీ చేసేవాళ్లు ఇప్పుడు మినిమల్లీ ఇన్వేసివ్ స్పైన్ సర్జరీ (ఎంఐఎస్ఎస్) ద్వారా జారిపోయిన దాన్ని సరిచేసి స్క్రూలతో ఫిక్స్ చేస్తున్నారు.



### డయాగ్నసిస్

శారీరక పరీక్షల్లో భాగంగా స్ట్రెయిట్ లెగ్ రైజింగ్ టెస్ట్ చేస్తారు. కాలును పైకి లేపడం, ఇటూ అటూ కదిలించడం లాంటివి చేయించి పరీక్షిస్తారు. నరంపై ఒత్తిడి ఉంటే కాలును 30 డిగ్రీల కన్నా ఎక్కువ పైకి లేపలేరు. ఎల్5 నరం ప్రభావితం అయితే పాదాలను కదల్చలేరు. కాళ్ల కదలికలను బట్టి అంటే ఏ రకంగా కదల్చలేకపోతున్నారూ అనే దాన్ని బట్టి సమస్య ఏది, ఎక్కడుందనేది నిర్ధారిస్తారు. ఈ పరీక్ష వల్ల నొప్పికి కారణం కండరమా, నరమా, ఎముకా అనేది తెలుస్తుంది. అవసరాన్ని బట్టి ఎక్స్‌రే, ఇన్‌ఫెక్షన్ కోసం రక్తపరీక్ష, ఎంఆర్ఐ కూడా చేస్తారు.

**డాక్టర్ కె.యస్. కిరణ్**
సీనియర్ స్పైన్ & న్యూరోసర్జన్
యశోద హాస్పిటల్స్, సికింద్రాబాద్
8121022333


# నిపుణ — విద్య ఉద్యోగ సమాచారం —

**జాతీయస్థాయిలో నిర్వహించే నేషనల్ ఎలిజిబిలిటీ టెస్ట్ (నెట్) జూన్ నోటిఫికేషన్లను నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ విడుదల చేసింది.**

## యూపీఎస్సీ

**న్యూఢిల్లీలోని యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (యూపీఎస్సీ) కేంద్రంలోని పలు శాఖల్లో కింది పోస్టుల భర్తీకి ప్రకటన విడుదల చేసింది.**

- **మొత్తం ఖాళీలు:** 85
- **పోస్టులు:** చీఫ్ డిజైన్ ఇంజినీర్, అసిస్టెంట్ ఇంజినీర్, అసిస్టెంట్ వెటర్నరీ ఆఫీసర్, అసిస్టెంట్ ఎంప్లాయిమెంట్ ఆఫీసర్ తదితరాలు ఉన్నాయి.
- **అర్హత:** సంబంధిత సబ్జెక్టుల్లో ఇంజినీరింగ్ డిగ్రీ, పీజీ ఉత్తీర్ణత, అనుభవం ఉండాలి.
- **ఎంపిక విధానం:** రిక్రూట్‌మెంట్ టెస్ట్, ఇంటర్వ్యూ
- **దరఖాస్తు:** ఆన్‌లైన్‌లో
- **చివరితేదీ:** ఏప్రిల్ 2
- **వెబ్‌సైట్:** https://www.upsc.gov.in

## ఎన్‌టీఏ నెట్-2020



**యూజీసీ నెట్ జూన్-2020**

- **సబ్జెక్టులు:** హ్యూమానిటీస్, లాంగ్వేజెస్ తదితరాలకు సంబంధించిన మొత్తం 81 సబ్జెక్టుల్లో యూజీసీ నెట్‌ను నిర్వహిస్తారు.

**సీఎస్ఐఆర్-యూజీసీ నెట్-2020**

- సీఎస్ఐఆర్-యూజీసీ సంయుక్తంగా నిర్వహించే నెట్ ఎగ్జామ్‌ను ఐదు సబ్జెక్టుల్లో నిర్వహిస్తారు.
- **సబ్జెక్టులు:** లైఫ్ సైన్సెస్, ఫిజికల్ సైన్సెస్, కెమికల్ సైన్సెస్, ఎర్త్, అట్మాస్ఫియరిక్, ఓషన్ అండ్ ప్లానెటరీ సైన్సెస్, మ్యాథమెటికల్ సైన్సెస్.
- పై రెండు పరీక్షలను కంప్యూటర్ బేస్డ్ టెస్ట్ (సీబీటీ) ద్వారా నిర్వహిస్తారు.
- జూనియర్ రిసెర్చ్ ఫెలో (జేఆర్ఎఫ్), అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుకు అర్హత కోసం నెట్ ఎగ్జామ్ నిర్వహిస్తారు.

**పై రెండు నెట్‌ల ముఖ్యతేదీలు:**

- **దరఖాస్తు:** ఆన్‌లైన్‌లో
- **చివరితేదీ:** ఏప్రిల్ 16
- **పరీక్షతేదీ:** యూజీసీ నెట్- జూన్ 15-20 మధ్య నిర్వహిస్తారు.
- సీఎస్ఐఆర్-యూజీసీ నెట్- జూన్ 21న నిర్వహిస్తారు.
- **వెబ్‌సైట్:** https://nta.ac.in

## కళింగలో ప్రవేశాలు

**ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎమినియన్స్ గుర్తింపు పొందిన కళింగ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండస్ట్రియల్ టెక్నాలజీ (కేఐఐటీ) యూజీ, పీజీ కోర్సుల్లో ప్రవేశాల కోసం ప్రకటన విడుదలైంది.**

- కేఐఐటీ డీమ్డ్ యూనివర్సిటీ. ఈ సంస్థలో ప్రవేశాల కోసం నిర్వహించే పరీక్ష కోసం అప్లికేషన్, ఎగ్జామ్ ఫీజు లేదు.
- **కోర్సులు:** బీటెక్, బీఆర్క్, బీఎస్సీ నర్సింగ్, బీఏ ఎల్ఎల్‌బీ, బీఎస్సీ, ఎమ్మెస్సీ, ఎంఏ, ఎంటెక్, ఎల్ఎల్ఎం, ఎంబీఏ, పీహెచ్‌డీ తదితరాలు ఉన్నాయి.
- **దరఖాస్తు:** ఆన్‌లైన్‌లో, **చివరితేదీ:** మార్చి 31
- **వెబ్‌సైట్:** www.kiit.ac.in

## సీపెట్‌లో 70 ఖాళీలు

**చెన్నైలోని సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ప్లాస్టిక్స్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ(సిపెట్)లో కాంట్రాక్టు ప్రాతిపదికన కింది పోస్టుల భర్తీకి ప్రకటన విడుదలైంది.**



- **పోస్టు:** అసిస్టెంట్ ప్రొఫెసర్ (గ్రేడ్ 1, 2, 3)
- **మొత్తం ఖాళీలు:** 70
- **అర్హతలు:** సంబంధిత సబ్జెక్టుల్లో ఎంఈ/ ఎంటెక్, పీహెచ్‌డీ ఉత్తీర్ణత, అనుభవం ఉండాలి.
- **ఎంపిక విధానం:** రాతపరీక్ష, స్కిల్/ ప్రాక్టికల్ టెస్ట్, ఇంటర్వ్యూ .
- **దరఖాస్తు:** ఆఫ్‌లైన్‌లో
- **చివరితేదీ:** ఏప్రిల్ 13
- **వెబ్‌సైట్:** https://www.cipet.gov.in

నమస్తే తెలంగాణ
ఆట
12
[ కరీంనగర్ ]
మంగళవారం 17 మార్చి 2020
WWW.NTNEWS.COM

# వేచి చూడటమే

**ఐపీఎల్ ప్రారంభంపై ఫ్రాంచైజీల ధోరణి**

**టెలీకాన్ఫరెన్స్‌లో కరోనా పరిస్థితిపై సమీక్ష**



**న్యూఢిల్లీ:** ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) 13వ సీజన్ ప్రారంభంపై ఇప్పుడప్పుడే స్పష్టత వచ్చే అవకాశాలు కనిపించడం లేదు. మూడు రోజుల క్రితం నిర్వహించిన బీసీసీఐ, ఐపీఎల్ పాలక మండలి సమావేశంలో వేచి చూడాలనే నిర్ణయం తీసుకోగా.. తాజాగా సోమవారం ఎనిమిది ఫ్రాంచైజీల యజమానులతో జరిగిన టెలీకాన్ఫరెన్స్‌లోనూ అదే ధోరణి కొనసాగింది. 'తాజా సమావేశంలో ఎలాంటి పురోగతి లేదు. ఇది కేవలం ఫాలోఅప్ మీటింగే. గత రెండు రోజుల్లో పరిస్థితుల్లో ఎలాంటి మార్పు రాలేదు. కాబట్టి ఐపీఎల్ నిర్వహణ కు సంబంధించిన అంశాలు చర్చకు రాలేదు. ప్రస్తుతానికైతే వేచి చూడాలనే అనుకుంటున్నాం. పరిస్థితిని సమీక్షించేందుకు వారానికోసారి సమావేశం నిర్వహిస్తాం' అని ఓ ఫ్రాంచైజీ యజమాని తెలిపారు.
మహమ్మారి కరోనా వైరస్ రోజురోజుకూ ప్రమాదకరంగా మారుతున్న నేపథ్యంలో.. జన సమూహాలు ఒక్కచోట చేరడం మంచిది కాదని కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ ఉత్తర్వులు జారీ చేసిన నేపథ్యంలో.. షెడ్యూల్ ప్రకారం ఈనెల 29న ప్రారంభం కావాల్సిన ఐపీఎల్‌ను ఏప్రిల్ 15కు వాయిదా వేసిన విషయం తెలిసిందే. దీంతో తాజా సీజన్‌లో 17 రోజులు కోల్పోవడంతో ఐపీఎల్ పూర్తిగా జరుగుతుందా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. 'షెడ్యూల్‌లో కోత తప్పకపోవచ్చు' అని బీసీసీఐ అధ్యక్షుడు గంగూలీ అన్న మాటలు దీనికి మరింత బలాన్ని చేకూరుస్తున్నాయి. కొవిడ్-19 వ్యాప్తిని అరికట్టడంలో భాగంగా కేంద్ర ప్రభుత్వం ఏప్రిల్ 15 వరకు వాణిజ్య వీసాలు రద్దు చేసిన నేపథ్యంలో విదేశీ ఆటగాళ్లు కూడా లీగ్‌లో పాల్గొనే అవకాశం లేకపోయింది. దీంతో కళ తప్పిన టోర్నీని ఎలా నిర్వహిస్తారో అనే సందేహాలు పెరుగుతున్నాయి. అయితే పాలక మండలి సమావేశంలో ప్రత్యామ్నాయాలకు సంబంధించి ఆరేడు అంశాలు చర్చకు వచ్చాయి. ఒకవేళ పరిస్థితి అదుపులోకి వస్తే.. మొత్తం 8 జట్లను రెండు గ్రూప్‌లుగా విభజించి.. వారాంతాల్లో రెండేసి మ్యాచ్‌ల చొప్పున లీగ్ నిర్వహించే చాన్స్‌లు పరిశీలిస్తున్నట్లు సమాచారం.

## రెండు నెలలు క్రికెట్ బంద్

**దక్షిణాఫ్రికా నిర్ణయం**

**జొహన్నెస్‌బర్గ్:** కరోనా వైరస్ కారణంగా దేశంలో రెండు నెలల పాటు అన్ని రకాల క్రికెట్ పోటీలను నిలిపివేస్తున్నట్టు క్రికెట్ దక్షిణాఫ్రికా(సీఎస్‌ఏ) సోమవారం ప్రకటించింది. దేశ అధ్యక్షుడు సిరిల్ రామఫోసా.. కరోనాను జాతీయ విపత్తుగా ప్రకటించిన నేపథ్యంలో సీఎస్‌ఏ ఈ నిర్ణయం తీసుకుంది. 'దేశంలో అన్ని ఫార్మాట్ల క్రికెట్ పోటీలను తక్షణమే నిలిపివేయాలని సీఎస్‌ఏ నిర్ణయం తీసుకుంది. ఇది 60రోజుల పాటు కొనసాగుతుంది. ఫస్ట్‌క్లాస్, లిస్ట్-ఏ క్రికెట్‌తో పాటు అన్ని సెమీప్రొఫెషనల్, జూనియర్ క్రికెట్ పోటీలను నిలిపేస్తున్నాం' అని సీఎస్‌ఏ వెల్లడించింది. భారత పర్యటనకు వచ్చిన దక్షిణాఫ్రికా జట్టు వన్డే సిరీస్ మధ్యలోనే రద్దవడంతో కోల్‌కతా మీదుగా స్వదేశానికి వెళ్లేందుకు సిద్ధమైంది. అలాగే దక్షిణాఫ్రికాలో జరగాల్సిన ప్రీమియర్ సాకర్ లీగ్ సైతం వాయిదా పడింది.



**కోల్‌కతాలో సోమవారం హోటల్ వద్ద దక్షిణాఫ్రికా కెప్టెన్ డికాక్‌కు కరోనా పరీక్ష నిర్వహిస్తున్న సిబ్బంది**

## టెన్నిస్ టూర్‌కు బ్రేక్



**ప్యారిస్:** కొవిడ్-19 ప్రభావం వల్ల అంతర్జాతీయ టెన్నిస్ సమాఖ్య (డబ్ల్యూటీఏ) మహిళల సీజన్‌ను మే 2 వరకు రద్దుచేసింది. వైరస్ ప్రభావం పెరుగుతుండటంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు సోమవారం ప్రకటించింది. 'ప్రస్తుత పరిస్థితుల్లో డబ్ల్యూటీఏ మహిళల టూర్‌ను మే 2 వరకు రద్దు చేస్తున్నాం. దీంతో టూర్‌లో భాగంగా జరుగాల్సిన స్టట్‌గార్డ్ ఓపెన్, ఇస్తాంబుల్ ఓపెన్ వాయిదా పడ్డట్లే'అని డబ్ల్యూటీఏ అధికారి తెలిపారు. పురుషుల షెడ్యూల్‌ను ఏప్రిల్ 27 వరకు రద్దు చేశారు. ఈ ఏడాది రెండో గ్రాండ్‌స్లామ్ టోర్నీ, ఫ్రెంచ్ ఓపెన్ మే 24న ప్రారంభం కావాల్సిఉన్న విషయం తెలిసిందే.




# జీవితాలను త్యాగం చేయలేం

**ఒలింపిక్స్‌పై జపాన్‌లో అత్యధికుల అభిప్రాయం .. వాయిదా లేదా రద్దు చేయాలని డిమాండ్**

**కరోనా భయంతో విశ్వక్రీడలపై పెరుగుతున్న వ్యతిరేకత.. నేడు సభ్యదేశాలతో ఐఓసీ సమావేశం**

**కరోనా వైరస్ విజృంభణతో టోక్యో ఒలింపిక్స్ నిర్వహణ సాధ్యమవుతుందా అన్న సందిగ్ధత పెరుగుతూనే ఉంది. జపాన్ ప్రధాని షింజో అబే సహా ఐవోసీ అధికారులు షెడ్యూల్ ప్రకారమే విశ్వక్రీడలు జరుపుతామన్నా.. పరిస్థితులు మాత్రం రోజురోజుకూ ప్రతికూలంగా మారుతూనే ఉన్నాయి. కరోనా మహమ్మారి తీవ్రంగా ఉన్న విపత్కర పరిస్థితుల్లో ఒలింపిక్స్ నిర్వహించడాన్ని జపాన్‌లో అత్యధికులు వ్యతిరేకిస్తున్నారు. తమ జీవితాలను తాకట్టు పెట్టి క్రీడలు నిర్వహించాల్సిన అవసరం లేదని అభిప్రాయపడుతున్నారు. ఈ నేపథ్యంలో తాజా పరిస్థితులపై సభ్య క్రీడా దేశాలతో ఐవోసీ నేడు నిర్వహించనున్న సమావేశంపై సర్వత్రా ఆసక్తి నెలకొంది.**

**టోక్యో:** కరోనా వైరస్(కొవిడ్-19) విజృంభణతో టోక్యో ఒలింపిక్స్ నిర్వహణపై అనుమానాలు నానాటికీ పెరుగుతూనే ఉన్నాయి. జపాన్ ప్రధాని షింజో అబేతో పాటు ఐవోసీ చీఫ్ థామస్ బాచ్ ఒలింపిక్స్ షెడ్యూల్ ప్రకారమే జరుగుతాయని ప్రకటించినా.. జపాన్‌వాసుల్లో అత్యధికులు విశ్వక్రీడలు నిలిపివేస్తేనే బాగుంటుందని అభిప్రాయపడుతున్నారని ఓ సర్వేలో తేలింది. తమ జీవితాలను తాకట్టు పెట్టి క్రీడలను నిర్వహించొద్దని ప్రభుత్వాన్ని కోరారు. జపాన్‌లో ఇప్పటికే 814మంది కరోనా వైరస్‌కు గురికాగా, 24మంది మరణించారు. అయితే ఒలింపిక్స్‌కు నాలుగు నెలల సమయం ఉండడంతో దేశంలో వైరస్ ప్రభావం తగ్గినా.. విదేశాల నుంచి వచ్చే వారి వల్ల మళ్లీ వచ్చే ప్రమాదముందని జపాన్ ప్రజలు భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు. షెడ్యూల్ ప్రకారం జూలై 24 నుంచి ఆగస్టు 9వరకు విశ్వక్రీడలు జరగాల్సి ఉంది.

### 70శాతం మంది నో..

ఈనెల 6 నుంచి 9వ తేదీ మధ్య జపాన్ బ్రాడ్‌కాస్టర్ ఎన్‌హెచ్‌కే.. ఒలింపిక్స్ నిర్వహణపై దేశ వాసుల అభిప్రాయాలను సేకరించింది. సర్వేలో పాల్గొన్న 45శాతం మంది టోక్యో ఒలింపిక్స్ నిర్వహించడాన్ని వ్యతిరేకించగా.. 40శాతం మంది సమర్థించారు. మరోసారి తాజాగా వెయ్యి మంది అభిప్రాయాలను సేకరించగా అందులో 69.9 మంది టోక్యో ఒలింపిక్స్‌ను షెడ్యూల్ ప్రకారం నిర్వహించకూడదని అభిప్రాయపడ్డారని ఎన్‌హెచ్‌కే సోమవారం వెల్లడించింది.

### ప్రాణాలను త్యాగం చేయలేం..

ఒలింపిక్స్ నిర్వహణపై చాలా మంది జపాన్ ప్రజలు మీడియా ద్వారా అభిప్రాయాలను వ్యక్తం చేశారు. 'కరోనా సంక్షోభం నుంచి జపాన్ బయటపడినా.. ప్రపంచ నలుమూలల నుంచి విదేశీయులు రావడం ఇబ్బందికరంగా మారుతుంది. అందుకే ఒలింపిక్స్ నిర్వహించకపోవడమే ఉత్తమం. ఆటల కోసం జీవితాన్ని త్యాగం చేయలేం' అని కోకి మురా అనే ఉద్యోగి చెప్పారు. 'ట్రంప్ చెప్పినట్టు.. ఒలింపిక్స్‌ను సంవత్సరం పాటు వాయిదా వేయడం మంచిదనేదే నా అభిప్రాయం కూడా. ఇది కాస్త నిరాశ కలిగించేదే అయినా తప్పదు' అని 90ఏండ్ల మసావ్ సుగవారా అన్నారు. రెండో ప్రపంచ యుద్ధం తర్వాత ఒలింపిక్స్‌పై ఇంతటి ఆందోళన రేగడం ఇప్పుడే చూస్తున్నానని చెప్పారు. 'చాలా జాగ్రత్తగా ఉండాల్సిన అవసరం ఉంది. వైరస్ వ్యాప్తి జూన్‌లోగా నియంత్రణలోకి రాకపోతే వాయిదా వేయడమే మంచిది' అని న్యాయవాది మాన్‌ఫ్రెడ్ చెప్పారు. కాగా, ప్రపంచ వ్యాప్తంగా ఒలింపిక్స్ క్వాలిఫయర్స్ సహా మిగిలిన టోర్నీలు రద్దవుతుండడంతో కొందరు అథ్లెట్లు సైతం ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

### జీవితంలో ఒకసారి

ప్రస్తుత పరిస్థితుల్లో ఒలింపిక్స్ నిర్వహించవద్దంటూ మెజారిటీ జపాన్ వాసులు తమ డిమాండ్ వినిపిస్తుంటే..మరోవైపు జీవితంలో ఒకసారి వచ్చే అవకాశాన్ని చేజార్చుకోవద్దని మరికొందరు అంటున్నారు. 'స్వదేశంలో విశ్వక్రీడలు చూసే అవకాశం జీవితంలో ఒకసారే దక్కొచ్చు. అందుకే నా కొడుకును తీసుకెళ్లాలనుకుంటున్నాను. కానీ కరోనా వైరస్ వ్యాప్తి ఇలాగే కొనసాగితే మాత్రం వాయిదా వేయడం మంచిది' అని హిసాయా సుజుకి అన్నారు.

**నేడు ఐవోసీ సమావేశం**

కరోనా వ్యాప్తి అంతకంతకూ పెరుగుతుండడంతో ప్రస్తుత పరిస్థితిని సమీక్షించేందుకు అంతర్జాతీయ ఒలింపిక్ కమిటీ(ఐవోసీ) మంగళవారం సభ్యక్రీడా దేశాలతో పాటు వివిధ క్రీడా ప్రపంచ సమాఖ్యలతో అత్యవసర సమావేశం నిర్వహించనుంది. కాన్ఫరెన్స్ కాల్ ద్వారా ఈ సమావేశం జరుగనుంది. కరోనా కారణంగా ప్రపంచ వ్యాప్తంగా ఇప్పటి వరకు 6,500మందికి పైగా మృతి చెందగా, లక్షా 75వేల మంది వైరస్ బారిన పడ్డారు.

## నిర్ణయానికి తుదిగడువేం లేదు: ఐవోసీ



జాన్ కోట్స్

**సిడ్నీ:** కరోనా వైరస్ వల్ల టోక్యో ఒలింపిక్స్ నిర్వహణపై సందిగ్ధత కొనసాగుతూనే ఉన్నది. ఈ నేపథ్యంలో విశ్వక్రీడలను రద్దు చేయాల్సి వస్తే, ఆ నిర్ణయం తీసుకునేందుకు ఎలాంటి తుదిగడువు లేదని అంతర్జాతీయ ఒలింపిక్స్ కమిటీ(ఐవోసీ) సమన్వయ కమిషనర్ జాన్ కోట్స్ తెలిపాడు. అయితే ఒలింపిక్స్ సజావుగా సాగుతాయనే ఆశిస్తున్నామని ఆస్ట్రేలియాకు చెందిన ఓ పత్రికకు ఇచ్చిన ఇంటర్వ్యూలో చెప్పాడు. విశ్వక్రీడలపై తుది నిర్ణయం తీసుకునేందుకు మే చివరి గడువని వస్తున్న వార్తల్లో నిజం లేదని జాన్ స్పష్టం చేశాడు. వైరస్ వల్ల క్వాలిఫయింగ్ టోర్నీలు రద్దవుతుండడం అథ్లెట్లకు ఇబ్బందికరంగా మారిందని అన్నాడు. మరోవైపు జపాన్ ప్రధాని షింజో అబేతో పాటు ఐవోసీ చీఫ్ థామస్ బాచ్ కూడా ఒలింపిక్స్ సజావుగా సాగుతాయని చెబుతూనే ఉన్నారు.

## టార్చ్ రిలేకు నో ఎంట్రీ



**ఏథెన్స్:** ప్రతిష్ఠాత్మక ఒలింపిక్ టార్చ్ రిలేకు ప్రేక్షకులను అనుమతించకూడదని గ్రీక్ ఒలింపిక్ కమిటీ నిర్ణయించింది. కరోనా వైరస్ వ్యాప్తిని అరికట్టే ప్రయత్నంలో భాగంగా టోక్యో ఒలింపిక్ జ్యోతి చేతులు మారే సందర్భాన్ని చూసేందుకు అభిమానులకు జారీచేసిన పాస్‌లను రద్దు చేసింది. గత వారం స్పార్టాలో నిర్వహించిన టార్చ్ రిలేకు ప్రజల నుంచి భారీ స్పందన రావడంతో అప్రమత్తమైన కమిటీ.. ఈ నిర్ణయం తీసుకుంది. 1896లో మొదటి ఆధునిక ఒలింపిక్స్ జరిగిన ప్రఖ్యాత ఏథెన్స్ స్టేడియంలో.. గురువారం నిర్వహించనున్న వేడుకకు ముందస్తుగా జారీచేసిన అక్రిడిటేషన్ కార్డులు చెల్లవని కమిటీ స్పష్టంచేసింది. గ్రీక్ ఒలింపిక్ కమిటీ సోమవారం ఈ నిర్ణయం తీసుకున్న అనంతరం కార్యాలయానికి తాళం వేసింది. 'కొవిడ్-19' భయంతో ఇప్పటికే గ్రీస్‌లో రెస్టారెంట్లు, బార్‌లు, కేఫ్‌లు, బీచ్‌లు, రిసార్ట్‌లు, మాల్స్, సినిమా థియేటర్లు మూతబడ్డాయి.

## జర జాగ్రత్త



**న్యూఢిల్లీ:** కరోనా వైరస్ ప్రబలుతున్న నేపథ్యంలో రాబోయే రెండు వారాలు దేశ ప్రజలు అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందని భారత స్టార్ షట్లర్ సైనా నెహ్వాల్ పేర్కొంది. వైరస్ సోకకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని సూచించింది. 'కొవిడ్-19 దరిచేరకుండా ఇండ్లకే పరిమితమవడం మంచింది. వచ్చే రెండు వారాలు మనకు చాలా ముఖ్యం. ఇతర దేశాలు ఎలాంటి చర్యలు తీసుకున్నాయో గమనిస్తూ.. ముందు జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరముంది' అని సైనా సోమవారం ట్విట్టర్‌లో పేర్కొంది. భయపడాల్సిన అవసరం లేదని.. బాధ్యతాయుత పౌరులుగా ప్రభుత్వ నిర్ణయాలను పాటించాలని ప్రపంచ మాజీ నంబర్ వన్ షట్లర్ కిడాంబి శ్రీకాంత్ ట్వీట్ చేశాడు. కరోనా కారణంగా ప్రపంచ బ్యాడ్మింటన్ సమాఖ్య టోర్నీలన్నింటినీ రద్దు చేసిన విషయం తెలిసిందే.

## బీసీసీఐ ఆఫీస్ బంద్

**న్యూఢిల్లీ:** కరోనా వైరస్ ప్రబలుతున్న నేపథ్యంలో భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) కార్యాలయాన్ని మూసేయనుంది. ముంబైలోని బీసీసీఐ ప్రధాన కార్యాలయంలో పనిచేస్తున్న సిబ్బంది మంగళవారం నుంచి ఇంటివద్దే ఉంటూ విధులు నిర్వర్తించాల్సిందిగా ఆదేశాలు జారీచేసినట్లు సమాచారం. దేశవ్యాప్తంగా క్రికెట్ టోర్నీలన్నీ రద్దైన నేపథ్యంలో.. ప్రస్తుతానికి కార్యాలయంలో పెద్దగా పనిలేదని భావించిన బీసీసీఐ ఈ నిర్ణయానికి వచ్చినట్లు బోర్డు అధికారొకరు తెలిపారు. 'కొవిడ్-19 నేపథ్యంలో మంగళవారం నుంచి బీసీసీఐ కార్యాలయం మూతబడనుంది. సిబ్బంది ఇంటి వద్ద నుంచే విధులు నిర్వర్తించాల్సి ఉంటుంది. ఈ మేరకు ఇప్పటికే ఆదేశాలు జారీఅయ్యాయి'అని ఆయన అన్నారు.

## క్రీడాలోకానికి కరోనా కాటు

**న్యూఢిల్లీ:** కరోనా దెబ్బతో క్రీడాలోకం మూగబోవడం విచారకరమని టీమ్ఇండియా ఓపెనర్ రోహిత్ శర్మ అన్నాడు. 'కొవిడ్-19' వ్యాప్తి చెందకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవడంతో పాటు సురక్షితంగా ఉండాలని ప్రజలకు పిలుపునిచ్చాడు. సోమవారం రోహిత్ ట్విట్టర్ ద్వారా ఓ వీడియోను పంచుకున్నాడు. అందులో.. 'గత కొన్ని వారాలుగా మనమంతా కఠిన పరిస్థితులు ఎదుర్కొంటున్నాం. క్రీడాలోకం స్తంభించిపోవడం విచారంగా ఉంది. ఇలాంటి సమయాల్లో ధైర్యంగా ఉండాల్సిన అవసరముంది. వైరస్ దరిచేరక ముందే జాగ్రత్తలు పాటించాలి. పరిసరాలపై ఓ కన్నేసి ఉంచి.. కాస్త అనారోగ్యంగా అనిపిస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలి. తమ ప్రాణాలను లెక్క చేయకుండా.. కరోనా బాధితులకు పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది కృషికి నా అభినందనలు. చివరగా ఒక్కమాట.. జాగ్రత్తగా ఉండండి, సురక్షితంగా ఉండండి' అని పేర్కొన్నాడు. అంతకుముందు కొవిడ్-19పై టీమ్ఇండియా కెప్టెన్ విరాట్ కోహ్లీ స్పందిస్తూ.. 'ధైర్యంగా పోరాడాల్సిన సమయమిది' అని అన్నాడు. ఈ మహమ్మారి బారినపడి మన దేశంలో ఇప్పటికే ఇద్దరు మృతిచెందగా.. మరో 114 మంది వ్యాధి లక్షణాలతో బాధపడుతున్నారు.



రోహిత్

## 'క్రీడాకారులు.. ఆత్మస్థైర్యం కోల్పోకండి'



రిజిజు

**న్యూఢిల్లీ:** ప్రాణాంతక మహమ్మారి కరోనా వైరస్ కారణంగా.. క్రీడాటోర్నీలన్నీ రద్దవుతున్న నేపథ్యంలో కేంద్ర క్రీడాశాఖ మంత్రి కిరణ్ రిజిజు.. ఆటగాళల్లో ధైర్యం నింపే ప్రయత్నం చేశారు. క్లిష్ట సమయంలో క్రీడాకారులు స్థైర్యాన్ని కోల్పోవద్దని పిలుపునిచ్చారు. 'కొవిడ్-19 ప్రభావంతో క్రీడా ఈవెంట్‌లన్నీ వాయిదా పడుతున్నా.. ఆటగాళ్లు ఆత్మవిశ్వాసాన్ని కోల్పోకండి. ప్రాక్టీస్ కొనసాగిస్తూ.. శిక్షణపై మరింత దృష్టిపెట్టి ముందుకు సాగండి' అని రిజిజు ఆదివారం ట్విట్టర్‌లో పేర్కొన్నారు. కాగా, వైరస్ వ్యాప్తిని అరికట్టేందుకు కేంద్ర ప్రభుత్వం విదేశీ ప్రయాణాలపై ఆంక్షలు విధించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో బీసీసీఐతో పాటు అన్నీ జాతీయ ఫెడరేషన్లు కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ సూచనలను పాటించాలని కోరడంతో.. దేశవ్యాప్తంగా మొత్తం క్రీడా ఈవెంట్‌లు రద్దయ్యాయి.

## తీరిక దొరికింది



**న్యూఢిల్లీ:** నిత్యం ఆటలతో, సన్నాహకాలతో తీరిక లేకుండా ఉండే ప్లేయర్లకు ప్రస్తుతం విరామం దొరికింది. కరోనా కారణంగా ప్రపంచ వ్యాప్తంగా చాలా టోర్నీలు రద్దు లేదా వాయిదా పడడంతో ఎప్పుడూ బిజీగా ఉండే చాలా మంది ఆటగాళ్లు ఇండ్లకే పరిమితమయ్యారు. విహారయాత్రలకు వెళ్లే అవకాశం లేకపోవడంతో కుటుంబాలతో సమయాన్ని గడుపుతున్నారు. అరుదుగా లభించే ఇలాంటి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఫుట్‌బాల్ దిగ్గజం లియోనల్ మెస్సీ సైతం అందరికీ సూచించాడు. ప్రపంచ నలుమూలల జరగాల్సిన సిరీస్‌లన్నీ రద్దవడంతో ఇప్పటికే క్రికెటర్లంతా స్వదేశాలకు చేరుకుంటున్నారు. మిగిలిన క్రీడలదీ అదే పరిస్థితి. చాలా మంది ప్లేయర్లు కరోనా వైరస్ పట్ల జాగ్రత్తలు వహించాలని సామాజిక మాధ్యమాల వేదికగా అభిమానులకు సూచనలిస్తున్నారు.

## ప్రాక్టీస్‌కు ఫుల్‌స్టాప్

**న్యూఢిల్లీ:** కరోనా వైరస్ కారణంగా ఈ సీజన్ ఐపీఎల్ వాయిదా పడడంతో ఫ్రాంచైజీలన్నీ ఆటగాళ్ల శిక్షణ శిబిరాలను తాత్కాలికంగా నిలిపివేశాయి. దీంతో ప్లేయర్లందరూ సొంతూళ్లకు వెళ్లిపోతున్నారు. చెన్నై సూపర్ కింగ్స్, కోల్‌కతా నైట్ రైడర్స్, ముంబై ఇండియన్స్ ఇప్పటికే ప్రాక్టీస్ క్యాంపులను నిలిపివేశాయి. రాయల్ చాలెంజర్స్ బెంగళూరు ఆటగాళ్ల సన్నాహకాలు ఈనెల 21న ప్రారంభం కావాల్సి ఉండగా.. యాజమాన్యం రద్దు చేసింది. మిగిలిన ఫ్రాంచైజీలు అదే బాటపట్టాయి. ఆరోగ్య శాఖ మార్గదర్శకాలను అందరూ పాటించాలని ఆటగాళ్లకు సూచిస్తున్నాయి. ప్రేక్షకుల హాజరుపై ఆంక్షలు, విదేశీ ఆటగాళ్లకు ఏప్రిల్ 15వరకు వీసాల నిరాకరణ, మ్యాచ్‌ల నిర్వహణకు మూడు రాష్ట్రాలు విముఖత వ్యక్తం చేయడంతో ఐపీఎల్ 13వ సీజన్ ప్రారంభాన్ని వచ్చే నెల 15వ తేదీకి బీసీసీఐ వాయిదా వేసిన సంగతి తెలిసిందే.



## భారత్ అద్భుతం: అక్తర్

**ఇస్లామాబాద్:** భారత్ అద్భుత దేశమని, భారతీయులు స్నేహశీలురని పాకిస్థాన్ మాజీ క్రికెటర్ షోయబ్ అక్తర్ అన్నాడు. పాకిస్థాన్‌తో కలిసి పనిచేసేందుకు భారత్ సిద్ధంగా ఉందని, కానీ అక్కడి మీడియా ఇరు దేశాల మధ్య యుద్ధాన్ని కోరుకుంటుదని అక్తర్ విమర్శించాడు. భారత్‌లోని ప్రజలు పాక్‌తో శతృత్వాన్ని కోరుకోవడం లేదని చెప్పుకొచ్చాడు. 'క్రికెటర్‌గా, వ్యాఖ్యాతగా నేను భారత్‌లో చాలా ప్రదేశాలు తిరిగాను. పాక్‌తో కలిసి ముందుకు సాగేందుకు వారు సిద్ధంగా ఉన్నట్లు నేను చెప్పగలను. కరోనా వైరస్‌తో అక్కడ ఇద్దరు చనిపోగా, వంద మందికి పైగా బాధపడుతున్నారు. జరిగిన నష్టాన్ని పూడ్చుకునే శక్తి వారికి ఉంది' అని అక్తర్ అన్నాడు.